ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

ప్రకాశం జిల్లా వార్తలు

శనివారం 3, ఫిబ్రవరి 2024

- వైసీపీ నేతల నిర్వాకం
- ట్యాంకర్లతో నీటి తోలకంలో అక్రమాలు
- సరఫరా నిలిపివేతకు ఉన్నతాధికారుల ఆదేశం
- పశ్చిమ ప్రాంతంలో ప్రజల ఇక్కట్లు
- క్షేత్రస్థాయి పరిస్థితిపై కలెక్టర్ దృష్టి
- జేసీ నేతృత్వంలో కమిటీ
- నివేదిక వచ్చేవరకు సరఫరా బంద్



ట్యాంకర్లు నిలిపివేయడంతో దూరంగా ఉన్న బోర్ల నుంచి తోపుడు బండిపై నీళ్లు తెచ్చుకునేందుకు సిద్ధమైన మార్కాపురం మండలం మన్నెంవారిపల్లె మహిళలు

పొదిలి మండలం అక్కచెరువులో నిలిచి ఉన్న నీళ్ల ట్యాంకర్

నీటిలోనూ దోపిడీ

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాలో అధికార పార్టీ నేతలు చేసిన నిర్వాకం పశ్చిమప్రాంత ప్రజలకు కష్టాలను తెచ్చిపెట్టింది. వైసీపీ పాలనలో ఉన్నతస్థాయి ప్రజాప్రతినిధుల నుంచి గ్రామస్థాయి నేతల వరకూ అందినకాడికి దోచుకున్నారు. చివరకు ట్యాంకర్లతో తాగునీటి సరఫరాను కూడా వారు వదలకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ప్రస్తుతం ప్రజలు తాగేందుకు నీరందక గగ్గోలు పెడుతున్నారు. అదేసమయంలో గుర్తించిన ఆ గ్రామాలను హేతుబద్ధంగా పరిశీలించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా అక్రమార్కులపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఏకంగా నీటి సరఫరాను నిలిపేశారు. దీంతో ప్రత్యామ్నాయం లేక రెండురోజులుగా పశ్చిమప్రాంత పల్లెల్లోని జనం ఇబ్బందులు పడుతున్నారు.

ఒంగోలు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రత్యేకించి పశ్చిమప్రాంతంలోని వైపాలెం, మార్కాపురం, దర్శి, గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గాల్లోని అనేక గ్రామాల్లో ఏడాది పొడవునా ట్యాంకర్లతో నీటి సరఫరా జరుగుతోంది. వేసవిలో 400 వరకు ఆవాసాల్లో ఇలాంటి పరిస్థితి ఎదురవుతోంది. ప్రస్తుతం కూడా నాలుగు నియోజకవర్గాల్లోని 12 మండలాల పరిధిలో 82 హ్యాబిటేషన్లకు రోజుకు 800 ట్రిప్పుల నీటిని సరఫరా చేస్తున్నారు. గతంలో ఇలాంటి పరిస్థితి ఎదురైనప్పుడు ట్యాంకర్లతో నీటి సరఫరా చేసి వాటిపై నిఘా ఉంచి ఎప్పటికప్పుడు బిల్లులు ఇచ్చేవారు. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చాక అంతా ఇష్టారాజ్యమైంది. అధికార పార్టీ నేతలకు ఇదో ఆదాయవనరుగా మారింది. అదేసమయంలో నిఘా కొరవడింది. దీంతో గ్రామస్థాయిలోని వైసీపీ నేతలు, ఆపార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ఇష్టారీతిన నీటి ట్యాంకర్ల సరఫరాలో అక్రమాలకు పాల్పడుతున్నారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఇతర వనరులు ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోకుండా చిన్నచిన్న మరమ్మతులు చేస్తే నీటి సరఫరాకు వీలున్న వాటిని చేయకుండా ట్యాంకర్లతో తోలడం రివాజైంది. అందులోనూ నాలుగు తోలి పది నమోదు చేస్తున్నప్పటికీ అదేమని అడగలేని దుస్థితిలో యంత్రాంగం ఉంది. అదేసమయంలో బిల్లులను సకాలంలో ప్రభుత్వం ఇవ్వకపోతుండటంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు కూడా నీటిని తోలే కాంట్రాక్టర్లపై నియంత్రణ కొరవడింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక 2019 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు సుమారు రూ.132కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉండగా రెండు మూడుసార్లు కలెక్టర్ లేఖలతో రూ.70 కోట్లు ఇటీవల చెల్లించారు. ఇంకా రూ.60కోట్లకుపైగా రావాల్సి ఉంది.

అక్రమాలు, అవకతవకలు గుర్తింపు

జిల్లాలో ట్యాంకర్లతో నీటి సరఫరా నిరంతరం చేస్తుండటం, అందుకు భారీగా వ్యయం అవుతుండటంతో ఉన్నతాధికారులు దృష్టిసారించారు. ఈ వ్యవహారంలో భారీగా అక్రమాలు జరుగుతున్నట్లు సమాచారం రావడంతో విచారణకు ఆదేశించారు. పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ బి.రాజశేఖర్ ఆదేశాలతో గత నెలలో ప్రత్యేక బృందం వైపాలెం నియోజకవర్గంలో పర్యటించింది. ట్యాంకర్లతో నీటి సరఫరాలో అక్రమాలు, అవకతవకలు జరుగుతున్నట్లు గుర్తించింది. ఆమేరకు సెక్రటరీకి నివేదించడంతో తక్షణం ట్యాంకర్లను ఆపేయాలని జిల్లా అధికారులను ఆయన ఆదేశించారు. తదనుగుణంగా జిల్లాలో రెండు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. ఇప్పటి వరకూ ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో 43, మార్కాపురంలో 23, దర్శి సెగ్మెంట్‌లో 15, గిద్దలూరులో ఒకటి వెరసి 82 ఆవాసాలలో ట్యాంకర్లతో సరఫరా జరుగుతుండగా వాటన్నింటికీ నీటి సరఫరా బంద్ అయ్యింది. ప్రజలకు ఇబ్బందిలేకుండా నీటి సరఫరా చేస్తూ అక్రమ వ్యవహారాలను వెలుగులోకి తెచ్చి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఏకంగా నీటి సరఫరాను నిలిపివేయడం ఆ ప్రాంత ప్రజలకు ఇక్కట్లను తెచ్చిపెట్టింది.

పరిశీలించాకే సరఫరా పునరుద్ధరణ

క్షేత్రస్థాయిలో పరిస్థితిపై కలెక్టర్ దృష్టిసారించారు. పంచాయతీరాజ్‌శాఖ సెక్రటరీ నుంచి వచ్చిన నీటి సరఫరా నిలిపివేత ఉత్తర్వులు, క్షేత్రస్థాయిలో ప్రజల ఇక్కట్ల నేపథ్యంలో సమగ్ర పరిశీలనకు ఆయన నిర్ణయించారు. అందుకోసం జేసీ గోపాలకృష్ణ నేతృత్వంలో వివిధ స్థాయిల్లోని అధికారులతో కమిటీని నియమించారు. ప్రస్తుతం నీటి సరఫరా జరుగుతూ నిలిపివేసిన ఆవాసాలలో సమస్య నిజంగా ఉందా? అక్కడ ఉన్న నీటి వనరుల పరిస్థితేమిటి? వాటికి మరమ్మతులు, ఇతరత్రా చర్యలు తీసుకుంటే సమస్య పరిష్కారం అవుతుందా? ట్యాంకర్లతో నీటి సరఫరా తప్ప మరొక మార్గం లేదా? అన్న అంశాలను పరిశీలించి మూడు రోజుల్లో నివేదించాలని ఆదేశించారు. అనంతరం ట్యాంకర్లతో నీటిని తోలితే తప్ప సమస్య తీరే అవకాశం లేని హ్యాబిటేషన్లకు సరఫరాను పునరుద్ధరించే యోచనలో అధికారులు ఉన్నట్లు సమాచారం. అయితే అధికారుల పరిశీలన పూర్తయి దానిని కలెక్టర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారి నుంచి మళ్లీ అనుమతి పొందిన తర్వాత తిరిగి సరఫరా చేసే అవకాశం ఉంది. అప్పటివరకు ప్రజలకు నీటి కష్టాలు తప్పేట్లు కనిపించడం లేదు. మరోవైపు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పెండింగ్ బిల్లులు రూ.60కోట్లు రావాల్సి ఉండటంతో నీటిని తోలిన వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది.

ముదిరిన సంక్షోభం

- మరో ఇద్దరు ఎమ్మెల్యేలకు స్థానచలనం
- మార్కాపురంలో పోటీకి సై అన్న రాంబాబు
- ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి మౌనరాగం
- మాజీ ఎమ్మెల్యే జంకె వైరాగ్యం
- చివర్లో ఆగిన కందుకూరుపై ప్రకటన
- బాలినేనితో వైసీపీ ఎంపీపీలు, జడ్పీటీసీల భేటీ

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఓటమి భయంతో సిటింగ్ ఎమ్మెల్యేల బదిలీలు, తొలగింపులకు శ్రీకారం పలికిన వైసీపీ అధిష్ఠానం తాజాగా మరో ఇద్దరు ఎమ్మెల్యేలను అటుఇటు మార్పుచేసింది. దీంతో జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల అభ్యర్థుల ఎంపికను ఇప్పటికి వైసీపీ పూర్తిచేసినట్లైంది. అయితే ఆ పార్టీలో సంక్షోభ పరిస్థితులు తీవ్రమయ్యాయి. పలువురు ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, ఇతర ముఖ్యనాయకులు హైదరాబాద్ చేరి బాలినేనితో భేటీ అయ్యారు. పలు పరిణామాల అనంతరం మార్కాపురం ఎమ్మెల్యేను గిద్దలూరుకు, గిద్దలూరు ఎమ్మెల్యేను మార్కాపురానికి బదిలీ చేసి పార్టీ బాధ్యతలు అప్పగించగా.. రెండు చోట్లా శ్రేణుల్లో అసంతృప్తి జ్వాలలు వ్యక్తమవుతున్నాయి. జంకె వెంకటరెడ్డి పార్టీకి గుడ్‌బై చెప్పే యోచనలో ఉన్నట్లు తెలిసింది.

అటు, ఇటు మార్పు

ముందునుంచి అనుకుంటున్నట్లు పోటీచేయనని ప్రకటించిన అన్నా రాంబాబును మార్కాపురం ఇన్‌చార్జిగా, సొంత నియోజకవర్గాన్ని వదలనని భీష్మించుకున్న నాగార్జునరెడ్డిని గిద్దలూరు ఇన్‌చార్జిగా జగన్ నిర్ణయించారు. ఆమేరకు ఆయా నియోజకవర్గాలకు వెళ్లి పనిచేసుకోవాలని వారిని ఆదేశిస్తూ భుజంతట్టి పంపారు. ఆ సందర్భంగా నాగార్జునరెడ్డి స్థానిక పరిస్థితులను వివరించే ప్రయత్నం చేయగా 'అవేమీ వద్దు. నేను చెప్తున్నా.. వెళ్లండి. మీకు అంతా మంచే జరుగుతుంది' అని జగన్ ఆదేశించినట్లు తెలిసింది. ముందు నుంచే గిద్దలూరు నుంచి తప్పుకోవాలని భావిస్తూ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్న రాంబాబు వెంటనే మార్కాపురంలో పోటీకి సై అన్నట్లు సమాచారం. అయితే నాగార్జునరెడ్డి మాత్రం సీఎంకు ఏమీ చెప్పలేక, చెప్పే అవకాశం ఆయన ఇవ్వక మనోవేదనలో ఉన్నట్లు తెలిసింది. నియోజకవర్గానికి వెళ్లి కుటుంబసభ్యులు, అనుచరులతో మాట్లాడి గిద్దలూరు వెళ్లే విషయంపై తుదినిర్ణయం తీసుకోవాలన్న ఆలోచనలో ఆయన ఉన్నట్లు సమాచారం. శుక్రవారం నాటి నియామకాలతో అన్నిచోట్లా ఇన్‌చార్జిల పేరుతో వైసీపీ అభ్యర్థులను ఎంపికచేసినట్లు అయింది.



సీఎం జగన్‌తో ఎమ్మెల్యేలు రాంబాబు, నాగార్జునరెడ్డి, వైసీపీ సమన్వయకర్త చెవిరెడ్డి, చేగిరెడ్డి తదితరులు

గిద్దలూరు, మార్కాపురంలలో తీవ్ర అసంతృప్తులు

గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గాల్లోని శ్రేణుల్లో అసంతృప్తులు వ్యక్తమవుతున్నాయి. వైసీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి పార్టీ నిర్ణయంపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. 2019లో టికెట్ ఇవ్వకపోగా ఎమ్మెల్సీ ఇస్తామని చెప్పారు. ఆ పదవి ఇవ్వకపోగా ఈ ఎన్నికల్లో టికెట్ ఇస్తామని ఆశ చూపి మోసం చేశారంటూ వ్యాఖ్యానిస్తున్నట్లు తెలిసింది. నియోజకవర్గంలోని ఆయన అనుచరులు మీరు ఉన్నా మేము వైసీపీకి చేసేది లేదని ఆయనకు ముఖం మీదనే చెప్పేశారు. మరోవైపు ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి అనుచరులు పార్టీ నిర్ణయంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఎమ్మెల్యే తండ్రి, అలాగే ఆయన మామ వర్గీయులంతా పార్టీ నిర్ణయాన్ని స్వాగతించలేమని చెప్పినట్లు తెలిసింది. గిద్దలూరులో అయితే ముందుగానే స్థానికేతరులకు అవకాశం ఇస్తే సహకరించబోమని బలమైనవర్గం నాయకులు ప్రకటించారు. తొలుత గిద్దలూరు టికెట్ ఇవ్వాలని భావించిన లింగారెడ్డిని శుక్రవారం సీఎం వద్దకు పిలిచి సమాచారం ఇవ్వగా అక్కడే కన్నీరుపెట్టుకున్నారు. అయితే సీనియర్ అవడమేగాక పార్టీ అధ్యక్షుడిగా కూడా ఉన్న జంకెని కనీసం పిలవకపోవడం ఆయన అనుచరుల్లో తీవ్ర ఆగ్రహాన్ని కలిగించింది. ఇక గిద్దలూరులోని పలువురు ద్వితీయశ్రేణి నాయకులు, ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు శుక్రవారం హైదరాబాద్‌లో బాలినేనితో సమావేశం కావడం విశేషం. మార్కాపురం నియోజకవర్గానికి చెందిన కొందరు నాయకులు కూడా ఆయనతో సమావేశమైనట్లు తెలిసింది.

చివర్లో కందుకూరు ప్రకటన వాయిదా

కందుకూరు నియోజకవర్గ అభ్యర్థి నియామకాన్ని కూడా శుక్రవారం ప్రకటించాలనుకున్నప్పటికీ అధిష్ఠానం చివర్లో వాయిదా వేసుకున్నట్లు తెలిసింది. ప్రస్తుత ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి స్థానే బీసీ అభ్యర్థిని రంగంలోకి దించాలని భావించారు. బొట్ల రామారావు పేరును పరిశీలించిన అధిష్ఠానం తాజాగా కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ పేరును పరిశీలనలోకి తీసుకుంది. శుక్రవారం తాడేపల్లిలో బుర్రా మీడియా సమావేశాన్ని ఏర్పాటుచేసి తాను జగన్‌కు నమ్మిన బంటునని ఆయన ఏది చెప్తే అది చేస్తానని, కనిగిరిలో వైసీపీని గెలిపిస్తానని చెప్పారు. తద్వారా ఆయనకు కందుకూరు టికెట్ ఖరారైందని భావించారు. ఆ మేరకు అధిష్ఠానం జాబితాను కూడా సిద్ధం చేసింది. అయితే బుర్రా చివర్లో తనకు కందుకూరు కాదు కనిగిరే కావాలనడంతో కందుకూరు ఇన్‌చార్జి ప్రకటనను వాయిదా వేసినట్లు తెలిసింది. ఈనెల 27న రాజ్యసభ ఎన్నికలు జరగనున్నందున ఎమ్మెల్యేలను పూర్తిగా పక్కనపెట్టే అంశాలపై అధిష్ఠానం ఆచితూచి వ్యవహరిస్తున్నదని, అందులో భాగంగానే కందుకూరు అభ్యర్థిని ప్రకటించలేదని భావిస్తున్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి

- కలెక్టర్ దినేష్‌కుమార్



జిల్లా అవతరణ వేడుకల్లో నాట్యం చేస్తున్న విద్యార్థిని



ఒంగోలులో ప్రకాశం పంతులు విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, అధికారులు

ఒంగోలు (కలెక్టరేట్), ఫిబ్రవరి 2: 'సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ప్రకాశం జిల్లాలో సాధించాల్సిన లక్ష్యాలు ఎన్నో ఉన్నాయి. నేటి యువత వాటి సాధనకు కృషిచేయాలి. జిల్లా సమగ్రాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి' అని కలెక్టర్ దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. 55వ జిల్లా అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక స్పందన హాలులో జరిగిన సభలో కలెక్టర్ మాట్లాడారు. 1970లో నెల్లూరు, గుంటూరు, కర్నూలు జిల్లాల్లోని సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాలను ఒకటిగా చేసి ఈ ప్రాంతవాసైన టంగుటూరి ప్రకాశం పంతులు పేరుతో ప్రకాశం జిల్లాను ఏర్పాటు చేశారన్నారు. జిల్లా 56 మండలాలతో ఏర్పడగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సౌలభ్యం కోసం 2022లో ప్రతి పార్లమెంట్ పరిధిలో ఒక జిల్లాను ఏర్పాటు చేశారన్నారు. విభజన అనంతరం జిల్లాలో మూడు రెవెన్యూ డివిజన్లతోపాటు 39 మండలాలు ఉన్నాయని చెప్పారు. అంతకు ముందు ప్రకాశం పంతులు విగ్రహానికి కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ ఆర్.గోపాలకృష్ణ, సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా, అసిస్టెంట్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, డీఆర్వో ఆర్.శ్రీలత, మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ మహబూబ్ బాషాలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ జిల్లా జెండాను ఆవిష్కరించారు. ప్రకాశం ముని మనమడైన టంగుటూరి సంతోష్‌కుమార్, రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ డాక్టర్ చలమయ్యతోపాటు పలువురిని సత్కరించారు. వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, డ్రాయింగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

విస్మరించిన మంత్రులు, ప్రజాప్రతినిధులు

జిల్లా 55వ అవతరణ దినోత్సవాన్ని ప్రజాప్రతినిధులు విస్మరించారు. ఏటా కలెక్టరేట్‌లో జరిగే ఈ వేడుకలకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు ఇతర ప్రజాప్రతినిధులందరూ హాజరయ్యేవారు. త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అధికారపార్టీలో కొనసాగుతున్న ఉత్కంఠతో మంత్రులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ కలెక్టరేట్ వైపు చూడలేదు. కేవలం నామినేటెడ్ పోస్టుల్లో ఉండే ఒకరిద్దరు తప్ప ఇతర ప్రజాప్రతినిధులు వేడుకల్లో పాల్గొనలేదు. దీంతో జిల్లా అధికారులే ఈ వేడుకలను నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడటంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అక్రమార్కులపై వేటుపడేనా?

- వైద్యశాఖ నియామకాల్లో భారీగా అవకతవకలు
- 41 మంది అనర్హులకు కొలువులు
- గుర్తించిన విచారణ కమిటీ
- ముగ్గురు అధికారులు, ఏడుగురు ఉద్యోగులు, సిబ్బంది నిర్లక్ష్యం
- కలెక్టర్‌కు సమగ్ర నివేదిక

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 2 : వైద్యారోగ్యశాఖలో చేపట్టిన ఉద్యోగ నియామకాల్లో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నట్లు విచారణ కమిటీ తేల్చింది. 2020లో భర్తీచేసిన పోస్టుల్లో 41మంది అనర్హులకు కొలువులు కట్టబెట్టినట్లు గుర్తించింది. మొత్తం నాలుగు రకాల నియామకాల్లో చోటుచేసుకున్న అక్రమాలపై కలెక్టర్ దినేష్‌కుమార్‌కు సమగ్ర నివేదికను అందజేసినట్లు తెలిసింది. అయితే ఆ అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. జిల్లా వైద్యారోగ్యశాఖలో 2020లో భర్తీచేసిన పోస్టుల్లో భారీ అక్రమాలతోపాటు అనర్హులకు ఉద్యోగాలు ఇచ్చినట్లు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. వాటిపై స్పందించిన కలెక్టర్ దినేష్‌కుమార్ సమగ్ర విచారణకు కమిటీని నియమించారు. జడ్పీ సీఈవో జాలిరెడ్డి నేతృత్వంలో డీఈవో వీఎస్ సుబ్బారావు, సీనియర్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, డైట్ ప్రిన్సిపాల్‌ను విచారణాధికారులుగా నియమించారు.

50 రోజులు కొనసాగిన విచారణ

కలెక్టర్ నియమించిన కమిటీ వైద్యశాఖ కార్యాలయంలో 50రోజులపాటు విచారణ చేసింది. నోటిఫికేషన్ నాటి నుంచి ఉద్యోగ నియామకాల వరకు జరిగిన అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించింది. దరఖాస్తుల స్వీకరణ నాటి నుంచి మెరిట్ జాబితా ప్రచురణ, అభ్యర్థుల సర్టిఫికెట్లను కూడా పరిశీలించినట్లు సమాచారం. మొత్తం నాలుగు విభాగాల్లో 395 ఉద్యోగాలను భర్తీచేయగా అందులో 41మంది అనర్హులకు పోస్టులు ఇచ్చినట్లు తేల్చారు. అందుకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఆ విచారణ నివేదికలో కలెక్టర్ దినేష్‌కుమార్‌కు నివేదించినట్లు సమాచారం. 342 స్టాఫ్‌నర్సుల ఉద్యోగాలు భర్తీచేయగా అందులో 23మంది అనర్హులు ఉన్నట్లు తెలిసింది. ల్యాబ్ టెక్నీషియన్స్ విభాగంలో 33 ఉద్యోగాలకు 14మందిని, ఫార్మాసిస్టు విభాగంలో 18 మందికి ముగ్గురు, రేడియాలజిస్ట్ విభాగంలో రెండు పోస్టులకు ఒక పోస్టును అనర్హులకు ఇచ్చినట్లు తెలిసింది.

మెరిట్ జాబితాను పరిశీలించకుండానే ఉద్యోగాలు

ఉద్యోగాల నియామక సమయంలో ముగ్గురు డీఎంహెచ్‌వోలుగా పని చేసినట్లు విచారణ కమిటీ గుర్తించినట్లు సమాచారం. ఆ ముగ్గురు కూడా కనీసం మెరిట్ జాబితాలను పరిశీలించకుండానే ఉద్యోగాలు ఇచ్చారని నిర్ధారించినట్లు తెలిసింది. ఆయా పోస్టులను భర్తీచేసిన సూపరింటెండెంట్‌తోపాటు మిగిలిన ఆరుగురు ఉద్యోగులు కూడా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు విచారణ నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. ఆయా ఉద్యోగులపై ఏఏ చర్యలు తీసుకోవాలో విచారణ కమిటీ స్పష్టంగా చెప్పినట్లు తెలిసింది. నివేదికను పరిశీలించిన కలెక్టర్ ఉద్యోగ నియామకాల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు సమాచారం. వారు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సి ఉంది.



ఒంగోలులో చెవిరెడ్డి ఫ్లెక్సీల చించివేత

- బాలినేనికన్నా పైన ఫొటో పెట్టడంపై అనుచరుల ఆగ్రహం
- వారిని అరెస్టు చేయాలంటూ పోలీసులకు సీఎంవో నుంచి ఫోన్

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

సీఎం ఏరికోరి ఒంగోలు పార్టీ బాధ్యతలు అప్పగించిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఫ్లెక్సీలను గురువారం అర్ధరాత్రి కొందరు చించివేశారు. కొన్ని ఫ్లెక్సీలను దహనం చేశారు. అలాగే మంత్రి మేరుగ నాగార్జున క్యాంపు కార్యాలయానికి ముఖద్వారంగా ఏర్పాటు చేసుకున్న వాటిని కూడా చించివేశారు. దీంతో అధిష్ఠానం సీరియస్ అయింది. ఎస్ఎన్‌పాడు ఇన్‌చార్జిగా నియమితులైన మంత్రి నాగార్జున ఒంగోలులో తన క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆ కార్యాలయానికి వెళ్లే దారిలో ముఖద్వారంలో ఒకపక్క పైన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఫొటో పెట్టి దాని కింద ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని ఫొటోను ఉంచారు. కాగా గురువారం అర్ధరాత్రి పైన చెవిరెడ్డి ఫొటో పెట్టిన ఫ్లెక్సీ వరకు చించివేశారు. అలాంటి కొన్ని ఫ్లెక్సీలను దహనం కూడా చేశారు. ఎమ్మెల్యే బాలినేని ఫొటోను పైన ఉంచి ముద్రించిన ఫ్లెక్సీలను మాత్రం అలానే ఉంచారు. దీంతో ఇది బాలినేని అనుచరుల పనేనని అందరూ భావిస్తున్నారు. శుక్రవారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించి మంత్రి మేరుగ నాగార్జున సజ్జలకు ఫోన్ చేసినట్లు సమాచారం. వెంటనే సజ్జల బాలినేనికి ఫోన్ చేయగా ఫొటోల విషయమై తన అనుచరులు బాధపడి ఉండొచ్చు. ఏమి జరిగిందో తెలుసుకుంటానని బాలినేని అన్నట్లు సమాచారం. ఈ విషయాన్ని సీఎం జగన్‌తోపాటు వైసీపీ అధిష్ఠానం కూడా సీరియస్‌గా తీసుకున్నట్లు సమాచారం. జగన్ నేరుగా మంత్రి నాగార్జునకే ఫోన్ చేసి ధైర్యంగా ఉండు, నేనే ఎస్ఎన్‌పాడు వచ్చి పార్టీ చేపట్టిన సిద్ధం కార్యక్రమం నిర్వహిస్తానని భరోసా ఇచ్చినట్లు తెలుస్తోంది. మరోవైపు సీఎంవో అధికారులు ఎస్పీకి ఫోన్‌చేసి ఈ ఘటనకు ఎవరు కారకులో గుర్తించి చర్యలు తీసుకోవాలని చెప్పినట్లు సమాచారం. దీంతో పోలీసు అధికారులు ఆరా తీస్తున్నారు. శుక్రవారం రాత్రి వరకూ ఎలాంటి కేసులు పెట్టలేదని సమాచారం.



మంత్రి నాగార్జున క్యాంప్ కార్యాలయానికి వెళ్లే దారిలో చించేసిన స్వాగత ద్వారం ఫ్లెక్సీ



దహనం చేసిన చెవిరెడ్డి ఉన్న ఫ్లెక్సీలు

విద్యార్థులకు ప్రోత్సాహకాల ప్రదానం



చెక్కును అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 2: నేషనల్ గర్ల్ చైల్డ్ డే సందర్భంగా వైద్యఆరోగ్య శాఖ, విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థినులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు కలెక్టర్ దినేష్‌కుమార్ నగదు బహుమతులను అందజేశారు. స్థానిక స్పందనహాలులో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వ్యాసరచన, వక్తృత్వ, పెయింటింగ్ పోటీల విజేతలకు మొదటి బహుమతి రూ.5వేలు, ద్వితీయ బహుమతి రూ.3వేలు, తృతీయ బహుమతి రూ.2వేల చెక్కులను ఆయన ప్రదానం చేశారు. కార్యక్రమంలో జేసీ ఆర్.గోపాలకృష్ణ, గర్ల్ చైల్డ్ డవలప్‌మెంట్ అధికారి మాధవీలత, జిల్లా మాస్ మీడియా అధికారులు శ్రీనివాసులు, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 2 : జాతీయ నూతన విద్యా విధానం-2020ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో శనివారం జరిగే ర్యాలీ, ధర్నాను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షులు కేవీజీ.కీర్తి, గౌరవాధ్యక్షుడు అమ్మయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.అశోక్‌కుమార్, ఐఫియా కౌన్సిలర్ పీవీ.సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రం నుంచి ఏపీటీఎఫ్ కార్యకర్తలతో పాటు విద్యాపరిరక్షణ కమిటీ కార్యకర్తలు, నాయకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

టీడీపీ గెలుపు కోసం కృషి చేయాలి

● పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల



ప్రచారం నిర్వహిస్తున్న దామచర్ల జనార్దన్

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 2: అందుబాటులో ఉన్న సామాజిక మాధ్యమాలను ఉపయోగించి ప్రజలకు టీడీపీ పాలనలో జరగబోయే మేలును వివరించి గెలుపు కోసం కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ పార్టీ శ్రేణులకు దిశ నిర్దేశం చేశారు. శుక్రవారం ఒంగోలులోని ఎన్టీఆర్‌భవన్‌లో ఒంగోలు నియోజకవర్గం బూత్, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జులతో ఏర్పాటు చేసిన సమావేశంలో దామచర్ల మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ప్రతి రోజు ప్రజల సమస్యలపై పనిచేయాలన్నారు. అలాగే బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. అలాగే కొత్తగా వచ్చిన ఓటరు లిస్ట్‌లను పరిశీలన చేయాలన్నారు. ప్రతి 60 ఓట్లకు ఒకరిని కుటుంబ సాధికార సభ్యులుగా నియమించుకుని వైసీపీ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలకు వివరించాలన్నారు. ప్రస్తుతం ఆధునిక టెక్నాలజీ అందుబాటులో ఉన్నందున దానిని ఉపయోగించి తెలుగుదేశం పార్టీ సంక్షేమాలు, మేనిఫెస్టోలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. సమావేశంలో నగర అధ్యక్షుడు కొఠారి నాగేశ్వరరావు, కామేపల్లి శ్రీనివాసరావు, కపిల్‌బాషా, కమ్మ వెంకటేశ్వర్లు, పాలూరి వెంకటేశ్వరరెడ్డి, ట్రైనర్ గోపు వీరాంజనేయులు, ఐటీడీపీ ఇన్‌చార్జి నక్కా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమం తెలుగుదేశంతోనే ..

అన్ని వర్గాల సంక్షేమం టీడీపీతోనే సాధ్యపడుతుందని, వైసీపీ పాలనలో అందరికీ ఆర్థిక భారాలు పెరిగిపోయాయని రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ తెలిపారు. బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ, జనం కోసం జనార్దన్ కార్యక్రమం శుక్రవారం నగరంలోని 50వ డివిజన్ వెంకటేశ్వరకాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల ప్రతి ఇంటికీ వెళ్ళి ప్రజలను కలిసి మాట్లాడారు. తాను ఎమ్మెల్యేగా ఒంగోలును అభివృద్ధి చేశానని, వైసీపీ అధికారంలోకి వచ్చి ఐదేళ్ళు కావస్తున్నా నేటికీ ఇంత వరకు నగర అభివృద్ధి గురించి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత కరెంటు చార్జీలు విపరీతంగా పెరిగాయన్నారు. అలాగే ఆర్టీసీ ఛార్జీలు పెంచేశారని, నిత్యావసర ధరలు ఆకాశాన్నంటుతున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రజలు సైకో పాలనను ఓడించి తెలుగుదేశం పార్టీని గెలిపించాలని ఆయన కోరారు.

మెగా డీఎస్సీ పేరుతో మరోసారి జగన్‌రెడ్డి మోసం

● తెలుగు యువత, టీఎన్‌ఎస్‌ఎఫ్ ధ్వజం



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 2: అధికారంలోకి రాగానే ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని ప్రగల్భాలు పలికిన జగన్ ఐదేళ్ళుగా ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేయలేదని, తాజాగా ఎన్నికల సమయంలో మెగా డీఎస్సీ పేరుతో మరోసారి మోసం చేసేందుకు వస్తున్నారని తెలుగు యువత, టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకుల ఆరోపించారు. మెగా డీఎస్సీ మోసాన్ని నిరసిస్తూ టీడీపీ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని బాపూజీ కాంప్లెక్స్ వద్ద గాంధీజీ విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సదర్భంగా చెవిలో పూలు పెట్టుకుని వైసీపీ ప్రభుత్వం అబద్దపు ప్రచారాన్ని వారు ఎద్దేవా చేశారు. చదువులు పూర్తి చేసుకుని లక్షలాది మంది నిరుద్యోగులు ఐదేళ్ళుగా ఎదురు చూస్తుంటే పట్టించుకోని జగన్‌రెడ్డికి కొత్తగా ఇపుడు నిరుద్యోగులు గుర్తువచ్చారా అని ప్రశ్నించారు. త్వరలోనే ఎన్నికలు వస్తున్న తరుణంలో ఇలా అబద్ధపు హామీలు చేసి మరోసారి నిరుద్యోగులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి రాగానే వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడానికి చంద్రబాబు నాయుడు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో తెలుగుయువత అధ్యక్షుడు ముత్తన శ్రీనివాసరావు, నాయకులు నల్లమోతు రమేష్, షేక్ ఉమర్, కొత్తపట్నం మండల అధ్యక్షుడు పిన్నిక దేవప్రసాద్, కొప్పురావూరి సురేష్, మంచు లలిత్‌కుమార్, బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.

సుపరిపాలన అందించటమే లక్ష్యం

● మంత్రి ఆదిమూలపు సురేష్



పృథులగిరి తారురోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి సురేష్

మర్రిపూడి, ఫిబ్రవరి 2 : ప్రజలకు సుపరిపాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. శుక్రవారం మర్రిపూడి నుంచి పృథులగిరి కొండ కింద మెట్లమార్గం పక్కగా యానాది కాలనీ వరకు రూ.8.5 కోట్లతో చేపట్టనున్న తారురోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 11.5 కిలోమీటర్ల రహదారి నిర్మాణంతో పొదిలి-మర్రిపూడి మండలాలకు అనుసంధానం ఏర్పడుతుందన్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పృథులగిరి లక్ష్మీ నరసింహస్వామి దర్శనానికి వెళ్లే భక్తులకు రవాణా సౌకర్యం మెరుగవుతుందని చెప్పారు. మార్చిలో జరిగే స్వామివారి బ్రహ్మోత్సవాల లోపే పనులను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కొండపై ఘాట్ రోడ్డు నిర్మాణం కోసం రూ.8 కోట్ల అంచనాతో ముఖ్యమంత్రి వద్ద ఫైలు పెండింగ్‌లో ఉందని మంత్రి చెప్పారు. అనంతరం పృథులగిరి సమీపంలో 60 ఏళ్ల క్రితం నిర్మించిన పంచాయతీరాజ్ రోడ్డును ఆయన పరిశీలించారు. తారురోడ్డు అభివృద్ధి పనులకు అవసరమైన అనుమతులు వెంటనే మంజూరు చేయాలని అక్కడి నుంచే అటవీశాఖ సీసీఎఫ్ చిరంజీవి చౌదరిని కోరారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎస్ఈ కొండయ్య, డీఈ శ్రీధర్‌రెడ్డి, ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, సర్పంచ్ కదిరి భాస్కర్, మర్రిపూడి, చిమట సొసైటీల అధ్యక్షులు బీవీ.భాస్కర్‌రెడ్డి, మాకినేని వెంకట్రావు, నాయకులు బోదా రమణారెడ్డి, దద్దాలి మల్లికార్జునరావు, ఇంకొల్లు పిచ్చిరెడ్డి, బీవీ భాస్కర్‌రెడ్డి, మాచేపల్లి నాగయ్య, ఇనుకొల్లు సుబ్బారెడ్డి, గొంటు నరసారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ సంజీవరెడ్డి, ఉప్పు చిరంజీవి, కె.ఇజ్రాయేల్, ఎం.హనుమంతరావు, బొగ్గుల శ్రీనివాసరెడ్డి, మాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆసరా చెక్కు అందజేత

కొండపి: మండలంలోని 887 డ్వాక్రా గ్రూపులకు చెందిన 8,842 మంది మహిళలకు వైఎస్సార్ ఆసరా కింద రూ.6.93 కోట్లు మంజూరయ్యాయి. అందుకు సంబంధించిన నమూనా చెక్కును రాష్ట్ర మంత్రి, వైసీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్ శుక్రవారం స్థానిక మండల కార్యాలయాల ఆవరణలో జరిగిన సభలో వీవోఏలకు అందజేశారు. కార్యక్రమంలో వెలుగు పీడీ వసుంధర, ఏపీఎం కె.రాజ్యలక్ష్మి, వైసీపీ మండల అధ్యక్షుడు ఆరికట్ల కోటిలింగయ్య, జేసీఎస్ కన్వీనర్ గొట్టిపాటి మురళి, వైస్ ఎంపీపీలు రావులపల్లి కోటరాజు, వేముల ప్రసాద్, డాకా పిచ్చిరెడ్డి, మారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, బొక్కిసం ఉపేంద్రచౌదరి, గోవిందు కృష్ణమూర్తి, భువనగిరి సత్యన్నారాయణ పాల్గొన్నారు.

మహిళా మోర్చా నూతన కమిటీ



కమిటీ సభ్యులతో నాయకులు

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి2: ఒంగోలులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నూతన మహిళా జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలిగా మలినేని గీతాంజలి, ఉపాధ్యక్షులుగా మద్ది నేని లక్ష్మీదేవి, గుర్రం కుమారి, బొరుసు లలిత, షేక్ ముతారాసుల్తానా, పల్లేటి శివకుమారి, బి.విజయరావు, కార్యదర్శులుగా డి.ప్రసన్నలక్ష్మి, ప్రసన్న జ్యోతి, షేక్ ఆదాని, ధనిశెట్టి మాధవి, డి.అజంతా, ఇతర కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు శాసనాల సరోజిని, తీగల సత్యవతి, జజ్జర కృష్ణవేణి, జువ్విగుంట కోటేశ్వరి, లంకా దినకర్, చిగురుపాటి కుమారస్వామి, రవిశంకర్, కోరంకి నాగేశ్వరరావు, శివాజీయాదవ్, ధనిశెట్టి రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో సీఆర్‌పీ సుజాత మృతి



సుజాత (ఫైల్)

టంగుటూరు, ఫిబ్రవరి 2 : మర్లపాడు స్కూల్ కాంప్లెక్స్ సీఆర్‌పీగా విధులు పనిచేస్తున్న టి.సుజాత (42) గుండెపోటుతో మృతి చెందారు. మూడు రోజుల క్రితం ఆమె తండ్రి వయోభారంతో మరణించారు. అప్పటి నుంచి తీవ్ర మనోవేదనతో ఉన్న సుజాత గురువారం రాత్రి ఒక్కసారిగా అనారోగ్యానికి గురయ్యారు. కుటుంబ సభ్యులు వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో గుండెపోటుకు గురై మృతి చెందారు. ఈమెకు భర్త, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వీరిలో ఒక కుమార్తెకు ఏడాది క్రితం వివాహమైంది. మృతురాలి స్వగ్రామం కొణిజేడు కాగా మర్లపాడు సీఆర్‌పీగా సుమారు 14 ఏళ్ల నుంచి విధులు నిర్వర్తిస్తున్నారు.

ముగ్గురు సీఐలకు పోస్టింగ్‌లు

ఒంగోలు(క్రైం), ఫిబ్రవరి2: జిల్లాలో ముగ్గురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకు పోస్టింగ్‌లు ఇస్తూ గుంటూరు రేంజి ఐజీ జి.పాల్‌రాజ్ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. రేంజి వీఆర్‌లో ఉన్న వైవీ.సామయ్యను గిద్దలూరు టౌన్‌కు, ఒంగోలు దిశ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న డి.మల్లికార్జునరావు పొదిలి సర్కిల్‌కు బదిలీ అయ్యారు. వీఆర్‌లో ఉన్న ఎస్‌కే.ఖాజావలి ఒంగోలు దిశ పోలీస్‌స్టేషన్‌కు కేటాయించారు.

ప్రజావ్యతిరేక ప్రభుత్వంపై తిరగబడాలి : జనసేన



కరపత్రాలను అందజేస్తున్న కార్యకర్తలు

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి2: ప్రజావ్యతిరేక ప్రభుత్వ పరిపాలనపై ప్రజలు తిరుగుబాటు చేయాలని జనసేన పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఒంగోలు నగరం అన్నవరప్పాడులో శుక్రవారం జనసేన నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతున్నదని, వచ్చే ఎన్నికలలో జనసేన నాయకులను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మహ్మద్ హనీఫ్, చనపతి రాంబాబు, కళ్యాణ్ ముత్యాల, తన్నీరు ఉష, షేక్ ముంతాజ్, కోట సుధీర్, చెన్ను నరేష్, ఉంగరాల సాయి, మర్రిపూడి మాధవి, అనూష తదితరులు పాల్గొన్నారు.

పేస్ కళాశాలకు ప్రతిష్ఠాత్మక అవార్డు



అవార్డును అందుకుంటున్న కల్యాణ్

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 2: ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలకు ప్రతిష్ఠాత్మకమైన హైలీ ప్రామిసింగ్ ఇంజనీరింగ్ కాలేజీ విత్ ఇమెన్స్ పొటెన్షియల్ అవార్డుతో కళ్యాణ్ మద్దిశెట్టిని గౌరవించారు. సింగపూర్‌లో జరిగిన ఆసియా బిజినెస్ కాన్క్లేవ్02024 సందర్భంగా మాజీ ఏపీఎస్ కిరణ్‌బేడి ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక కళాశాలలో కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీ కే.మూర్తి, ఏవో రమణబాబు, విభాగాధితులు కల్యాణ్‌ను అభినందించారు.

పథకాలపై అవగాహన సదస్సు : స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు ప్రభుత్వ పథకాలు, నిధులపై అవగాన సదస్సు శుక్రవారం జరిగింది. ఉస్మానియా యూనివర్శిటీ బిజినెస్ ఇంక్యుబేటర్ ఈసీవో డాక్టర్ హఫీజ్‌బాషా ప్రసంగించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ మూర్తి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ రూప అక్కేష్ పాల్గొన్నారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి

సంతనూతలపాడు, ఫిబ్రవరి 2: ఈ-పంట నమోదు చేయించుకున్న రైతులు ఈకేవైసీ చేయించుకుంటేనే పంట నమోదు ప్రక్రియ మొదలవుతుందని ఏవో పి.పావని తెలిపారు. శుక్రవారం ఎండ్లూరులో గ్రామ వ్యవసాయసలహా మండలి సమావేశం జరిగింది. అనంతరం ఎండ్లూరు, కామేపల్లివారిపాలెం, పేర్నమిట్ట గ్రామాల్లోని శనగపంటను పరిశీలించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం : డీటీసీ



రక్తదానం చేసిన విద్యార్థికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న డీటీసీ సుశీల, ఏఎస్పీ అశోక్‌బాబు

ఒంగోలు(క్రైం), ఫిబ్రవరి 2: రక్తదానం ప్రాణదానంతో సమానమని డీటీసీ ఆర్.సుశీల పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వెంగముక్కపాలెం రోడ్డులో గల రవాణాశాఖ కార్యాలంలో రహదారి భద్రత వారోత్సవాలలో భాగంగా మెగా రక్తదాన శిబిరం జరిగింది. ఈ సందర్భంగా శిబిరాన్ని ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఆపదరలో ఉన్న వారికి ప్రాణదానం చేసినట్లు అని తెలిపారు. ఆరోగ్యవంతులు ఎవరైన రక్తదానం చేయవచ్చన్నారు. అనంతరం క్విస్, రైజ్, పేస్ ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన 100 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఒంగోలు రిమ్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పెంచల ప్రసన్న రక్తాన్ని సేకరించారు. కాగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏఆర్ ఏఎస్పీ జి.అశోక్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని తమ లక్ష్యాలను చేరుకోవాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంవీఐలు కిరణ్‌ప్రభాకర్, జి.రామచంద్రరావు, ఎల్.సురేంద్రప్రసాద్, ఎన్.జగదీష్, అసిస్టెంట్ మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ జి.జయప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

రేషన్ పంపిణీని పరిశీలించిన జేసీ



బియ్యం పంపిణీని పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 2 : ఒంగోలు నగరంలో జరుగుతున్న రేషన్ పంపిణీని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ పరిశీలించారు. స్థానిక దేవుడు చెరువు ప్రాంతంలో మొబైల్ వాహనం ద్వారా ఇస్తున్న బియ్యం పంపిణీని శుక్రవారం పరిశీలించి కార్డుదారులతో వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వాహనదారులు రెండుసార్లు వేలిముద్రలు వేయాల్సి రావడం వల్ల జాప్యం జరుగుతుందని జేసీ దృష్టికి తీసుకెళ్లారు. సర్వర్ వేగంగా పనిచేసేలా ఉన్నతాధికారులతో మాట్లాడతానని జేసీ హామీ ఇచ్చారు. ఆయన వెంట డీఎస్‌వో ఉదయభాస్కర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కృష్ణమోహన్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఊతకోలు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పచ్చాకు ముఠా కూలీల రక్షణకు చట్టం చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 2: పచ్చాకు ముఠా కూలీలు ప్రతి ఏటా ప్రమాదాలకు గురైన ప్రాణాలను కోల్పోతున్నారని, వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం రక్షణ చట్టం కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు మద్దిపాడు మండలం రాచవారిపాలెంకు చెందిన సుదర్శి శోభారాణి (40) ముఠా కూలీలతో కలిసి పచ్చాకు కొట్టి ట్రాక్టర్‌లో వస్తున్న సమయంలో ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోవడంతో శుక్రవారం స్థానిక రిమ్స్‌లో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ సందర్భంగా మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. శోభారాణి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు, మద్దిపాడు మండల కార్యదర్శి ఉబ్బా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో జిల్లా విద్యార్థులకు అవార్డులు

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 2 : సదరన్ ఇండియ సైన్స్ ఎగ్జిబిషన్‌లో జిల్లాకు చెందిన విద్యార్థులు మూడు అవార్డులను గెలుపొందారు. సదరన్ ఇండియా స్థాయిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన 210 ఎగ్జిబిట్లు విజయవాడలోని మురళి రిసార్ట్స్‌లో నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు. మన రాష్ట్రం తరుఫున ప్రదర్శనలో పాల్గొన్న జిల్లాకు చెందిన మూడు ప్రాజెక్టులు పాల్గొనగా మూడు అవార్డులు గెలుచుకున్నారు. విద్యార్థుల వ్యక్తిగత విభాగంలో బేస్తవారిపేట జిల్లా పరిషత్ బాలుర పాఠశాలకు చెందిన జి.శివకౌశిక్ (భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ వారి స్పెషల్ ప్రైజ్), విద్యార్థుల గ్రూపు విభాగంలో మేడి జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థి కె.అరుణ్‌కుమార్, నరసింహులు ఆయిల్ స్కిమ్మర్ ప్రాజెక్టులో బహుమతులు సాధించినట్లు డీఈవో వీఎస్.సుబ్బారావు శుక్రవారం తెలిపారు. రాష్ట్ర సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్‌రావు, ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ బి.ప్రతాపరెడ్డి చేతుల మీదుగా మెమోంటో, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారని ఆయన చెప్పారు.

రైజ్‌లో అవగాహన సదస్సు



వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 2: ఒంగోలులోని రైజ్ కృష్ణసాయి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో శుక్రవారం శాటిలైట్ డిజైనింగ్, లాంచింగ్ సిస్టంపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు కళాశాల కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు తెలిపారు. షార్ రిటైర్డ్ సైంటిస్ట్, ఫార్మర్ అసోసియేట్ డైరెక్టర్ టి.సుబ్బారెడ్డి, శాటిలైట్ టెక్నికల్ సపోర్టు ఎక్స్‌పర్ట్ డి.వెంకటేశ్వరరావులు పాల్గొని పలు అంశాలపై అవగాహన కల్పించారని కళాశాల డైరెక్టర్ ఏవీ.భాస్కరరావు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేవీ.సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఓట్ల జాబితాపై నిబంధనలు పాటించాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 2 : గత నెలలో ప్రచురించిన తుది ఓటర్ల జాబితాలో తొలగింపులు, చేర్పులు చేసే విషయంలో నిబంధనలు ఉల్లంఘన జరగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితా నుంచి తొలగించాల్సిన పేర్లు ఆ మొత్తం జాబితాలో 0.1 శాతం కంటే ఎక్కువ ఉంటే ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకోవాలన్నారు. చేర్పుల కోసం వచ్చే దరఖాస్తులను కూడా నిశితంగా పరిశీలించాలని చెప్పారు. ఎన్నికల విధుల కోసం ఎంత మేరకు సిబ్బంది అవసరం, ప్రస్తుతం ఎంత మంది అందుబాటులో ఉన్నారో ఈనెల 10లోపు నివేదికను అందజేయాలన్నారు. స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలను పూర్తి స్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో శ్రీలత, మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా, ట్రైనీ కలెక్టర్ శౌర్యమన్‌పటేల్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

26న అంబేడ్కర్‌వాదుల మహాసభ

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 2: ఒంగోలులో ఈనెల 26వతేదీన అంబేడ్కర్‌వాదుల మహాసభను నిర్వహిస్తున్నట్లు దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు తెలిపారు. ఒంగోలులో శుక్రవారం మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మాచవరపు జూలియన్, నీలం నాగేంద్రరావు, దాసరి శివాజీ, దారా అంజయ్య, పి.జయరాం, చప్పిడి ప్రియతం, ఎం.విద్యాసాగర్, కం దుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశంపంతులుకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న మంత్రి నాగార్జున, జంకె

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 2: జిల్లా ఆవిర్భావ దినోత్సవాన్ని ఒంగోలులోని వైసీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి మంత్రి మేరుగ నాగార్జున, వైసీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకట రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొమ్మూరి కనకారావు, నాయకులు డీఎస్.క్రాంతికుమార్, ఓబుల్‌రెడ్డి, మండవ అప్పారావు, పరందామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండో విడత ఆరోగ్య సురక్ష ప్రారంభం

టంగుటూరు, ఫిబ్రవరి 2 : జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం శుక్రవారం నుంచి ప్రారంభమైంది. స్థానిక రెండో సచివాయలయం పరిధిలో 345 మంది రోగులకు వైద్యులు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వైద్యశాఖ డీపీవో డాక్టర్ వాణిశ్రీ పరిశీలించారు. వైద్యులు కె.వెంకటేశ్వర్లు, ప్రసాద్‌బాబు, బాలాజీ, అశోక్, సచివాలయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

మార్టూరు, ఫిబ్రవరి 2 : మార్టూరులోని విజయనగర్‌కాలనీ సమీపంలో పొలాల్లో చెట్టుకు తన్నీరు సురేష్(42) అనే వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని రాజుపాలెం గ్రామ పంచాయతీలోని శాంతినగర్‌లో నివాసం ఉంటున్న సురేష్ మార్టూరులో ట్రాక్టర్ డ్రైవరుగా పనిచేస్తుంటారు. అతనికి భార్య లక్ష్మీ కోటేశ్వరమ్మ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె నర్సరావుపేటలో నర్సింగ్ కోర్సు చదువుతున్నారు. ఆమె వివాహ విషయమై తీవ్ర మనస్తాపానికి గురైన తండ్రి సురేష్ ఆత్మహత్యకు పాల్పడినట్లు బంధువులు చెబుతున్నారు. సురేష్ ఆత్మహత్య చేసుకున్న విషయం సాయంత్రం సమీపంలో పొలాల్లో పనిచేస్తున్న కూలీలు గమనించి మృతుని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అనంతరం కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించగా సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు విచారణ చేస్తున్నట్లు ఏఎస్ఐ సైదా తెలిపారు.

నరసరావుపేటలో రియల్‌ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్య

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 2 : పట్టణశివారు కాలనీ కామిరెడ్డి రోశిరెడ్డి నగర్ వద్ద నరసరావుపేట పట్టణానికి చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారి కుంచెపు ఏడుకొండలు(55) శుక్రవారం తెల్లవారుజామున పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. నరసరావుపేట రూరల్ ఎస్ఐ రోశయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం చవిటిపాలేనికి చెందిన కుంచెపు ఏడుకొండలు(55), 20 ఏళ్ళుగా నరసరావుపేట పట్టణంలోని బరంపేట శిశుమందిర్ స్కూలు వద్ద నివాసముంటున్నాడు. గురువారం రాత్రి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పట్టణంలో అంతావెదికారు. శుక్రవారం ఉదయం వినుకొండ రోడ్డులోగల కామిరెడ్డి రోశిరెడ్డి నగర్ వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య కుంచెపు పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ రోశయ్య తెలిపారు. ఏడుకొండలు ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

ఎస్సైగా నాగేశ్వరరావు బాధ్యతల స్వీకరణ



ఎస్సై నాగేశ్వరరావు

టంగుటూరు, ఫిబ్రవరి 2 : టంగుటూరు ఎస్సైగా నాగేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఒంగోలులో వీఆర్‌లో ఉన్న ఆయన్ను ఇటీవల ఇక్కడ ఎస్సైగా నియమించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ అందరూ ప్రశాంత వాతావరణంలో జీవనం కొనసాగించేలా పనిచేస్తానని చెప్పారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు

ప్రయాణికుల అవస్థలు



మల్లాయపాలెం సమీపంలో మొరాయించిన ఆర్టీసీ బస్సు

బల్లికురవ, ఫిబ్రవరి 2: సురక్షితమైన ప్రయాణం అని నమ్ముకుని ఆర్టీసీ బస్సు ఎక్కిన ప్రయాణికులకు మార్గమధ్యంలో మొరాయించటంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. మండలంలోని మల్లాయపాలెం సమీపంలో శుక్రవారం ఉదయం పది గంటల సమయంలో నర్సరావుపేట వైపు నుంచి అద్దంకి వస్తున్న ఆర్టీసీ బస్సు నడి రోడ్డుపై మొరాయించింది. దీంతో ప్రభుత్వ కార్యాలయాలకు, ఉన్నత పాఠశాలకు, జూనియర్ కళాశాలకు వచ్చే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. ఆర్టీసీ బస్సులు కండిషన్‌లో లేవని, అందుకే ఇలాంటి పరిస్థితి వచ్చిందని పలువురు ప్రయాణికులు ఆరోపించారు. అద్దంకి నుంచి నర్సరావుపేటకు వెళ్లే ఏకైక బస్సు మార్గమధ్యంలో నిలిచిపోవటంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. బల్లికురవ మండల పరిధిలో సక్రమంగా ఆర్టీసీ బస్సులను నడవటం లేదని, కొన్నిరూట్లలో ఉన్న సర్వీసులు కూడా రద్దు చేశారని ప్రయాణికులు ఆరోపించారు.

అద్దంకి అభివృద్ధికి రూ.30 కోట్లు ఒట్టిమాటేనా!

వైసీపీ కౌన్సిలర్లు తీవ్ర అసంతృప్తి



మినీ బైపాస్‌గా అభివృద్ధికి ప్రతిపాదించిన ఆక్రమణలకు గురైన ఉన్న అద్దంకి మేజర్ కాలువ కట్టలు

అద్దంకి, జనవరి 2: అద్దంకి పట్టణంలో పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా రూ.30 కోట్ల నిధులు మంజూరు కాబోతున్నాయని ఏడాది కాలంగా వైసీపీ నేతలు ఊదరగొడుతున్నారు. నాలుగైదు నెలల క్రితం అయితే ప్రతిపాదనలకు ఆమోదం పూర్తయింది, ఇక నిధులు మంజూరే తరువాయి, సార్వత్రిక ఎన్నికలలోపు పనులు పూర్తి చేసి ఓట్లు అడుగుతామని కూడా నమ్మబలికారు. తీరా చూస్తే అతిత్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్ రాబోతున్నప్పటికీ నిధుల మంజూరు జాడ గురించి పట్టించుకునే నాథుడే లేడన్న విమర్శలు వస్తున్నాయి. ప్రధానంగా అద్దంకి పట్టణంలో అంతర్భాగమై ఆక్రమణలకు గురైన అద్దంకి మేజర్ కాలువ కట్టలను రెండువైపులా అభివృద్ధిచేసి మినీ బైపాస్‌గా మార్చాలని పూర్తిస్థాయిలో కసరత్తు జరిగింది. ఆక్రమణలదారులను ఖాళీ చేయించేందుకు ఆయా శాఖల అధికారులు సిద్ధమయ్యారు. ఈనేపథ్యంలో ప్రాథమికంగా ఆక్రమణలు లేనిచోట కాలువ కట్టల అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఇక పట్టణంలోని పలు శివారు కాలనీలలో సీసీ రోడ్లు ఎలాగూ వేయలేదు, కనీసం గ్రామెల్ రోడ్లు అయినా వేయాలని ఆయా వార్డుల కౌన్సిలర్‌లు కోరటంతో సుమారు రూ.30 లక్షలతో ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపారు. ఇక నిధులు అదిగో వస్తున్నాయి.... ఇదిగో పనులు ప్రారంభిస్తున్నామని అధికార పార్టీ కౌన్సిలర్‌లు, నాయకులు ఒకింత హడావుడి చేశారు. ఎలాగూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రత్యేక నిధులు మంజూరు కానందున ఎన్నికల సమయానికి నిధుల వరద పారుతుందని, అభివృద్ధి పనులు చేపడతారని ప్రజలు కూడా భావించారు. అదేసమయంలో వైసీపీ నియోజక వర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్న బాచిన కృష్ణచైతన్యను తప్పించి పాణెం హనిమిరెడ్డికి అప్పగించారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన హనిమిరెడ్డి వైసీపీ కౌన్సిలర్‌లను తన చెంతకు చేర్చుకోవటంలో సఫలీకృతమైనప్పటికీ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు విషయమై దృష్టి పెట్టలేదన్న విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధికారపార్టీ కౌన్సిలర్‌లు అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తుంది. మున్సిపల్ ఎన్నికల సమయంలో అభివృద్ధి పనులకు హామీ ఇచ్చి ఇప్పుడు కనీసం చిన్నపని కూడా చేపట్టకుండా ఏముఖం పెట్టుకొని వైసీపీకి ఓటు వేయమని అడగాలన్న మీమాంసలో ఉన్నారు. ప్రజల నుంచి వచ్చే వ్యతిరేకతను ముందే గ్రహించిన కొంతమంది అధికారపార్టీ కౌన్సిలర్‌లు ప్రచారానికి అంటీ ముట్టనట్లు ఉండటమో లేక టీడీపీలోకి జంప్ కావాలన్న ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తుంది. వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయలేదన్న సాకును చూపించి పార్టీ మారాలన్న ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తుంది.

నత్తనడకన పార్కుల అభివృద్ధి పనులు

చీరాల, ఫిబ్రవరి 2: చీరాల నియోజకవర్గంలో పలుచోట్ల పార్కుల పనులు జరుగుతున్నాయి. ప్రారంభించిన తరువాత తగినంత వేగంగా పనులు సాగటంలేదు. దీంతో ఆహ్లాదం.. ఆటవిడుపు కోరుకునే వారు ఆ పార్కులు ఎప్పుడు పూర్తవుతాయా అని ఎదురుచూస్తున్నారు. మున్సిపల్ పరిధిలో ఎన్ఆర్‌అండ్‌పీఎం హైస్కూల్ ప్రాంగణంలో స్కూలు వెనుకవైపు ఉన్న పార్కును అభివృద్ధి చేసేందుకు పనులు చేపట్టి కొన్ని నెలలవుతోంది. పనులు నెమ్మదిగా జరుగుతున్నాయి. సెయింట్‌ఆన్స్ స్కూల్ సమీపంలో ఓ పార్కు నిర్మాణం జరుగుతోంది. ఆ ప్రాంతం గతంలో అపరిశుభ్రంగా ఉండేది. పార్కు పనులు ప్రారంభిచటం, పక్కనే సీసీ రోడ్డు నిర్మాణం జరగటంతో ఆ ప్రాంతం పరిశుభ్రంగా ఉంది. అంతవరకు బాగానే ఉంది. పార్కు కోసం కేటాయించిన స్థలం చుట్టూ ఫెన్సింగ్ మాత్రమే వేసి, లోపల ఎర్రమట్టి తోలారు. ఆ తరువాత పార్కుకు సంబంధించిన పనులు ప్రారంభించటంలో జాప్యం జరగడం పట్ల ఆ ప్రాంత ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆ పార్కు పూర్తయితే మూడు, నాలుగు వార్డుల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది. కుందేరు పక్కన కొత్తపేట పంచాయతీ పరిధిలో నిర్మాణంలో ఉన్న పార్కు పనులను వేగవంతంచేసి ప్రారంభిస్తే ఆ ప్రాంత ప్రజలకు కూడా ఉపయోగకరంగా ఉంటుందని, పార్కు పనులను వేగవంతం చేయాలని కోరుతున్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్య



సమావేశంలో మాట్లాడుతున్న దామచర్ల సత్య

మర్రిపూడి, ఫిబ్రవరి 2 : కొండపి నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానని ఆపార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య అన్నారు. మండలంలోని అయ్యవారిపాలెం, జువ్విగుంట, రావెల్లవారిపాలెం, నన్నమూరు, అంకేపల్లి, కూచిపూడి, వేమవరం, గార్లపేట గ్రామాలలో ఆయన శుక్రవారం పర్యటించారు. కార్యకర్తలతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషిచేసిన ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామిని రానున్న ఎన్నిల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఓటర్ల జాబితాపై దృష్టి సారించి అర్హులందరినీ చేర్పించేందుకు చొరవ చూపాలని కోరారు. ఎన్నికలు జరిగే వరకు మర్రిపూడి మండల పరిశీలకుడిగా బంగారయ్యను నియమించినట్లు చెప్పారు. సత్య వెంట తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రమోతు శ్రీనివాసులు, టీడీపీ మండల అధ్యక్షుడు చేరెడ్డి నరసారెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు తుళ్లూరి నరసింహారావు, తెలుగురైతు అధికార ప్రతినిధి రేగుల వీరనారాయణ, నాయకులు బి.ప్రభాకరరావు, బి.శ్రీనివాసరావు, బి.లక్ష్మీనారాయణ, డి.రామబ్రహ్మం, నేరెళ్ల శ్రీనివాసులు, లకులు, భాస్కర్‌రెడ్డి, వై.వెంకటరెడ్డి, ఈదుముడి గురుబ్రహ్మం, కొండారెడ్డి, గుండపనేని వెంకటేశ్వర్లు, సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

పట్టాల పంపిణీ మాటున వైసీపీ నేతల దోపిడీ

జనసేన పార్టీ సమన్వయకర్త మనోజ్‌కుమార్ ఆరోపణ



బాధిత మహిళలతో కలసి ధర్నా చేస్తున్న మనోజ్‌కుమార్

టంగుటూరు, ఫిబ్రవరి 2 : టంగుటూరు జగనన్న లేఅవుట్‌లలో ఇళ్ల పట్టాల పంపిణీ మాటున స్థానిక వైసీపీ నాయకులు భారీ దోపిడీకి పాల్పడ్డారని జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కనపర్తి మనోజ్‌కుమార్ ఆరోపించారు. పట్టాల పంపిణీలో జరిగిన అవినీతిని వెలికితీయాలని డిమాండ్ చేస్తూ మనోజ్‌కుమార్ బాధిత మహిళలైన సోమేపల్లి కల్పన, హుస్సేన్‌బీతో కలసి శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో జరిగిన పట్టాల పంపిణీలో భారీగా అవకతవకలు చోటుచేసుకున్నాయన్నారు. పేదలకు దక్కాల్సిన పట్టాలను అధికార పార్టీ నాయకులు సొంతం చేసుకొని భారీగా నగదు తీసుకొని ఇతరులకు కట్టబెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బులు తీసుకొని ఫోర్జరీ సంతకాలతో తహసీల్దార్ కార్యాలయ కిందిస్థాయి సిబ్బంది కల్పనకు నకిలీ పట్టా ఇచ్చారని ఆరోపించారు. షేక్ హుస్సేన్‌బీ పేరున పట్టా ఇవ్వగా ఆమె స్థానంలో రెవెన్యూ రికార్డుల్లో పులిచర్ల ధనలక్ష్మి పేరుందన్నారు. ఇలాంటి దారుణాలు అనేకం చోటుచేసుకున్నాయన్నారు. టంగుటూరు జగనన్న లేఅవుట్‌లలో నష్టపోయిన లబ్ధిదారులకు న్యాయం జరిగే వరకు జనసేన పోరాటం చేస్తుందన్నారు, ఫోర్జరీ సంతకాలతో నకిలీ పట్టాలిచ్చిన తహసీల్దార్ కార్యాలయ సిబ్బందిని వెంటనే అరెస్ట్ చేసి పట్టాల పంపిణీపై సమగ్ర విచారణ చేయాలని మనోజ్ డిమాండ్ చేశారు.

అక్రమ అరెస్టులతో టీడీపీని దెబ్బతీయలేరు

- మచ్చలేని నాయకుడు ఎమ్మెల్యే ఏలూరి
- పార్టీ మండల అధ్యక్షుడు షంషుద్దీన్



పర్చూరులో మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు షంషుద్దీన్

పర్చూరు, ఫిబ్రవరి 2: అక్రమ కేసులు, అరెస్టులతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రతిష్టను దెబ్బతీయలేరని టీడీపీ మండల అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్ అన్నారు. మచ్చలేని, స్వచ్ఛమైన నాయకుడు ఎమ్మెల్యే ఏలూరని పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాసేవే లక్ష్యంగా రాజకీయాల్లోకి వచ్చి అభివృద్ధి, సంక్షేమం అనే ఆయుధంతో ప్రగతి పథంలో నిలిచిన ఘనత ఏలూరికే దక్కుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి ఎక్కడా అభివృద్ధి చేసిన దాఖలాలు లేవన్నారు. అధికార పార్టీ పేరుతో అక్రమాలు, అరాచకాలు, దౌర్జన్యాలకు పాల్పడుతుంది ఎవరో అందరికీ తెలుసునని చెప్పారు. బహిరంగా మైనింగ్, ఇసుక, రేషన్ అక్రమ వసూలు చేస్తుంది ఎవరో చిన్నపిల్లవాడిని అడిగినా చెప్పే పరిస్థితిలో ఉందన్నారు. దొంగే దొంగ అన్న చందంగా అధికార పార్టీ నేత కేకలు వేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే ఏలూరిపై విమర్శలు చేసిన ప్రతిఒక్కరూ ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు. ఇప్పటికైనా విమర్శలు మానుకొని, ప్రజలకు సేవచేసి మన్ననలు పొందాలే కానీ ఇలా అక్రమ మార్గంలో తప్పుడు ఆరోపణలు చేయకూడదన్నారు. దాడికి వచ్చిన వ్యక్తులను వదిలి ఫిర్యాదు చేసిన ఫ్యాక్టరీల యాజమాన్యంపై కేసులు పెట్టడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. విలేకరుల సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు అగ్గిగుండాల వెంకటకృష్ణారావు, కోడూరి శేషబ్రహ్మాచారి, దూళిపల్లి వెంకటస్వామి, కొరిటాల సురేష్, కొండ్రగుంటి శివనాగేశ్వరరావు, చెరుకూరి చింపయ్య, షేక్ బషీర్, కన్నెగంటి సాంబయ్య, షేక్ హుసేన్(ట్విన్స్) వెంకటేశ్వర్లు, శ్రీరాం వెంకటసుబ్బారావు, గిరి, తంగెళ్ళ మల్లిఖార్జునరావు, ఏసు, దాసి కిరణ్, ఇజ్రాయిల్, జీవన్ పాల్గొన్నారు.

కేసులకు భయపడేదిలేదు!

యద్దనపూడి(మార్టూరు), ఫిబ్రవరి 2: నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేక, అధికార పార్టీ ఆయనపై అక్రమంగా కేసులు పెడుతుందని టీడీపీ నాయకులు ధ్వజమెత్తారు. శుక్రవారం యద్దనపూడిలోని పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించిన ఏలూరి సాంబశివరావు మూడోసారి పర్చూరులో గెలిచి హ్యాట్రిక్ సాధించడం ఖాయమన్నారు. పర్చూరు నియోజకవర్గం ప్రశాంతంగా ఉండటానికి కారణం ఏలూరి అని చెప్పారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ప్రజానీకం వాస్తవాలు గమనిస్తున్నారన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఓటు ద్వారా అధికార పార్టీకి గుణపాఠం చెబుతారని అన్నారు. కేసులకు భయపడే నాయకులు ఏలూరి కాదని, ఆయన వెంట నడిచే సైనికులుగా తామంతా ఉన్నామని నాయకులు స్పష్టం చేశారు.


ఇసుక అక్రమ తవ్వకాలపై చలో చినగంజాం

- పోలీసుల ముందస్తు అరెస్టులు
- ధ్వజమెత్తిన జనసేన నాయకులు



చినగంజాంలో అనుమతులు లేకుండా తవ్వుతున్న ఇసుక క్వారీ

చినగంజాం, ఫిబ్రవరి 2: మండలంలోని చినగంజాం గ్రామ సర్వే నెంబర్లు 829, 830 భూముల్లో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలపై చలో చినగంజాం కార్యక్రమంలో జనసేన, సీపీఎం నాయకులు పాల్గొనకుండా పోలీసులు శుక్రవారం వేకువజామున ముందస్తు అరెస్టులు చేశారు. చినగంజాం ప్రాంతంలో అధికార పార్టీ నాయకులు అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఇసుక అక్రమ తవ్వకాలపై గురువారం జనసేన పార్టీ చలో చినగంజాం కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఈనేపథ్యంలో శుక్రవారం వేకువజామున సీపీఎం నాయకుడు గున్నమనేని ప్రతాప్‌కుమార్, జనసేన మండల నాయకులు సందు శ్రీనివాసరావు, అడుసుమల్లి హరిబాబు, తోట అశోకచక్రవర్తి, తుమ్మలపెంట సతీష్, గంటా వెంకటేష్, బొప్పన శ్రీనివాసరావు, షేక్ కరిముల్లా, గంటా లక్ష్మీనారాయణ తదితరులను అదుపులోకి తీసుకొని చినగంజాం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పర్చూరు, చీరాల నియోజకవర్గాలలోని జనసేన నాయకులను హౌస్ అరెస్టులు చేశారు. విచ్చలవిడిగా ఇసుక మాఫియా జరుగుతున్న కనీసం కన్నెత్తి చూడని అధికారులు అక్రమాలను ఎత్తి చూపాలనుకుంటున్న జనసేన నాయకులను అక్రమంగా నిర్బంధించడం హాస్యాస్పదంగా ఉందని జనసేన పార్టీ నాయకులు అన్నారు. ఇసుక అక్రమ రవాణాని వెంటనే ఆపాలని, చట్టప్రకారం అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా చలో చినగంజాం కార్యక్రమం ద్వారా నిరసన తెలపడానికి పూనుకున్న ప్రతిపక్షాలపై పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకొని నిర్బంధించడం సరైన పద్ధతి కాదని అన్నారు. మండలంలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలపై ఎన్ని నిర్బంధాలు విధించినా పోరాటం ఆపే ప్రసక్తి లేదని తెలిపారు. ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్న క్వారీల వద్దకు ఎవరు వెళ్లకుండా కడవకుదురు బస్టాండ్, కడవకుదురు జడ్పీ పాఠశాల సమీపంలో, ఇసుక క్వారీకి వెళ్లే దారిలో, క్వారీ వద్ద భారీసంఖ్యలో పోలీసు బలగాలను మోహరించారు. శుక్రవారం వేకువజామున 5గంటలకు అదుపులోకి తీసుకున్న జనసేన, సీపీఎం నాయకులను శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటలకు విడుదల చేశారు. చీరాల డీఎస్పీ ప్రసాదరావు ఆధ్వర్యంలో ఇంకొల్లు, చీరాల టూటౌన్, చీరాల రూరల్ సీఐ లు బి.శ్రీనివాసరావు, సోమశేఖర్‌రావు, నిమ్మగడ్డ సత్యనారాయణ, చీరాల డివిజన్ పరిధిలోని ఎస్ఐలు, ఏఆర్, సర్కిల్ పరిధిలోని హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, మహిళా కానిస్టేబుళ్లతో బందోబస్తు నిర్వహించారు.



పోలీసు స్టేషన్‌లో ఉన్న జనసేన, సీపీఎం నాయకులు

వ్యవసాయ మోటార్ల వైర్లు చోరీ

- ఆందోళన చెందుతున్న రైతులు



కొమ్మినేనివారిపాలెంలో వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్లు చోరీ చేయగా నిరుపయోగంగా ఉన్న బోర్లు

బల్లికురవ, ఫిబ్రవరి 2: గత కొంతకాలంగా పలు గ్రామాల్లో కొందరు గుర్తుతెలియని దొంగలు వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్లను పెద్ద ఎత్తున తస్కరిస్తున్నారు. తాజాగా బల్లికురవ మండలం కొమ్మినేనివారిపాలెం గ్రామంలో గత నాలుగు రోజుల్లో సుమారు వంద వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్లను రాత్రి సమయంలో కట్ చేసుకువెళ్లారు. రైతులు పంటలకు నీటిని పెట్టేందుకు వెళ్లి మోటార్లు పనిచేయకపోవటంతో కేబుల్ వైర్ కట్ చేసి ఉండటం చూసి లబోదిబో మంటున్నారు. ఒక్కో మోటార్‌కు సుమారు రూ.రెండు వేల విలువ కలిగిన వైరు చోరీ జరుగుతుంది. కేబుల్ వైరు మోటార్ లోపలికి దొంగలు కట్ చేయటంతో బోరులో ఉన్న మోటార్లు బయటకు తీయటం చాలా కష్టంగా మారుతుందని రైతులు వాపోతున్నారు. గతంలో కూడా పలుమార్లు ఇదే పద్ధతిలో చోరీలు జరిగాయి. రాత్రుళ్ల పొలాల్లో రైతులు లేని సమయం గమనించి ఇలాంటి చోరీలు జరుగుతు న్నాయి. ఎవరో అనుభవం కలిగిన దొంగల పనే అయి ఉంటుందని రైతులు అంటున్నారు. మండలంలోని బల్లికురవ, నక్కబొక్కలపాడు, గుంటుపల్లి, కొత్త పాలెం, అంబడిపూడి, వల్లాపల్లి, వైదన, ఎస్ఎల్ గుడిపాడు గ్రామాల్లో కూడా గత ఆరు మసాల వ్యవధిలో వందల సంఖ్యలో వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్లు చోరీలు జరిగాయని రైతులు తెలిపారు. చోరీ విషయం పోలీసు స్టేషన్‌కు వెళితే వారు ఫిర్యాదులు కూడా తీసుకోవటం లేదని రైతులు తెలిపారు. తక్కువ నగదు చేసే కేబుల్ పోవటంతో కొందరు రైతులు ఫిర్యాదు చేసి నా ఉపయోగం ఉండదులే అని కొత్త వైరు తీసుకువచ్చి అమర్చుతున్నారని కొందరు రైతులు తెలిపారు. గతంలో సోలార్ ప్లేట్లు, బోర్డులు కూడా తస్కరణకు గురయ్యాయని వారు తెలిపారు. ఒకేమారు వందల సంఖ్యలో పంట భూముల్లో ఉన్న మోటార్ల వైర్లు చోరీ జరగటంతో బోర్లు నిరుపయోగంగా ఉన్నాయని రైతులు తెలిపారు. గ్రామాల్లో జరుగుతున్న మోటార్ల కేబుల్ వైర్ల చోరీ ముఠా గుట్టురట్టు చేసేలా పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నదాతలు కోరుతున్నారు.

బాలినేనితో ఎంపీపీలు, జడ్పీటీసీలు భేటీ

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన వైసీపీ ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, ఇతర కిందిస్థాయిలోని కొందరు ప్రజాప్రతినిధులు, ద్వితీయశ్రేణి నాయకులతో హైదరాబాద్‌లోని తన నివాసంలో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని భేటీ అయ్యారు. ఈ విషయమై బాలినేనిని ప్రశ్నించగా తాను పిలవలేదని వచ్చిన వారితో మాట్లాడుతున్నానని చెప్తున్నారు. గిద్దలూరు, మార్కాపురం, దర్శి, ఒంగోలు, పర్చూరు తదితర నియోజకవర్గాల నుంచి వెళ్లిన వారు శుక్రవారం బాలినేని వద్ద అధికంగా కనిపించారు. 15 మంది ఎంపీపీలు, జడ్పీటీసీలు అందులో ఉన్నారు. శనివారం కలిసేందుకు మరికొందరు శుక్రవారం రాత్రి బయలుదేరి హైదరాబాద్ వెళ్లారు. వారంతా బాలినేనితో భేటీ అవటమే గాక పార్టీ నిర్ణయాలేమీ బాగా లేవు మీరు ఏ నిర్ణయం తీసుకున్నా దానికి అనుగుణంగా పయనిస్తామని చెప్పినట్లు తెలిసింది.

పంటలకు నీటి అవసరాన్ని మీటర్లు పెట్టి లెక్కిస్తాం!



వ్యవసాయ బోరును పరిశీలిస్తున్న జిల్లా భూగర్భజలశాఖాధికారి సాంబశివరావు

మేదరమెట్ల , ఫిబ్రవరి 2 : జిల్లాలో రైతులు సాగుచేసే పంటలకు సంబంధించి ఒక్కో పంటకు ఎంత నీరు అవసరమవుతుందో మీటర్లు పెట్టి లెక్కిస్తామని జిల్లా భూగర్భ జల శాఖ అడిషనల్ డైరెక్టర్ సాంబశివరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని దైవాలరావులో వ్యవసాయ బోర్లను, బోర్ల కింద వేసిన పంటలను ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వర్షపాతాన్ని లెక్కించి భూమిలోకి ఎంత నీరు వెళ్తుంది అనే అంచనాలను తయారు చేస్తామన్నారు. ప్రతి సంవత్సరం ఇదే విధంగా లెక్కిస్తామని, వివిధ రకాల భూములలో వేసే పంటలను బట్టి ఏ పంటకు ఎంత నీరు వినియోగం అవుతుందనే విషయాన్ని మీటర్లు పెట్టడం ద్వారా అంచనా వేస్తామన్నారు. దీని ద్వారా ఆయా ప్రాంతాలల్లో భూగర్భజలమట్టాలను గుర్తించడానికి వీలవుతుందని చెప్పారు. కొత్తగా భూగర్భ జలాలను తోడడానికి బోర్లు వేయడానికి నిర్ధారిస్తామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ శివవరప్రసాద్, వసంతకుమారి పాల్గొన్నారు.

రేపు ఉచిత గుండె వైద్య శిబిరం

ఇంకొల్లు, ఫిబ్రవరి 2: ఇంకొల్లు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 4న స్థానిక ఎన్ఆర్‌అండ్‌వీఎస్ఆర్ బాలికోన్నత పాఠశాలలో విజయవాడ హెల్ప్ హాస్పిటల్ వారిచే ఉచిత గుండె వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కరి కమలేశ్వరరావు, జెట్టి స్వామి తెలిపారు. ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఈ శిబిరంలో గుండె సంబంధిత వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారని వారు పేర్కొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

మేదరమెట్ల , ఫిబ్రవరి 2 : అద్దంకిరూరల్ సీఐగా శివరామకృష్ణారెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిలో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్లపై వాహనాలు నిలపడం వలనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. జాతీయ రహదారి అధికారులతో కలిసి రోడ్లపై వాహనాలు నిలుపకుండా చూస్తామన్నారు. గతంలో ఎక్కువ ప్రమాదాలు జరిగిన పాయింట్లను గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. ఎన్నికల సందర్భంగా శాంతి భద్రతలకు అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. అలాగే, కొరిశపాడు ఎస్ఐగా శివయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

శాంతి భద్రతలకు అధిక ప్రాధాన్యం

బల్లికురవ, ఫిబ్రవరి 2: బల్లికురవ ఎస్ఐగా పి.శివనాగిరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ఎస్ఐ వేమన చీరాలకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కొరిశపాడు స్టేషన్‌ను నుంచి శివనాగిరెడ్డి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ శివనాగిరెడ్డి మాట్లాడుతూ శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా గ్రామాలలో ప్రత్యేక నిఘా పెడతామని చెప్పారు. సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళతామన్నారు. ప్రజలందరూ తమకు సహకరించాలని ఆయన కోరారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి టీడీపీ

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ
- పొదిలిలో జయహో బీసీ సభ ఏర్పాటు

పొదిలి, ఫిబ్రవరి 2 :బడుగుబలహీన వర్గాల ఆశా జ్యోతి టీడీపీ అని టీడీపీ జిల్లా అధ్యక్షులు నూకసాని బాలాజీ అన్నారు. శుక్రవారం స్థానిక సాయి కల్యాణ మండపంలో జరిగిన జయహోబీసీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో బడుగుబలహీన వర్గాల సంక్షేమం కోసం ఆనాడు నందమూరితారక రామారావు టీడీపీని స్థాపించారన్నారు. తద్వారా బీసీలతోపాటు, బడుగుబలహీన వర్గాలు, మైనారిటీల అభివృద్ధికి పునాది పడిందన్నారు. ఆనాడు ఎన్టీఆర్ వేసిన పునాదిని నేడు చంద్రబాబు అనుసరిస్తు న్నాడని కొనియాడారు. గత టీడీపీ హయాంలో బీసీలకు సముచితస్థానం ఇచ్చి గౌరవించారన్నారు. ఈ పర్యాయం బీసీలు టీడీపీకి మద్దతుగా ఉండాలన్నారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం బీసీలను అణగదొక్కడానికి అడ్డదారులు తొక్కుతోందన్నారు. 52శాతం ఉన్న బడుగు బలహీన వర్గాల ప్రజలు వైసీపీ చేస్తున్న అను సరిస్తున్న దౌర్జన్యా లను, అవినీతి పాలనపై గళమెత్తాలన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజలు కష్టపడి పనిచేసి టీడీపీని అధికారంలోకి తెచ్చుకున్నప్పుడే ప్రభుత్వం తరుపున అన్ని విధా లుగా లబ్ధిపొందేందుకు అవకా శం ఉంటుందన్నారు. టీడీపీ ఉన్న స్వేచ్ఛ ఏ పార్టీలో ఉండద ని, బీసీలతోపాటు, వెనుకబడిన అన్ని వర్గాల వారికి సముచిత గౌరవం దక్కుతుందన్నారు. చంద్రబాబు నాయకుడి దార్శనికత రాష్ట్రాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. ఇక ప్రకాశం జిల్లాలో అరాచకపాలనకు వైసీపీ శ్రీకారం చుడుతోందని బాలాజీ విమర్శించారు. ఈ పరంపర చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నియామకంతోనే మొదలైందన్నారు. చెవిరెడ్డి వచ్చి రాకముందే సమర్థవంతంగా పనిచేస్తున్న ఎస్పీ మలికగర్గ్‌ను రాత్రికిరాత్రే బదిలీ చేయించాడన్నారు. దీని బట్టే ఆయన ఆలోచన ప్రజలకు అర్థం అవుతోందన్నారు. రాష్ట్రంలో ఎలాంటి ఆధారాలు లేకుండా నాడు బీసీ నాయకులు అచ్చెన్నాయుడు, కొల్లురవీంద్రల అరెస్ట్ చేసిన తీరును గమనిం చాలన్నారు. బీసీలందరు కలిసికట్టుగా పనిచేసి టీడీపీ విజయానికి కృషి చేయాలన్నారు. కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తేనే ఆంధ్రరాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ ఉంటుందన్నారు. చంద్రబాబునాయుడిని ముఖ్య మంత్రిని చేసుకుంటే వెలుగొండతోపాటు మార్కా పురం జిల్లా సాధించుకోవచ్చన్నారు. జిల్లా వస్తే అన్ని అన్నిరంగాలు అభివృద్ధిపథంలో నడుస్తాయ న్నారు. కార్యక్రమంలో బీసీ మండల నాయకులు డాక్టర్ స్వర్ణగీత, పొల్లా నరసింహారావు, ఆర్ఎంపీ నారాయణ, తదితర మండల నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ

ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

టీడీపీ వై.పాలెం ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు

పెద్ద దోర్నాల, ఫిబ్రవరి 2: ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని ఎర్రగొండపాలెం ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. మండ లంలోని బయన్నగూడెం, చిన్నదోర్నాల, ఎగువ చెర్లోపల్లి, చెరువుగూడెం గ్రామాలలో శుక్ర వారం ఆయన పర్యటించారు. ఈ సందర్భం గా ఆయా గ్రామాల్లోని ప్రజలతో కలిసి మాట్లాడారు. తొలుత బయన్నగూడెం చెంచు గిరిజనులతో సమావేశమయ్యారు. తాము నీటికి ఇబ్బందులు పడుతున్నామని, ఉపాధి పనులు లేవని, పాఠ శాలకు వెళ్లాలంటే చింతలముడిపి పోవాల్సి వస్తోందని పలు సమస్యలు ఏకరువు పెట్టారు. దీంతో ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక టీడీపీ అమలు చేసిన సంక్షేమ పథకాలన్ని రద్దు చేశారన్నారు. కనీసం తాగునీ రు కూడా అందించలేని దుస్థితి నెలకొందని ఆరోపిం చారు. టీడీపీ మళ్లీ అధికా రంలోకి వస్తుందని, గిరిజ నుల సంక్షేమానికి శ్రీకారం చుడుతుందన్నారు. అనంత రం చిన్న దోర్నాల ప్రజలతో సమావేశ మయ్యారు. ఎస్సీల అభివృద్ధి, సంక్షేమ 27 పథ కాలు వైసీపీ రద్దు చేసిందన్నారు. ఎగువ చెర్లో పల్లిలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. బాబుష్యూరిటీ బాండ్లను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఏర్వ మల్లికార్జునరెడ్డి, నాయ కులు షేక్ మాబు, దొడ్డా శేషాద్రి, ఈదర మల్ల య్య, దేసు నాగేంద్రబాబు, చంటి, ఎలకపాటి చెంచయ్య, చల్లా వెంకటేశ్వర్లు, షేక్ బాష, ఇస్మా యిల్, సీనియర్ నాయకులు బట్టు సుధాకర్‌రెడ్డి, సుబ్బ రత్నం, ఏ.వీరారెడ్డి, షేక్ మంజూర్ తదితరులు పాల్గొన్నారు.


బాబుష్యూరిటీ బాండ్లు అందజేస్తున్న ఎరిక్షన్‌బాబు

ఆగిన ట్యాంకర్లు - గొంతెండుతున్న పల్లెలు

ట్యాంకర్లతో నీరు సరఫరా చేయవద్దని ప్రభుత్వం ఉత్తర్వులు

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 2: తీవ్ర వర్షాభావంతో మండలంలోని వివిధ గ్రామాల్లో తీవ్ర నీటి ఎద్దడి నెలకొన్న నేపథ్యంలో మొన్నటి వరకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరిగేది. అయితే రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న అనూహ్య నిర్ణయంతో గ్రామీణ ప్రాంతాల ప్రజల గొంతు ఎండుతోంది. మండలంలోని బిరుదులనరవలో 14, తిప్పాయపాలెం 21, పెద్దనాగులవరం 10, పెద్ద యాచవరం 10, నాయుడుపల్లి 15, కొట్టాలపల్లి 4, పిచ్చిగుంట్లపల్లిలో 6 ట్యాకర్ల నుంచి ప్రభుత్వం నీటి సరఫరా నిలిపివేసింది. దీంతో మండలంలో మొత్తం 108 ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నీటి ఎద్దడితో మండలంలోని మన్నెంవారిపల్లి గ్రామంలో మహిళలు తోపుడుబండ్లపై నీటిని తెచ్చుకు నేందుకు నానా అవస్థలు పడుతున్నారు. నీటి కోసం కూలి పనులు మానుకొని ఇంటి వద్ద ఉండి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింద న్నారు. ప్రభుత్వం నీటి సమస్యను గుర్తించి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

పొదిలి : గ్రామాల్లో ప్రజల అవసరాలకోసం ఏర్పాటు చేసిన మంచినీటి సరఫరా ట్యాంకులను నిలిపివేయడంతో పలు గ్రామాల ప్రజలు తీవ్రఇక్కట్లు ఎదుర్కొంటు న్నారు. ఆయా గ్రామాల్లో భూగర్భ జలాలు ఎండిపోవడంతో చేతి పంపులు మొరాయిస్తున్నాయి. దీంతో ప్రజలకు ట్యాంకుల నీరే శరణ్య మైంది. ఈ దశలో ట్యాంకర్ల నీటి సరఫరా ప్రభుత్వం నిలిపివేయడంతో నీళ్లకోసం సుదూరప్రాంతాలకు వెళ్లి నీరు తెచ్చు కోవాల్సి వస్తోందని, ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. అసలే వేసవికాలం సమీపి స్తున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరాను నిలిపి వేయ డంతో తీవ్ర ఇబ్బందులు తప్పవని పేర్కొంటు న్నారు. మండలంలోని మూగచింతల, కొండాయపాలెం, ఓబులక్కపల్లి, అక్కచెరువు, తుమ్మగుంట, జువ్వ లేరు, సలకనూతల, గురుగు బాడు గ్రామాల్లో రోజుకు సుమారుగా 50 ట్రిప్పుల నీటి సరఫరా జరుగుతుంది. ఆ గ్రామాలకు ఉన్న పళంగా నీటి సరఫరాను నిలిపివేయడంతో ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోందని వాపోతున్నారు.

పెద్ద దోర్నాల : మండలంలో ఈ ఏడాది డిసెంబర్ నుంచే తాగునీటి ఎద్దడి ఏర్పడింది. దీంతో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ట్యాంకర్లతో నీటిసరఫరా చేస్తున్నారు. కాగా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2019 నుంచి నీటి సర ఫరా బిల్లులు పెండింగులో పెట్టడంతో మండలంలో రూ.7 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. దీంతో కాంట్రాక్టర్లు నీటి సరఫరా చేసేం దుకు సుముఖంగా లేరు. మరోవైపు ప్రభుత్వం ట్యాంకర్లతో నీటి సరఫరా నిలిపి వేయాలని తదుపరి అనుమతులు ఇచ్చేంత వరకు సరఫరా చేయొద్దని గురువారం ఆదేశాలు జారీ చేసినట్లు ఏఈ భ్రమరాంబికాదేవి తెలిపారు. దీంతో నీటి ఎద్దడి మరింత తీవ్రమైంది.


పొదిలిలో రిక్షాలపై తెప్పించుకుంటున్న నీరు

ఇంటిబిడ్డగా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటా

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 2 : నియోజక వర్గంలో ఇంటి బిడ్డగా నిత్యం అందుబాటులో ఉంటానని, ఆదరించి ఆశీర్వదించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ముత్తు ముల అశోక్‌రెడ్డి ప్రజలను అభ్యర్థించారు. 'బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా గిద్దలూరు పట్టణంలోని 5వ వార్డులో అశోక్‌రెడ్డి శుక్రవారం రాత్రి ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలోని అంశాలను మహిళలకు వివరించారు. అనం తరం స్థానికంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. పట్టణంలో ప్రధాన సమస్య అయి న తాగునీటి సమస్య పరిష్కారానికి గుండ్లమోటు నుండి పైపులైన్ ద్వారా నీరు అందించానని, ఎన్టీఆర్ టిడ్కో గృహాలను మంజూరు చేశానని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఫించన్లు అందించనట్లు, సగిలేరువాగు మర మ్మతులకు నిధులు మంజూరు చేయించానని, అనారోగ్యంతో బాధపడే వారిని ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరు చేయించినట్లు తెలిపారు. అనంతరం అబద్ధపు హామీలతో అధి కారంలోకి వచ్చిన వైసీపీ పాలకులు గిద్దలూరు అభివృద్ధిపై దృష్టి పెట్టారా..? అని ప్రశ్నించారు. తాను స్థానికుడిని, ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సంపత్ కుమార్‌రెడ్డి, బచ్చనపోయిన సతీష్‌కుమార్, యల్లా రంగస్వామి, దప్పిలి నిరంజన్‌రెడ్డి, దప్పిలి శ్రీనివాసరెడ్డి, పసుపుల ప్రసాద్, కాశయ్య, రాగూర్, నీరజ, పట్టణ అధ్యక్షులు సయ్యద్ షహన్షావలి, ప్రధాన కార్యదర్శి పండిటి రజనీకుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్, టీడీపీ నాయకులు దప్పిలి భాస్కర్‌రెడ్డి, పాలుగుళ్ల ప్రతాపరెడ్డి, పాముల వెంకటరమణ, బైలడుగు బాలయ్య పాల్గొన్నారు.


గ్యారెంటీ పత్రాలను అంజేస్తున్న అశోక్‌రెడ్డి

నేటితో ముగియనున్న పాదయాత్ర

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 2: వెలిగొండ ప్రాజెక్టు, మార్కాపురం జిల్లా సాధన కోసం నాలుగు రోజులుగా నియోజకవర్గంలో జనసేన ఇన్‌చార్జ్ ఇమ్మడి కాశీనాథ్ చేస్తున్న పాదయాత్ర శనివారంతో ముగియనుంది. వెలుగొండ ప్రాజెక్టు సుంకేసుల గ్యాప్ వద్ద ముగింపు సభ శనివారం సాయంత్రం నాలుగు గంటలకు ఏర్పాటు చేయ నున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశా నికి నియోజకవర్గంలోని జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు. మండలంలోని బొడిచర్ల, తిప్పాయపాలెం, ఎల్సీఎస్‌నగర్ గ్రామాలలో శుక్రవారం జనసేన ఇన్‌చార్జ్ ఇమ్మడి కాశీనాథ్ పాదయాత్ర సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టు విష యంలో అబద్ధాలు చెబుతూ పశ్చి మ ప్రాంత ప్రజలను మోసం చేస్తోందన్నారు. రానున్న జనసేన-తెలుగుదేశం ప్రభుత్వంలో వెలి గొండ ప్రాజెక్టును పూర్తి చేసి, మార్కాపురంలో జిల్లాకేంద్రంగా ప్రత్యేక జిల్లాను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ పాదయాత్రలో జనసేన పార్టీ గిద్దలూరు నియో జకవర్గ ఇన్‌చార్జ్ బెల్లంకొండ సాయిబాబు, కాంగ్రెస్‌పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ షేక్ సైదా, సీపీఐ, మార్కాపురం నియో జకవర్గ నాయకులు సుదర్శన్, టీడీపీ రాష్ట్ర పరిశీలకులు శాసనాల వీరబ్రహ్మం, టీడీపీ మార్కాపురం నియోజకవర్గ నాయకులు దూదేకుల మస్తాన్, పటాన్‌ఖాన్‌లు మద్దతు తెలిపారు. ఈ పాదయాత్రలో జనసేన పార్టీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, అభిమానులు పాల్గొన్నారు.


పాదయాత్ర చేస్తున్న కాశీనాథ్, కార్యకర్తలు

మార్కెట్ యార్డును అభివృద్ధి పథంలో నడిపిస్తాం

కొలువుతీరిన నూతన పాలకవర్గం

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 2: మార్కెట్ యార్డును ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి పథంలో నడిపిస్తామని నూతనంగా చైర్మన్ బాధ్యతలు స్వీకరించిన మీర్జా షంషీర్ అలీబేగ్ అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులోని సమావేశ మందిరంలో శుక్రవారం మార్కెట్ యార్డు నూతన పాలకవర్గం పదవీ బాధ్యతలు స్వీకరించింది. చైర్మన్ మీర్జా షంషీర్ అలీ బేగ్, వైస్ చైర్మన్ పానుగంటి మురళీ, పాలకవర్గం సభ్యులు పీఎల్‌పీ యాదవ్, వేశపోగురాజు, ఇల్లూరి శారద, తూంపాటి అంజనేయులు, పేరూరి లక్ష్మీదేవి, షేక్ నూర్జహాన్, ఓర్సు పటేమ్మ, కోల వసంతకుమారి, శ్రీ ఆమ్ అంకమ్మ, చక్కా సత్యనారాయణ, ఊటుకూరి సురేష్, కర్ర రమాదేవిలతో యార్డు కార్య దర్శి కోటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సం దర్భంగా ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి మాట్లాడుతూ.. ఈ ప్రాంత రైతులకు యార్డు ద్వారా మంచి సేవలను అందించి మంచి పేరు తీసుకురావాలని కమిటీని కోరారు. చైర్మన్ అలీబేగ్ మాట్లా డుతూ.. మార్కెట్ యార్డు అభివృద్ధి కోసం, రైతులకు మెరుగైన సేవలు అందించటం కోసం తమ వంతు కృషి చేస్తామన్నారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ఎమ్మెల్యే, చైర్మన్ కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, వ్యవసాయ శాఖ ఏడీఏ రమాదేవి, పీఏసీఎస్ ప్రెసిడెంట్ గోలమారి సత్యనారాయణరెడ్డి, ఎమ్మెస్ ఎంఈ రాష్ట్ర డైరెక్టర్ నేరెళ్ల బద్రీనాథ్, వైసీపీ నాయకులు కుందురు కృష్ణ మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు జవాజి రంగారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.


నూతన పాలకవర్గంతో ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

అవీ..ఇవీ..

పోటీ పరీక్షల్లో పొదిలి విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

పొదిలి, ఫిబ్రవరి 2 : గుంటూరులో అద్వైత్‌స్కిల్ హబ్ ఆధ్వర్యంలో నిర్వ హించిన టోస్ట్ మాస్టర్ కాంపిటీషన్‌లో పొదిలి విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచారు. పట్టణంలోని నిర్మలాకాన్వెంట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు జెన్నీఫర్, సుదీప్తాలు ఈ పోటీలో ప్రథమస్థానంలో నిలిచారు. పాఠశాల తరఫున ఉపాధ్యాయులు, స్కిల్ హబ్ ఆధ్వర్యంలో విద్యార్థులను అభినందించారు. అనంతరం పాఠశాల కరస్పా డెంట్ రూబీ మాట్లాడుతూ..., విద్యార్థులను పాఠశాల దశ నుంచి వారికి ఏమి ఇష్టమో తెలుసుకొని ఆ మార్గంలోనే ప్రోత్సహించాలని విద్యార్థి తల్లిదండ్రులకు సూచించారు. వారి ఇష్టాలతో వెళ్లినప్పుడే విద్యలో ఉన్నత శిఖరాలకు చేరుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో అద్వైత్‌స్కిల్ హబ్ ఎండీ అజయ్‌కుమార్, వెంకటేష్ నాయక్, జీవన్‌కుమార్, పాఠశాల హెడ్‌మిస్ట్రెస్ రాణి, రీజినల్ మేనేజర్ దేవపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశుసంపదను కాపాడుకోవాలి


గోశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్

మార్కాపురం వన్ టౌన్, ఫిబ్రవరి 2: పశు సంపదను కాపాడు కోవాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. స్థానిక కొండేపల్లి రోడ్డులోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ మాన్యంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన గోశాలకు శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి మాట్లాడుతూ.., గోశాల అభివృద్ధికి దాతలు సహకరించాలన్నారు. లక్ష్మీచెన్నకేశవస్వామి గోసేవా సమితి అధ్యక్షులు మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ మాట్లాడుతూ 1.79 ఎకరాలలో గోశాల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సూక్ష్మ పరిశ్రమల శాఖ డైరెక్టర్ మేడా బద్రీనాథ్, గోసేవా సంఘం నాయకులు తడికమల్ల బాలుడు, పీఎల్ ప్రసాద్, గుంటక వనజాక్షి, హరిహరరావు, వీరారావు తదితరులు పాల్గొన్నారు.

వృత్తికే వన్నె తెచ్చిన ఝాన్సీ పాల్


ఝాన్సీపాల్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 2: యూటీఎఫ్ నాయకురాలిగా, ఉపాధ్యాయురాలిగా ఆర్ఎం ఝాన్సీపాల్ వృత్తికే వన్నె తెచ్చారని యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు మీగడ వెంకటేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలు ఆర్ఎం ఝాన్సీపాల్ ఉద్యోగ విరమణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు ఝాన్సీపాల్ సేవలు కొనియాడి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు కె.శ్రీనివాసరావు, వీరారెడ్డి, శ్రీరాములు, వెంకటేశ్వర్లు, ఎంఈవోలు రాందాస్ నాయక్, శ్రీనివాసులు, పి.శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీదేవి, పండిత పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రవిచంద్ర, సభ్యులు జీఎల్ రమేష్, జేవీవీ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన కమిషనర్‌కు సన్మానం

గిద్దలూరు, ఫిబ్రవరి 2 : గిద్దలూరు మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసి వైఎస్ఆర్‌జిల్లా ఎర్రగుంట్ల మున్సిపాలిటీకి బదిలీపై వెళ్లిన వై.రామక్రిష్ణయ్యను ఘనంగా సన్మానించారు. నూతన కమిషనర్ వి.శ్రీనివాసరావు, చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, వైస్‌చైర్మన్లు రామకృష్ణ దీపిక, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు. సిబ్బంది బదిలీపై వెళుతున్న రామకృష్ణయ్యను ఘనంగా సన్మానించారు. చేసిన సేవలను కొనియాడారు.

ఏ1 గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్‌గా మసూద్ బేగ్


బాధ్యతలు స్వీకరిస్తున్న మసూద్‌బేగ్

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 2: స్థానిక ఏ 1 గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్‌గా మిర్జా మహమ్మద్ మసూద్ బేగ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ లండన్‌లో ఉన్నత విద్యను పూర్తి చేసుకొని సత్ప్రవర్తన, క్రమశిక్షణ, ఉన్నత విలువలు కలిగిన మసూద్‌కు ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, కళాశాల చైర్మన్ డా.మిర్జాషంషీర్ అలీబేగ్ పాల్గొన్నారు.


మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుంకర సునీత, పక్కన ఎంపీడీవో శంకరరావు

మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం

- సగం మంది కూడా హాజరు కాని ప్రజా ప్రతినిధులు

ముండ్లమూరు, ఫిబ్రవరి 2 : మండల సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాల్సి ఉండగా కేవలం సంగం మంది కూడా హాజరుకాక పోవటంతో మొక్కుబడిగానే నిర్వహించారు. వచ్చిన ప్రజా ప్రతినిధుల్లో కూడా భార్యల స్థానంలో భర్తలు హాజరయ్యారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు ముఖ్యంగా విద్యుత్, ఆర్టీసీ, ఎస్ఎస్‌పీ తదితర శాఖల అధికారులు హాజరు కాలేదు. వివిధ శాఖల పై సమీక్షలు నిర్వహించి ఉండాల్సిందిగా పూర్తిగా ఆ శాఖల పై సమీక్ష జరిగిన దాఖలాలు లేవు. ప్రధానంగా వ్యవసాయ శాఖ, పశు సంవర్ధక శాఖ, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ శాఖల పై పూర్తి స్థాయిలో సమీక్ష జరగాల్సి ఉండగా అలాంటివి ఏమి జరగ లేదు. ఎంపీటీసీలు కూడా కేవలం ఆరుగురు మాత్రమే హాజరయ్యారు. సర్పంచ్‌లు 21 మంది హాజరు కావాల్సి ఉండగా ఎనిమిది మంది మాత్రమే హాజరయ్యారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ రత్నరాజు, ఎంపీడీవో శంకరరావు, డిప్యూటీ తహసీల్దార్ పుల్లారెడ్డి, ఈవోఆర్‌డీ శ్రీదేవి, పంచాయతీ రాజ్ ఏఈ ఎం వెంకటేశ్వర్లు, వ్యవసాయ అధికారి ఫరూక్, పశు సంవర్ధకశాఖ అధికారి విజయలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ హనుమంతరావు, ఎంపీటీసీ సభ్యులు తేలుకుట్ల బ్రహ్మం, నాగమల్లి అంకారావు, దాసరి పెద అంజయ్య, కుంటా ఏగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మండలంలో 37,488 మంది ఓటర్లు

దొనకొండ, ఫిబ్రవరి 2 : మండలంలోని 18 గ్రామ పంచాయతీల పరిధిలోని 47 పోలింగ్‌బూత్‌లలో పురుషులు 19,014, మహిళలు 18,474 మొత్తం 37,488 మంది ఓటర్లు జాబితాలో నమోదు అయ్యారు. గ్రామాల వారీగా చందవరం పురుషులు 1,844, మహిళలు 1,698, మొత్తం 3,542, పోలేపల్లి పురుషులు 1,312, మహిళలు 1,258 మొత్తం 2,570, పి లక్ష్మీపురం పురుషులు 602, మహిళలు 524 మొత్తం 1,126, దొనకొండ పురుషులు 2,428, మహిళలు 2,628 మొత్తం 5,056, రుద్రసముద్రం పురుషులు 1,061, మహిళలు 1,030 మొత్తం 2,091, రామాపురం పురుషులు 633, మహిళలు 604 మొత్తం 1,237, కొచ్చెర్లకోట పురుషులు 1,964, మహిళలు 1,894 మొత్తం 3,858, భూమనపల్లి పురుషులు 548, మహిళలు 456 మొత్తం 1,004, మంగినపూడి పురుషులు 939, మహిళలు 919 మొత్తం 1,858, మల్లంపేట పురుషులు 1,065, మహిళలు 978 మొత్తం 2,043, ఇండ్లచెరువు పురుషులు 1,011, మహిళలు 997, మొత్తం 2,008, వెంకటాపురం పురుషులు 699, మహిళలు 662 మొత్తం 1,361, సంగాపురం పురుషులు 476, మహిళలు 481 మొత్తం 957, వద్దిపాడు పురుషులు 617, మహిళలు 573 మొత్తం 1,190, తెల్లబాడు పురుషులు 569, మహిళలు 540 మొత్తం 1,109, ఆరవల్లిపాడు పురుషులు 929, మహిళలు 930 మొత్తం 1,859, పెద్దన్నపాలెం పురుషులు 976, మహిళలు 981 మొత్తం 1,957, గంగదేవిపల్లి పురుషులు 1,341, మహిళలు 1,321 మొత్తం 2,662 మంది ఓటర్లు జాబితాలో నమోదయ్యారు.


ఆసరా చెక్కును అందజేస్తున్న జడ్పీచైర్‌పర్సన్ వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి

నా బిడ్డను ఆశీర్వదించండి

- జడ్పీచైర్‌పర్సన్ వెంకాయమ్మ

కురిచేడు, ఫిబ్రవరి 2: నా బిడ్డను మీ చేతిలో పెడుతున్నా.. ఆశీర్వదించండి అని జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ కురిచేడు మండల మహిళలతో అన్నారు. ఆసరా పథకం క్రింద 4 వ విడత డ్వాక్రా మహిళలకు చెక్కులు పంపిణీ చేసేందుకు స్థానిక మార్కెట్ యార్డులో ఐకేపీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డిలు హాజరయ్యారు. ఈ సమావేశంలో వెంకాయమ్మ మాట్లాడుతూ నవరత్నాలలో నూరు శాతం అమలు చేసిన ఘనత జగన్‌దే అన్నారు. శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో ప్రజలు అష్ట కష్టాలు పడ్డారని, అదే ప్రజలు జగన్ ముఖ్యమంత్రి అయ్యాక సంతోషంగా ఉన్నారని అన్నారు. నవరత్నాలతో ప్రజలకు ఎంతో మేలు జరిగిందన్నారు. అనంతరం మహిళలకు 4వ విడత చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండ పరిషత్ అధ్యక్షురాలు బెల్లం కోటేశ్వరమ్మ, ఎంపీడీవో సీతారామయ్య, ఐకేపీ సిబ్బంది, మండల స్థాయి అధికారులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ అంతర్గత రోడ్ల నిర్మాణపనులు

పామూరు, ఫిబ్రవరి 2 : పామూరు పంచాయతీ పరిధిలోని వరవ కట్టలైన్‌లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకొంటున్నట్లు ఉపసర్పంచ్ ఫైవీ సాయికిరణ్ తెలిపారు. స్థానిక విరువూరు రోడ్, వరవ కట్ట లైన్‌రోడ్డులను గ్రావెల్


నిర్మాణానికి తోలిన గ్రావెల్‌ను పరిశీలిస్తున్న ఉపసర్పంచ్, కార్యదర్శి

రోడ్డుగా నిర్మించేందుకు తోలిఉన్న గ్రావెల్‌ను శుక్రవారం పరిశీలించారు. దశలవారీగా అంతర్గత రోడ్లను సీసీ రోడ్లుగా నిర్మాణం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వి. బ్రహ్మానందరెడ్డి, స్థానిక వార్డుమెంబర్ షేక్ ఇస్మాయిల్, పాల్గొన్నారు.


మద్యం దుకాణంలో కాలిపోయిన కంప్యూటర్

మద్యం దుకాణానికి నిప్పు

- అప్రమత్తమై మంటలను ఆర్పిన సిబ్బంది
- ఘటనకు పాల్పడిన మతిస్థిమితం లేని యువకుడు

దర్శి, ఫిబ్రవరి 2 : దర్శి పట్టణంలోని అద్దంకి రోడ్డులో గల మద్యం దుకాణానికి ఒక యువకుడు పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటన శుక్రవారం జరిగింది. ముండ్లమూరు మండలం ఉల్లగల్లు గ్రామానికి చెందిన ఎం. వంశీకృష్ణ అనే యువకుడు కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. బీటెక్ చదువుకొని ఉద్యోగం కోసం ప్రయత్నించినా రాకపోవటంతో మానసిక స్థిమితం కోల్పోయాడు. ఈ నేపథ్యంలో దర్శి పట్టణంలోని మద్యం దుకాణానికి పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ముందు గదిలోని కంప్యూటర్ పాక్షికంగా దెబ్బతిన్నది. వెంటనే మంటలు ఆర్పటంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. దర్శి ఎస్సై శివన్నారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నాడు.

దుర్మార్గపు పాలనకు రోజులు దగ్గరపడ్డాయి

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉగ్ర నరసింహారెడ్డి

పామూరు, ఫిబ్రవరి 2: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం సాగిస్తున్న అవినీతి దుర్మార్గపు పాలనకు రోజులు దగ్గర పడ్డాయని, విసుగెత్తిన ప్రజలు రానున్న ఎన్నికల్లో చమరగీతం పాడేందుకు సిద్ధంగా ఉన్నారని మాజీఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. పామూరు పట్టణం లోని శేషమహల్ ప్రాంగణంలో టీడీపీ మండలస్థాయి విస్తృత స్థాయి సమావేశం టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉగ్ర మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కార్యకర్తలు సైనికుల వలే పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలోనే మొదటిగా గెలిచేసీటు కనిగిరి అని చంద్రబాబు, నేను వందశాతం గెలుస్తున్నామని, అయితే ప్రతిక్షణం కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.గ్రామ పంచాయతీ ఎన్నికలవలే పనిచేస్తేనే విజయం సాధించగలమన్నారు. ఓటర్‌లిస్ట్‌పై అందరూ దృష్టి సారించి పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాలని, అధికార పార్టీ వలంటీర్ మేనేజ్‌మెంట్ విధానంతో దొంగోట్లు పోల్‌చేసే అవకాశం ఉందన్నారు. బాబు ష్యూరిటీ భవిషత్తుకు గ్యారెంటీ ప్రోగ్రాంలో పామూరు వెనుకబడిఉందని, ఈ నెల 12 నాటికి టార్గెట్ పూర్తి చేయాలని కోరారు. ప్రతి గ్రామాన్ని సంబంధిత నాయకులు కనీసం 5 సార్లు వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం చేపట్టి అవగాహన కల్పించాలన్నారు. ముందుగా పార్టీలో చేరిన వారికే ప్రాధాన్యత ఇస్తామని పార్టీ అభ్యర్థి విజయంలో కీలపాత్ర పోషించిన వారికే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యత ఉంటుందన్నారు. అనంతరం పామూరు ట్యాక్సీ డ్రైవర్ అసోసియేషన్ కమిటీ తరుపున ఉగ్రను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు.

జీపు స్టాండ్‌కు స్థలం కేటాయించాలని వినతి పత్రంలో కోరారు. నిమ్స్, ఫార్మ హబ్ పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అనంతరం ఉగ్రను ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీలు జి. దశరథరామయ్య ఆవుల నాగేశ్వరరావు, సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి, నాయకులు, అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి, ఎం. గంగరాజుయాదవ్, యారవ శ్రీను, ఆర్‌ఆర్‌రఫి, వై. ప్రసాద్‌రెడ్డి, వై. రమేష్, ఏ. హరిప్రసాద్, మాజీ జడ్పీటీసీ ఎం. హుసేన్‌రావు యాదవ్ మాజీ సర్పంచ్ కావిటి సుబ్బయ్య, ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, పట్టణ కమిటీ సభ్యులు, షేక్ ఖాజారహంతుల్లా, ఉప్పలపాటి హరిబాబు, షేక్ గౌస్‌బాష, పందిటి హరీష్, ఇర్రి కోటిరెడ్డి, డేగా నాగరాజు, ఎం. రమణయ్య డోలా శేషాద్రి, ఎం.రమాదేవి, జాజం రమణమ్మ, ఈశ్వరమ్మ, నూర్‌బీతోపాటు గ్రామకమిటీ అధ్యక్షులు, క్లస్టర్ బూత్ కమిటీ ఇన్‌చార్జులు, సోషల్ మీడియా కన్వీనర్లు, నాయకులు,కార్యకర్తలు,టాక్సీ డ్రైవర్లుపాల్గొన్నారు.


టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఉగ్ర


తిరగళదిన్నెలో వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారిని పార్టీ కండువాలతో స్వాగతం పలుతున్న ఉగ్ర

ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన 90 బీసీ కుటుంబాలు

పామూరు, ఫిబ్రవరి 2 : టీడీపీకి బీసీలే వెన్నెముక అని, బీసీలకు రాజకీయ చైతన్యం కల్పించిన ఘనత టీడీపీకే దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మండలంలోని నుచ్చుపొద గ్రామ పంచాయతీ పరిధిలోని తిరగళదిన్నె గ్రామంలో శుక్రవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో వైసీపీని విడి సుమారు 90 బీసీ కుటుంబాలవారు ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి ఉగ్ర పార్టీ కండువాలు వేసి స్వాగతం పలికారు. గతంలో బీసీలందరూ టీడీపీ వైపే ఉన్నారని, ఒక్క చాన్స్ పేరుతో జగన్ మోసపు మాటలు నమ్మి అందలం ఎక్కిస్తే బీసీల సంక్షేమంతో పాటు అభివృద్ధిని విస్మరించారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వ అవినీతి అరాచక పాలనతో విసిగి వేసారిన ప్రజలు చరమగీతం పాడేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం బీసీ సంఘం నాయకులు మల్లెబోయిన బాలబ్రహ్మయ్య, మాజీ సర్పంచ్ గురుబ్రహ్మం, తెలుగు మహిళా నాయకురాలు ఆవుల రమణమ్మ ఆధ్వర్యంలో 90 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కాగా ఇదే కార్యక్రమంలో పాల్గొన్న జనసేన జిల్లా కార్యదర్శి వై. రహీముల్లా ఆధ్వర్యంలో సుమారు 15 మంది యువకులు వైసీపీని వీడి జనసేనలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు పువ్వాడి వెంకటేశ్వర్లు, ఎం. గంగరాజు, బొల్లా నరసింహారావు షేక్ ఖాజారహంతుల్లా, దేవరపు మాల్యాద్రి, ఆరేకొండ హరిప్రసాద్, కౌలూరి రహంతుల్లా, పాడే నాగమణితో పాటు, జనసేన నాయకులు మండల కార్యదర్శి దరిశి ఏడుకొండలు, ప్రోగ్రాం కమిటీ జిల్లా కార్యదర్శి రామిశెట్టి సునీల్, టీడీపీ జనసేన నాయకులు, కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న నగర పంచాయతీ చైర్మన్ పిచ్చయ్య

పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

దర్శి, ఫిబ్రవరి 2 : దర్శి పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య సూచించారు. మూడవ వార్డులో రూ.7లక్షలతో నిర్మిస్తున్న సైడుకాల్వల పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని అన్నీ ప్రాంతాల్లో మురికి కాల్వలు నిర్మించి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ రహీం, కౌన్సిలర్ ఇత్తడి దినకర్ తదితరులు పాల్గొన్నారు.


ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షురాలు షర్మిలతో కాంగ్రెస్ ధర్నాలో పాల్గొన్న జిల్లా యువజన కాంగ్రెస్‌పార్టీ ప్రధానకార్యదర్శి కైపు వెంకట కృష్ణారెడ్డి

ఢిల్లీ ధర్నాలో తాళ్లూరు నేతలు

తాళ్లూరు, ఫిబ్రవరి 2 : ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆధ్వర్యంలో ఢిల్లీలో కాంగ్రెస్‌పార్టీ తలపెట్టిన ప్రత్యేక హోదా-ఆంధ్రులహక్కు కార్యక్రమంలో శుక్రవారం జిల్లా యువజన కాంగ్రెస్‌పార్టీ ప్రధానకార్యదర్శి కైపు వెంకట కృష్ణారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఎస్.రఘురామిరెడ్డి, గిడుగు రుద్రరాజు,కేవీపీ రామచంద్రరావు, కొప్పుల నాగరాజు, జేడీ శీలం, తులసిరెడ్డి, లక్కరాజు రామారావు, రాకేష్‌రెడ్డి, మస్తాన్‌వలి, సుంకర పద్మశ్రీ, జిల్లా నుంచి యువనాయకులు ప్రవీణ్‌కుమార్, విజేష్ రాజ్, భరత్ పాల్గొన్నారు.

మార్కాపురం ఎస్ఐగా అబ్దుల్ రహమాన్



మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 2: పట్టణ ఎస్ఐగా షేక్ అబ్దుల్ రహమాన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన వీఆర్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన కోటేశ్వరరావు వీఆర్‌కు వెళ్లారు. పట్టణంలో శాంతిభద్రతలు కాపాడేందుకు, ట్రాఫిక్ నియంత్రించేందుకు కృషి చేస్తామన్నారు. స్టేషన్ సిబ్బంది బొకేలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు ఏకాగ్రత ముఖ్యం

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 2: విద్యార్థులకు ఏకాగ్రత ముఖ్యమని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు గంపా నాగేశ్వరరావు అన్నారు. స్థానిక కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ... జ్ఞాపకశక్తి పెంపొందించు కోవాలని, ప్రశ్నించేతత్వం అలవాటు చేసుకోవాలని అన్నారు. కళాశాల కార్యదర్శి డా.అన్నా కృష్ణచైతన్య మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. వి.కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డా.రంగనాయకులు, ఏవోప్రభాకర్,ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యక్తిత్వ వికాస నిపుణుడు గంపా నాగేశ్వరరావు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

దొనకొండ, ఫిబ్రవరి 2 : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని వెంకటాపురం గ్రామానికి వెళ్లే రహదారిలో శుక్రవారం రాత్రి జరిగింది. అందిన వివరాల మేరకు వెంకటాపురం గ్రామానికి చెందిన కొంగలేటి కరుణాకర్, కొంగలేటి కృపయ్యలు ద్విచక్ర వాహనంపై దొనకొండ వైపు వస్తున్నారు. వెంకటాపురం వైపు వెళ్లే గుర్తు తెలియని ఆటో వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి ఆపకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఇరువురు వాహనంతో పాటు రోడ్డుప్రక్కన పడి తీవ్ర గాయాలపాలయ్యారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది వెలుగొండయ్య, ప్రసాదరావులు, హుటాహుటిన చేరుకొని క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేపట్టి మార్కాపురం వైద్యశాలకు తరలించారు.

వైసీపీలో ఎటువంటి గ్రూపులు లేవు

దొనకొండ, ఫిబ్రవరి 2 : మండలంలోని వైసీపీలో ఎటువంటి గ్రూపులు లేవని అందరూ ఒకే కుటుంబంలా రానున్న ఎన్నికల్లో పనిచేసి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి విజయానికి కృషి చేయాలని వైసీపీ మండల ఇన్‌చార్జి రమణారెడ్డి కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. సచివాలయం ఆవరణలో గురువారం నిర్వహించిన ఆసరా కార్యక్రమానికి భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసిన మండలంలోని పొదుపు గ్రూపుల మహిళలకు, వైసీపీ నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కోరారు. ఈనెల 5వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి మన ఊరికి మన శివన్న కార్యక్రమం చందవరం గ్రామంలో నిర్వహిస్తున్నామని, దాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళీ, మండల వైసీపీ మాజీ కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి, తమ్మనేని సుబ్బారెడ్డి, బీఎస్ రాజు, పిల్లి ఒబుల్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దొనకొండ ఎస్సైగా సంపత్‌కుమార్


బాధ్యతలు స్వీకరిస్తున్న సంపత్‌కుమార్

దొనకొండ, ఫిబ్రవరి 2 : దొనకొండ ఎస్సైగా ఎల్ సంపత్‌కుమార్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఒంగోలు వన్‌టౌన్‌ఎస్సైగా పనిచేస్తూ ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు దొనకొండకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన ఎస్సై మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు బాధ్యతగా కృషి చేస్తామన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, జూదం, అక్రమ మద్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. పోలీస్ సిబ్బంది నూతన ఎస్సైకి శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటి వరకు ఎస్సైగా పనిచేసిన ఎం. సైదుబాబు పామూరుకు బదిలీ అయ్యారు.

దర్శి ఎస్సైగా శివన్నారాయణ



దర్శి, ఫిబ్రవరి 2 : దర్శి నూతన ఎస్సైగా జి. శివన్నారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు.ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై దృష్టి సారిస్తామన్నారు. అసాంఘిక కార్యక్రమాల నిర్మూలనకు పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు.

పామూరు ఎస్ఐ బాధ్యతల స్వీకరణ



పామూరు : నూతన ఎస్ఐగా సైదుబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా దొనకొండ నుంచి పామూరు స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న ఎన్నికలు శాంతియుత వాతవరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. పామూరులో వేధిస్తున్న ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారిస్తానని తెలిపారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా వాహనదారులతో ర్యాలీ చేస్తున్న అధికారులు

దర్శి, ఫిబ్రవరి 2 : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని రవాణాశాఖ అధికారి రవికుమార్ సూచించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం వాహనదారులు హెల్మెట్ ధరించి దర్శి పట్టణంలో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రమాదాలను నివారించేందుకు ట్రాఫిక్ నిబంధలను పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలు వాహనాల యజమానులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉగ్ర గెలుపు కోరుతూ కడప దర్గాలో ప్రార్థనలు


కడప అమిన్‌పీర్‌దర్గాలో ప్రార్థనలు చేస్తున్న టీడీపీ బూత్ కమిటీ ఇన్‌చార్జులు

పామూరు, ఫిబ్రవరి 2 :రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కనిగిరి టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలవనున్న టీడీపీ ఇన్‌చార్జి ఉగ్ర అత్యధిక మెజార్టీతో అఖండ విజయం సాధించాలని కోరుతూ కడప అమీన్‌పీర్‌దర్గా (పెద్దదర్గా)లో శుక్రవారం టెంకాయలు కొట్టి ప్రత్యేక ప్రార్థనలు జరిపినట్లు ఐటీడీపీ మండల కోఆర్డినేటర్ ఫత్తు మస్తాన్ తెలిపారు. ఉగ్ర గెలుపుతోనే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని, ఉగ్ర గెలుపులో అమీన్ పీర్ దర్గా స్వామి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. దర్గాలో ప్రార్థనలు చేసిన వారిలో బూత్ కమిటీ ఇన్‌చార్జులు, షేక్ చినహజరత్, కౌలూరి రహంతుల్లా, షేక్ షబ్బీర్, వై అస్లీంలు ఉన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో పార్టీ కార్యకలాపాలా?


మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షులు ముత్తిరెడ్డి

వెలిగండ్ల, ఫిబ్రవరి 2 : ప్రభుత్వ కార్యాలయాలను అధికార పార్టీ వారు తమ సొంత కార్యక్రమాలకు వినియోగించుకుంటూ సామాన్యులకు ఇబ్బంది కలిగించడం దుర్మార్గమైన చర్యని మండల అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు శుక్రవారం వెలిగండ్ల టీడీపీ కార్యలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలిగండ్లలో వైసీపీ ఇన్‌చార్జి పరిచయ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రభుత్వ కార్యాలయంలో నిర్వహించడం వలన కార్యాలయానికి వచ్చే అర్జీదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.

జిల్లా స్థాయి విజేత నాగంబొట్లపాలెం క్రికెట్ జట్టు


ఆడుదాం-ఆంధ్రా టోర్నమెంట్‌లో విజేతలైన నాగంబొట్లపాలెం సచివాలయ క్రికెట్ జట్టు

తాళ్లూరు, ఫిబ్రవరి 2: ఆడుదాం-ఆంధ్రా టోర్నమెంట్స్ జిల్లా స్థాయిలో ఒంగోలులో శుక్రవారం జరిగిన పోటీలో నాగంబొట్లపాలెం సచివాలయ టీమ్ విజేతగా నిలిచింది. జిల్లాస్థాయిపైనల్ పోటీల్లో నూతలపాడు టీమ్‌తో తలపడగా నాగంబొట్లపాలె సచివాలయ జట్టు విజయం సాధించింది. జిల్లా స్థాయి విన్నర్‌గా నిలిచిన జట్టును మండల స్థాయి అధికారులు, గ్రామ సర్పంచ్ అభినందించారు.

అధికారుల బదిలీ

పీసీపల్లి,ఫిబ్రవరి2: త్వరలో ఎన్నికల షెడ్యూల్ వెలువడనున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాలతో మండలంలోని వివిధ శాఖల అధికారులను ఆయా శాఖల ఉన్నతాధికారులు బదిలీచేశారు. తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్‌ను పల్నాడు జిల్లాకు బదిలీ చేయగా ఎంపీడీవో శ్రీనివాసరెడ్డిని రేపల్లెకు బదిలీచేశారు. బదిలీ ఉత్తర్వుల మేరకు వారిరువురు విధుల నుంచి రిలీవ్ అయ్యారు.పీసీపల్లి ఎస్సైగా వీఆర్‌లో ఉన్న రమేష్‌ను నియమించారు. అయితే ఇక్కడ ప్రస్తుతం ఎస్సైగా ఉన్న కోటయ్యకు బదిలీ ఉత్తర్వులు రాకపోవడంతో రమేష్ విధుల్లో జాయిన్ కాలేదు. ఎంపీడీవో స్థానంలో ఎవరినీ నియమించకపోవడంతో సూపరింటెండెంట్ రమణారెడ్డి ఇన్‌చార్జ్ బాధ్యతలను తీసుకున్నారు.తహసీల్దార్ కార్యాలయంలో డీటీ ప్రస్తుతం ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా ఉన్నారు.కొత్త అధికారులు వచ్చి విధుల్లో చేరేంతవరకు వారు ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తారని ఆయా కార్యాలయాల వర్గాలు తెలిపాయి.

ఆరోగ్యసురక్షను సద్వినియోగించుకోవాలి

తాళ్లూరు, ఫిబ్రవరి 2 : రాష్ట్రంలోని పేదలందరూ ఆరోగ్య వంతులుగా ఉండేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో మాధవీలత అన్నారు. తాళ్లూరులో జగనన్న ఆరోగ్యసురక్ష -2 కార్యక్రమం శుక్రవారం జరిగింది. గ్రామాల్లో ఇంటింటి సర్వే జరిపి వ్యాధిగ్రస్తులను గుర్తించటం, శస్త్రచికిత్సలు అవసరమైన వారికి మెరుగైన చికిత్సల కోసం జిల్లా వైద్యశాలలకు పంపుతున్నామన్నారు. రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు ఎస్కేఖాదర్‌మస్తాన్‌బీ, రాజేష్ , ఎంఎల్‌పీహెచ్‌వోలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



నరసరావుపేట ప్రాంతంలో శనగ

● బుగ్గవాగు రిజర్వాయర్ సామర్థ్యం పెంపు లేనట్లే..


అంచనాలకే.. ఆపసోపాలు

● వ్యయం అంచనాల దశ దాటని పనులు

● బుగ్గవాగు పైనే జల జీవన్ మిషన్, వాటర్ గ్రిడ్ పథకాలు ఆధారం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

తాగు, సాగునీటి అవసరాల కోసం నాగార్జున సాగర్ కుడికాలువ పరిధిలోని బుగ్గవాగు రిజర్వాయర్ సామర్థ్యం పెంపు దశాబ్దాల కల. ప్రభుత్వాలు మారుతున్నాయి తప్ప ఈ కలకు సాకారం కావడంలేదు. తెలుగుదేశం ప్రభుత్వం బుగ్గవాగు అభివృద్ధికి రూ.202 కోట్లు మంజూరు చేసింది. ప్రస్తుత ప్రభుత్వం బుగ్గవాగు సామర్థ్యాన్ని 3.5 టీఎంసీల నుంచి 7 టీఎంసీలకు పెంచుతామని ఆర్భాటంగా ప్రకటించింది. నేటికి కార్యరూపం దాల్చలేదు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పనులు వ్యయం అంచనాలు దగ్గరే నిలిచిపోయాయి. బుగ్గవాగు అభివృద్ధిపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి కొరవడింది.



బుగ్గవాగు రిజర్వాయర్ నుంచి నీటి సరఫరా

నిలిచిన పనుల వ్యయం అంచనాలు

బుగ్గవాగు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ దుర్గి ప్రాంతంలో కుడికాలువ 27 నుంచి 33వ కిలోమీటర్ మధ్యలో ఉంది. నీటి నిల్వ సామర్థ్యం 3.46 టీఎంసీలు. డెడ్ స్టోరేజి 1.69 టీఎంసీలు కాగా 1.77 టీఎంసీల నీటిని వినియోగిచుకోచ్చు. సామర్థ్యాన్ని పెంచడం ద్వారా తాగు, సాగునీటి అవసరాలు తీర్చవచ్చన్న ప్రతిపాదనలు దశాబ్దాలుగా ఉన్నాయి. రిజర్వాయర్‌ను 3.46 టీఎంసీల నుంచి 4.77 టీఎంసీలకు పెంచాలని తెలుగుదేశం ప్రభు త్వం నిర్ణయించింది. ఇందుకు నిపుణుల కమిటీ కూడా నాడు ఆమోదం తెలిపింది. రూ.424 కోట్ల వ్యయం అవుతుందని అంచ నాలు రూపొందించారు. రూ.202 కోట్లు నిధులు కూడా మంజూరు చేశారు. ఐతే 3.46 టీఎంసీల నుంచి 7 టీఎంసీలకు సామర్థ్యాన్ని పెంచుతామని ప్రస్తుత ప్రభుత్వం ప్రకటించి ఇందుకు సంబంధించిన డీపీఆర్ రూపొందిం చాలని జలవనరుల శాఖను ఆదేశించింది. ఇందు కోసం నిధులు కూడా విడుదలయ్యాయి. 2020 అక్టోబరులో డీపీఆర్ కోసం కాంట్రాక్టర్ ను నియమించాలని ఇందుకు సంబంధించిన టెండర్‌ను కూడా జలవనరుల శాఖ పిలిచి కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. కాం ట్రాక్టర్ తప్పుకోవడంతో పనులు వ్యయం అంచనాలు రూపొందించడం నిలిచిపోయింది.

ఏడాదంతా నీరందించే అవకాశం..

బుగ్గవాగు సామర్థ్యం పెంపుపైనే తాగునీటి పథకాల అభివృద్ధి ఆధారపడి ఉంది. పల్నాడు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు జిల్లాల ప్రజలు వేసవిలో తాగునీటికి తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. బుగ్గవాగు సామర్థ్యం పెంచితే ఏడాది పొడవునా తాగునీరు అందించే అవకాశం ఉంటుంది. గ్రా మాల్లో తాగునీటి సమస్యలు పరిష్కారం, ప్రతి వ్యక్తికి 55 లీటర్ల తాగునీరు అందించాలన్నది కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జలజీవన్ మిషన్ పథకం లక్ష్యం. బోర్లు నీటి సరఫరాను నిలిపి వేసి సాగర్ నీటిని అందించాలన్న దిశగా ఈ మిషన్ పనులు సాగుతున్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా జల జీవన్ మిషన్ పనులు చేపట్టాయి. కాగా పల్నాడు వాటర్ గ్రిడ్ పథకాన్ని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. రూ.1,500 కోట్ల వ్యయంతో తాగునీటి పథకాలను అభివృద్ధి చేసి బుగ్గవాగు నుంచి పైపులైన్ ద్వారా నీటిని గ్రామాలకు సరఫరా చేయాలని నిర్ణయించారు. ఇలా జల్‌జీవన్ మిషన్, వాటర్ గ్రిడ్ పథకాలు బుగ్గవాగు సామర్థ్యం పెంపుపై ఆధారపడి ఉన్నాయి. తాగు, సాగు నీటి అవసరాలను తీర్చే బుగ్గవాగు రిజర్వాయర్ సామర్థ్యం పెంపు పనులు కాగితాలకే పరిమితం కావడం గమనార్హం. పనులు చేపట్టకపోవడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. వ్యయం అంచనాలు ఎప్పటికి రూపొందిస్తారో వేచి చూడాలి.

రబీలోనూ.. కరువే

ఖరీఫ్ సీజన్ పంటల సాగుకు కలిసిరాలేదు. రబీలోనూ అదే పరిస్థితి నెలకొంది. రబీ అయినా సాగుకు కలసి వస్తుందని ఆశపడ్డ అన్నదాలకు అడియాశే మిగిలింది. జలాశయాల్లో నీటి నిల్వలు నిండుకోవడంతో సాగుకు నీరులేదు. కేవలం వర్షాధారంపైనే ఆధారపడి పంటలు సాగు చేశారు. సాధారణం కంటే పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలో 1.75 లక్షల ఎకరాల్లో పంటలు సాగు తగ్గింది. వరి సాగును రైతులు పూర్తిగా కోల్పోయారు. అటు ఖరీఫ్, ఇటు రబీలో తీవ్ర వర్షాభావంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

● ఖరీఫ్ మాదిరిగానే తగ్గిన సాగు

● బీళ్లుగా 1.75 లక్షల ఎకరాలు

● గణనీయంగా తగ్గిన వరి, మొక్కజొన్న

● శనగ, పొగాకు సాగు పెరుగుదల

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఖరీఫ్ నాటితో పోలిస్తే రబీలో కరువు పరిస్థితులు మరింత తీవ్రమయ్యాయి. సాధారణం కంటే అక్టోబరు, నవంబరులో పల్నాడు జిల్లాలో 52.47 శాతం తక్కువ వానలు కురిశాయి. గుంటూరు జిల్లాలో 62.06శాతం, బాపట్ల జిల్లాలో 56.67శాతం తక్కువ వానలు కురిశాయి. రబీకి కీలకమైన ఈ నెలల్లోనే వానలు లేకపోవడంతో సాగు తగ్గిపోయింది. డిసెంబరు మొదటివారంలో మిచౌంగ్ తుపాను ముంచేసింది. ఈ తర్వాత కూడా సరైన వానల్లేవు. మిచౌంగ్ తుఫాను ప్రభావంతో కురిసిన అతి భారీ వర్షాలు వేసిన శనగ పంటను తుడిచి పెట్టుకుపోయింది. మళ్లీ అదే పొలాల్లో తిరిగి శనగ సాగు చేయాల్సి వచ్చింది. దీంతో శనగ సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. రబీలో వరి తర్వాత ప్రధాన పంట మొక్కజొన్న ఈ పంట సాగు గణనీయంగా తగ్గింది. వరి సాధారణ విస్తీర్ణం 1,48,239 ఎకరాలు ఉంటే 25,790 ఎకరాల్లోనే సాగైంది. సాధారణంలో 17.39 శాతమే వరి సాగు చేశారు. సాగు నీరు సరఫరా లేకపోవడంతో కేవలం బావులు, బోర్లు, వాగుల కింద మాత్రమే వరి సాగు చేశారు. గత ఐదేళ్లలో పరిశీలించినా ఇంత తక్కువ విస్తీర్ణంలో వరి సాగు చేసిన దాఖలాలు లేవు.

పెరిగిన శనగ, పొగాకు సాగు...

రబీలో వరి తర్వాత ప్రధాన పంట మొక్కజొన్న మూడు జిల్లాల్లో సాధారణ విస్తీర్ణం 1,47,457 ఎకరాలు ఉంటే కేవలం 70,015 ఎకరాల్లోనే సాగు చేశారు. మొక్కజొన్న సాగు దారుణంగా పడిపో యింది. మిచౌంగ్ తుపాను ప్రభావంతో కురిసిన వర్షాల అనంతరం నీరు అవసరం లేని శనగ పంటను రైతులు విస్తృతంగా సాగు చేశారు. శనగ సాగు గణనీయంగా పెరిగింది. శనగ సాధారణ విస్తీర్ణం 1,27,555 ఎకరాలు కాగా 1,37,648 ఎకరాల్లో సాగు చేశారు. ఈ పంట సాగు బాపట్ల జిల్లాలో భారీగా తగ్గగా గుంటూరు, పల్నాడు జిల్లాల్లో గణనీయంగా పెరిగింది. పొగాకు సాగు కూడా పెరిగింది. పొగాకు 21,515 ఎకరాలు సాధారణ విస్తీర్ణం కాగా 42,718 ఎకరాల్లో సాగు చేశారు. దాదాపు 21,203 ఎకరాల్లో పొగాకు సాగు పెరిగింది. బాపట్ల జిల్లాలో అత్యధికంగా పొగాకు సాగు పెరిగిందని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. వరి, మొక్కజొన్న పంటల సాగు భారీగా తగ్గగా శనగ, పొగాకు పంటలసాగు గణనీయంగా పెరిగింది.

పంటల సాగు వివరాలు ఎకరాల్లో..

జిల్లా	సాగు లక్ష్యం	విస్తీర్ణం	విస్తీర్ణం	శాతం
పల్నాడు	1,42087	1,35,340	80,792	60
గుంటూరు	1,82,082	1,70,590	1,31,395	67
బాపట్ల	3,89,112	3,68,047	2,76,540	66



నరసరావుపేట ప్రాంతంలో మొక్కజొన్న



ప్రయోగాలకు ఏర్పాట్లు

5 నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ● పర్యవేక్షణ కేంద్రాలను తనిఖీ చేసిన డీవీఈవో పి.ఎరయ్య

బాపట్లటౌన్, ఫిబ్రవరి 2:ఇంటర్ ప్రయోగ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లను పక్కాగా పూర్తి చేశారు. ఈ నెల 5 నుంచి 20వ వరకు ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయి. జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి(డీవీఈవో) శుక్రవారం పి.ఎరయ్య ప్రయోగ పరీక్షా కేంద్రాలలో పరికరాలు, రసాయనాలను తనిఖీ చేశారు. బోర్డు నిర్వహించే నైతికత, మానవ విలువలు పరీక్షా కేంద్రాలను కూడా ఆయన పరిశీలించారు. జిల్లాలో ద్వితీయ సంవత్సరం ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 5 నుంచి, ఒకేషనల్ విద్యార్థులకు 11వ తేది నుంచి జరుగుతాయి. ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ విద్యార్థులు జిల్లాలో 447 మంది, జనరల్ విద్యార్థులు 7262 మంది ఉండగా వారి కోసం జిల్లావ్యాప్తంగా 62 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతిరోజు ఉదయం 9 నుంచి 12 వరకు మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయి. ప్రయోగ పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు అవసరమైన మౌళిక వసతులతోపాటు గాలి, వెలుతురు, పరికరాలు, రసాయనాలు, సీసీ కెమెరాలను డీవీఈవో పరిశీలించారు. పరీక్షలు పూర్తి కాగానే ఆయా కేంద్రాలకు కేటాయించిన ఇన్విజిలేటర్ అదే రోజు స్వయంగా మూల్యాంకనం చేసి ఇంటర్మీడియట్ వెబ్‌సైట్‌లో విద్యార్థుల మార్కులను బోర్డుకు పంపుతారు. ప్రతి పరీక్షా కేంద్రం సీసీ కెమేరాల పర్యవేక్షణ ఉంటుందన్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఫుటేజిని పర్యవేక్షించడానికి ఏర్పాట్లు చేశామని తెలిపారు. కొత్త జిల్లాల ప్రాతిపదికన ఈ ఏడాది ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీవీఈవో తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఆ కళాశాల ప్రిన్సిపాల్ చీఫ్ సూపరింటెండెంట్‌గా వ్యవహరిస్తారని, ప్రైవేటు కళాశాలలకు మాత్రం ప్రత్యేకంగా చీఫ్ సూపరింటెండెంట్లను నియమించామన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించామని తెలిపారు. ఎంపీసీ విద్యార్థులకు ఫిజిక్స్ కెమెస్ట్రీ, బైపీసీ విద్యార్థులకు బయాలజీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ ల్యాబుల్లో ఏర్పాట్లు చేశామన్నారు. ఆయా ల్యాబుల్లో పూర్తిస్థాయి పరికరాలు, రసాయనాలు పక్కాగా ఉన్నాయని, పరిశీలించిన తర్వాతే ఆయా కేంద్రాలకు అనుమతి ఇచ్చామని తెలిపారు. తాగునీరు, ఇతర మౌలిక వసతులు పక్కాగా ఉండాలని ఆదేశించామన్నారు.

పర్యావరణ విద్య పరీక్ష 23కు వాయిదా

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా అర్హత పరీక్షగా నిర్వహించే పర్యావరణ విద్య పరీక్షను వాయిదా వేసింది. 3వ తేది శనివారం జరగాల్సిన పరీక్షను ఈ నెల 23 శుక్రవారా నికి వాయిదా వేశారు. జూనియర్ కళాశాల యాజమాన్యాలు, విద్యార్థులు ఈ మార్పు ను గమనించాలని డీవీఈవో తెలిపారు.

నిధుల కూత

● కేంద్ర బడ్జెట్‌లో గుంటూరుకు కేటాయింపు ● గుంటూరు - బీబీనగర్ డబ్లింగ్‌కు రూ.200 కోట్లు

● నడికుడి-శ్రీకాళహస్తి, గుంటూరు-గుంతకల్లు మార్గాలకూ నిధులు ● మల్టీ ట్రాకింగ్ కనెక్టివిటీ నిమిత్తం గుంటూరు జంక్షన్‌కు రూ.50 కోట్లు

గుంటూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గుంటూరు రైల్వే డివిజన్‌కి పెద్ద మొత్తంలోనే కేటాయింపులు జరిగాయి. దశాబ్దాల కల అయిన గుంటూరు - బీబీనగర్ డబ్లింగ్ ప్రాజెక్టుని గత ఏడాది గతి శక్తి స్కీమ్ కింద ప్రకటించిన కేంద్రం ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించి నిర్మాణం ప్రారంభించేందుకు మార్గం సుగ మం చేసింది. అలానే నిర్మాణ దశలో కొనసాగుతున్న నడికుడి - శ్రీకాళహస్తి సింగిల్ లేన్, గుంటూరు - గుంతకల్లు రెండో రైలు మార్గం ప్రాజెక్టులకు ఆశాజనకంగా నిధులు కేటాయించింది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ఎన్నికలకు ముందు ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ని గురువారం పార్ల మెంట్‌లో ప్రవేశ పెట్టిన విషయం తెలిసిందే. ఈ బడ్జెట్‌లో గుంటూరు రైల్వే డివిజన్‌కి జరిగిన కేటాయిం పులు ఆశాజనకంగానే ఉన్నాయి. రైళ్ల పునరుద్ధరణ, పెరిగిన సరుకు రవాణాతో నడికుడి రైలుమార్గం రద్దీగా మారిపోయింది. ఈ నేపథ్యంలో రైళ్ల క్రాసింగ్ సమస్యలు ఎదుర్కొంటున్నాయి. దీని వల్ల గమ్యస్థానాలకు కొంత ఆలస్యంగా చేరుతున్నాయి. ఈ నేపథ్యంలో గత ఏడాది కేంద్ర ప్రభుత్వం గుంటూరు - బీబీనగర్ డబ్లింగ్ ప్రాజెక్టుని మంజూరు చేసింది. 248 కిలోమీటర్ల పొడవునా నిర్మించాల్సి ఉన్నా ఈ రెండో రైలుమార్గం కోసం రూ.2,853.23 కోట్ల నిధులు అవసరం అవుతాయని అంచనా వేసింది. కాగా ఈ బడ్జెట్‌లో రూ.200 కోట్లు కేటాయించడం ద్వారా నిర్మాణ పనులకు అడుగులు పడే వాతావరణాన్ని ఆర్థిక మంత్రి కల్పించారు.



నల్లపాడు- బీబీనగర్ లైన్

ఇక పనులు వేగవంతం..

గుంటూరు - గుంతకల్లు రెండో రైలు మార్గం, నడికుడి - శ్రీకాళహస్తి నూతన రైలుమార్గం పనులు కొన్నేళ్లుగా నిర్మాణం జరుగుతోన్నాయి. నడికుడి - శ్రీకాళహస్తి రైలు మార్గానికి ఈ బడ్జెట్ లో మూలధనం కింద రూ.150 కోట్లు, సేఫ్టీ ఫండ్ కింద మరో రూ.300 కోట్లు కేటాయింపులు జరిపింది. గుంటూరు - గుంతకల్లు డబ్లింగ్‌కు పెండిం గ్ పనులు ఉండగా వాటిని పూర్తి చేసేందుకు రూ.283.50 కోట్లు ఈ బడ్జెట్‌లో పొందుపరిచిం ది. తద్వారా ఈ రెండు రైలు మార్గాల పనులను మరింత ముందుకు తీసుకెళ్ల బోతోన్నామన్న సంకే తాలను కేంద్ర ప్రభుత్వం పంపింది. విష్ణుపురం వద్ద బైపాసు లైను 4.90 కిలోమీటర్ల పొడవునా నిర్మాణానికి రూ.20 కోట్లు కేటాయించింది. గుంటూరు రైల్వే జంక్షన్‌లో మల్టీ ట్రాకింగ్ కనెక్టివిటీ కోసం రూ.50 కోట్లు మంజూరు చేసింది. తద్వారా భవిష్యత్‌లో గుం టూరు - గుంతకల్లు, గుంటూరు - బీబీనగర్ డబ్లింగ్ ప్రాజె క్టులు పూర్తి అయితే ఇక్కడ రైళ్ల రాకపోకలకు ఆటంకాలు లేకుండా ఉంటుందని రైల్వేవర్గాలు చెబుతున్నాయి.

అమరావతిపై మారని తీరు

అమరావతే ఆంధ్రప్రదేశ్ రాజధాని అని కుండబద్ధలు కొట్టి చెబుతున్న బీజేపీ మరోవైపు నిధుల కేటాయింపు వచ్చేసరికి సవతితల్లి ప్రేమను చూపుతోంది. రాష్ట్ర ప్రజల ఆకాంక్ష అయిన అమరావతి రాజధానికి రైలుమార్గం ప్రాజెక్టుకి ఈ బడ్జె ట్‌లో కూడా మొండిచెయ్యే చూపిం చింది. విజయవాడ - గుంటూరు వయా అమరావతి 106 కిలోమీటర్ల రైలు మార్గానికి రూ.2,679.59 కోట్ల నిధులు అవసరమౌతాయని అంచనా వేశారు. ఈ ప్రాజెక్టుకి సంబంధించి సర్వే, డీపీఆర్ కూడా ఎప్పుడో సిద్ధమైంది. అయితే నిధులు, భూమిని రాష్ట్ర ప్రభుత్వం భరించాలని కేంద్రం షరతు పెట్టడంతో ఈ ప్రాజెక్టు పెండింగ్‌లో పడింది. కనీసం ఎన్నికల సంవత్సరంలోనైనా కొంత నిధులు కేటాయించి రైలుమార్గం నిర్మాణానికి అడుగులు పడేలా చేస్తుందని అంతా ఆశలు పెట్టుకున్నారు. అయితే ఎప్పటి లానే ఈ ఏడాది కూడా బీజేపీ పాలిత ఎన్‌డీఏ ప్రభుత్వం మొండి చెయ్యే చూపించింది.

పోలీసులతో మాట్లాడుతున్న అద్దంకి నియోజకవర్గ క్రీడాకారులు



ఆడుదాం ఆంధ్రా.. అస్తవ్యస్తం

● క్రీడాకారుల మధ్య తలెత్తిన సమస్య ● జేసీకి ఫిర్యాదు

బాపట్ల, ఫిబ్రవరి2: జిల్లా కేంద్రంలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల క్రీడాప్రాంగణంలో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు జనవరి 31వ తేదీతో ముగియాల్సి ఉంది. అయితే పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల జట్ల మధ్య ఓ సమస్య తలెత్తింది. పర్చూరు క్రీడాకారులు ఇతర జిల్లాకు చెందిన ఐదుగురిని తీసుకొచ్చి పోటీలో పాల్గొంటున్నారని అద్దంకి క్రీడాకారులు ఆరోపించారు. సదరు క్రీడాకారులు తమ ఆధార్ కార్డులు చూపించినప్పటికీ వేలిముద్ర ద్వారా వెరిఫికేషన్ చేయించాలని పట్టుబట్టారు. రెండురోజులు నుంచి సమస్య తీవ్ర రూపం దాల్చింది. శుక్రవారం ఉదయం మరలా మ్యాచ్ ప్రారంభం సమయానికి అద్దంకి క్రీడాకారులకు సీపీఐ నాయకులు జేబీ శ్రీధర్, కనకారెడ్డిలు మద్దతుగా వచ్చి అధికారుల తీరును తప్పుపట్టారు. రూరల్ సీఐ జి.హజరత్‌బాబు, ట్రాఫిక్ ఎస్ఐ సుధాకర్, సిబ్బంది క్రీడా మైదానానికి వచ్చి క్రీడాకారులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అధికారులు నుంచి రాకపోవటం టీమ్‌కోచ్ బి.నరేష్, కెప్టెన్ ఎస్‌కె.రఫీలు క్రీడాకారులతో కలిసి జాయింట్ కలెక్టర్‌కు తమ సమస్యను వివరించారు. దీనిపై విచారణ జరిపి పోటీలు జరిపిస్తామని జాయింట్ కలెక్టర్ హామీ ఇచ్చారు. అధికారుల ఆదేశాల మేరకు పోటీ జరుపుతామని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి కె.పాల్‌కుమార్ తెలిపారు.



సమస్య వివరాలు అడిగి తెలుసుకుంటున్న రూరల్ సీఐ హజరత్‌బాబు

ఒత్తిళ్లు.. ఆత్మహత్యలు





పూజిత భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్‌బీకే సంఘ నాయకులు

● ఆర్బీకే నిర్వహణలో వీఏఏల మనస్తాపం

● నేతలు, అధికారుల వేధింపులతో బలవన్మరణాలు

● మంత్రి మేరుగ ఇలాకాలో వెలుగు చూసిన ఘటనలు

వేమూరు, ఫిబ్రవరి 2: గ్రామీణ ప్రాంతాల్లో ఆర్బీకేలకు అనుబంధంగా పనిచేస్తున్న వీఏఏలకు తలకు మించిన భారం మీదపడడంతో ఆత్మహత్యలే మార్గంగా ఎంచుకుంటున్నారు. ఒకవైపు అధికారులు ఒత్తిళ్లు.. మరోవైపు అధికార పార్టీ నాయకుల బెదిరింపులతో వారు తల్లడిల్లిపోతున్నారు. ఈ క్రమంలో మనస్తాపానికి గురై ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. వేమూరు మండలం చావలి గ్రామం ఆర్బీకేలో పనిచేస్తున్న వీఏఏ, ఆర్‌బీకే ఉద్యోగుల సంఘం రాష్ట్ర మహిళా కార్యదర్శి బెల్లంకొండ పూజిత(23) గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. గతంలో ఇదే మండలంలోని పెరవలి గ్రామానికి చెందిన వీఏఏ గతంలో ఆత్మహత్యకు యత్నించి చికిత్స ద్వారా ప్రాణాలు నిలుపుకుంది. ఈ ఘటన మరువకముందే పూజిత ఆత్మహత్య సంచలనం సృష్టిస్తోంది. ఈ రెండు ఘటనలు కూడా రాష్ట్ర మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున నియోజకవర్గ పరిధిలో చోటుచేసుకోవడం విశేషం. ఇలాగే అధికారుల ఒత్తిళ్లు అధికార పార్టీ నాయకుల బెదిరింపులు తాళలేక తూర్పు గోదావరి, నెల్లూరు, కడప జిల్లాలో కూడా ముగ్గురు వీఏఏలు ఆత్మహత్య చేసుకున్న విషయం విధితమే. వరుస ఘటనలు జరుగుతున్నా ప్రభుత్వం తీరు మార్చుకోకపోవడంపై సంఘాల నాయకులు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగం వచ్చిందని సంతోషపడుతున్న వారి కుటుంబాల్లో ఈ ఘటనలు విషాదం నింపుతున్నాయి.

తడిచిన ఎరువులు అమ్మలేక ఆత్మహత్య

చావలి ఆర్బీకే ద్వారా అమ్మకానికి సిద్ధం చేసిన ఎరువులు వర్షాలకు తడిచాయి. తడిసిన ఎరువులను అమ్మాలని అధికారులు పూజితపై ఒత్తిడి తెచ్చారు. భవన యజమానికి అద్దె చెల్లించకపోవడంతో ఎరువులను స్వాధీనం చేసుకుని డబ్బు చెల్లించలేదు. దీంతో పై అధికారులు ఒత్తిడి మరింతగా పెరిగింది. డబ్బు చెల్లించలేని పరిస్థితిలో పూజిత గురువారం కన్నీటితో ఇంటికి చేరుకుని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

చావమని ఉద్యోగాలు ఇచ్చారా? : విజయ్‌మోహన్

ప్రభుత్వం తమకు ఉద్యోగాలు ఇచ్చింది బతకమనా.. లేక చావమనా.. అని రాష్ట్ర రైతు భరోసా కేంద్రాల ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె.విజయ్‌మోహన్ ప్రశ్నించారు. పూజిత మృతదేహానికి నివాళులు అర్పించిన అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రతీ విషయాన్ని అధికారులు, పార్టీ నేతలు తమని బలి పశువులను చేస్తున్నారన్నారు. వ్యవసాయ శాఖ తీరు చాలా దారుణంగా ఉందని మరి ముఖ్యంగా ఉన్నతాధికారులు ఇష్టారాజ్యాంగా కింది స్థాయి ఉద్యోగులను అనేక రకాలుగా ఒత్తిళ్లకు గురి చేస్తున్నారన్నారు. ఎరువులను నేతలు స్వాధీనం చేసుకుని డబ్బు చెల్లించడంలేదని ఆ విషయం తెలిసి కూడా అధికారులు ఉద్యోగులను వేధిస్తున్నారన్నారు. అనంతరం పూజిత మృతదేహాన్ని సందర్శించడానికి వచ్చిన పలు ప్రాంతాలకు చెందిన వీఏఏలు అక్కడే కొద్దిసేపు నిరసన తెలిపారు.

గ్రానైట్ యజమానులకు బెయిల్ మంజూరు

నేడు ఒంగోలు జైలు నుంచి విడుదలయ్యే అవకాశాలు

మార్టూరు, ఫిబ్రవరి 2: మార్టూరులో మంగళవారం అర్ధరాత్రి పోలీసులు అరెస్ట్ చేసిన టీడీపీ నాయకులు, మద్దతుదారులైన ఆరుగురు గ్రానైట్ పరిశ్రమల యజమానులకు శుక్రవారం రాత్రి పది గంటల సమయంలో అద్దంకి కోర్టులో బెయిల్ మంజూరయింది. అద్దంకిలోని జుడిషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టులో ఆరుగురు గ్రానైట్ యజమానుల తరపున జామీనదారులు సంబంధిత పత్రాలను దాఖలు చేశారు. వాటిని పరిశీలించిన అనంతరం న్యాయాధికారి ప్రియదర్శిని పరిశ్రమల యజమానులకు బెయిల్ మంజూరు చేశారు. దాంతో శనివారం ఉదయం బెయిల్ ఫారాలను ఒంగోలు సబ్‌జైలులో ఉన్నత అధికారులకు దాఖలుచేసిన అనంతరం పరిశ్రమ యజమానులు జైలు నుంచి బయటకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. గతనెల 30న మార్టూరులో తెలుగుదేశం పార్టీ నాయకుడు కామినేని జనార్దన్ కు చెందిన అనంత గ్రానైట్ లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేసిన సమయంలో గ్రానైట్ పరిశ్రమల యజమానులకు, విజిలెన్స్ అధికారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈనేపథ్యంలో నెల్లూరు విజిలెన్స్ ఏడీ బాలాజీ నాయక్ మార్టూరు పోలీస్‌స్టేషన్‌లో ఆరుగురు గ్రానైట్ పరిశ్రమల యజమానులపై తమ విధులకు ఆటంకం కలుగచేశారని ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. దాంతో పోలీసులు వారిని అరెస్టుచేసి బుధవారం అద్దంకి కోర్టులో వారిని హాజరుపరచగా ఈనెల 13 వరకు రిమాండ్ విధించడంతో ఒంగోలు జైలుకు తరలించారు. శనివారం జైలు నుంచి గ్రానైట్ పరిశ్రమల యజమానుల అసోసియేషన్ అధ్యక్షుడు పత్తిపాటి సురేష్, మాజీ అధ్యక్షుడు ప్రసాద్, షేక్ రజాక్, కామినేని జనార్దన్, మిన్నెకంటి రవికుమార్, అడుసుమల్లి వెంకట శ్రీనివాసరావు విడుదల కానున్నారు.



గ్రానైట్ పరిశ్రమలో తనిఖీలకు వచ్చిన నెల్లూరు విజిలెన్స్ ఏడీ బాలాజీనాయక్, సిబ్బంది (పాత చిత్రం)

ముదిరిన సంక్షోభం

మరో ఇద్దరు ఎమ్మెల్యేలు పరస్పర మార్పు

మార్కాపురంలో పోటీకి సై అన్న రాంబాబు

ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి మౌనరాగం

మాజీ ఎమ్మెల్యే జంకె వైరాగ్యం

చివర్లో ఆగిన కందుకూరుపై ప్రకటన

బాలినేనితో వైసీపీ ఎంపీపీలు, జడ్పీటీసీల భేటీ



సీఎం జగన్‌తో సమావేశమైన రాంబాబు, నాగార్జునరెడ్డి, లింగారెడ్డి, చెవిరెడ్డి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఓటమి భయంతో సిటింగ్ ఎమ్మెల్యేల బదిలీలు, తొలగింపులకు శ్రీకారం పలికిన వైసీపీ అధిష్ఠానం తాజాగా మరో ఇద్దరు ఎమ్మెల్యేలను అటుఇటు మార్పుచేసింది. దీంతో ప్రకాశం జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల అభ్యర్థుల ఎంపికను ఇప్పటికి వైసీపీ పూర్తిచేసినట్లైంది. అయితే ఆ పార్టీలో సంక్షోభ పరిస్థితులు తీవ్ర మయ్యాయి. వైసీపీలోని పలువురు ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఇతర ముఖ్యనాయకులు హైదరాబాద్ చేరి బాలినేనితో భేటీ అయ్యారు. పలు పరిణామాల అనంతరం మార్కాపురం ఎమ్మెల్యేను గిద్దలూరుకు, గిద్దలూరు ఎమ్మెల్యేను మార్కాపురంకు బదిలీ చేసి పార్టీ బాధ్యతలు అప్పగించగా రెండు చోట్ల శ్రేణుల్లో అసంతృప్తిజ్వాలలు వ్యక్తమవుతున్నాయి. జంకె వెంకటరెడ్డి పార్టీకి గుడ్‌బై చెప్పే యోచనలో ఉన్నట్లు తెలిసింది.

అటుఇటు మార్పు

ముందునుంచి అనుకుంటున్నట్లు పోటీ చేయనని ప్రకటించిన అన్నా రాంబాబును మార్కాపురం ఇన్‌చార్జిగా సొంత నియోజకవర్గాన్ని వదలనని భీష్మించుకున్న నాగార్జునరెడ్డిని గిద్దలూరు ఇన్‌చార్జిగా జగన్ నిర్ణయించారు. ఆ మేరకు ఆయా నియోజకవర్గాలకు వెళ్లి పనిచేసుకోవాలని వారిని ఆదేశిస్తూ భుజంతట్టి పంపారు. ఆ సందర్భంగా నాగార్జునరెడ్డి స్థానిక పరిస్థితులను వివరించే ప్రయత్నం చేయగా అవేమీ వద్దు. నేను చెప్తున్నా వెళ్లండి మీకు అంతా మంచే జరుగుతుంది గెలుస్తారంటూ తన నిర్ణయాన్ని అమలుచేయాల్సిందేనని ఆదేశించినట్లు తెలిసింది. ముందు నుంచి గిద్దలూరు నుంచి తప్పుకోవాలని భావిస్తూ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్న రాంబాబు వెంటనే మార్కాపురంలో పోటీకి సై అన్నట్లు సమాచారం. నాగార్జునరెడ్డి మాత్రం సీఎంకు ఏమీ చెప్పలేక చెప్పే అవకాశం ఆయన ఇవ్వక మనోవేదనలో ఉన్నట్లు తెలిసింది. నియోజకవర్గానికి వెళ్లి కుటుంబ సభ్యులు, అనుచరులతో మాట్లాడి గిద్దలూరు వెళ్లే విషయంపై తుదినిర్ణయం తీసుకోవాలన్న ఆలోచనతో ఉన్నట్లు సమాచారం. శుక్రవారం నాటి నియామకాలతో అన్నిచోట్ల ఇన్‌చార్జిల పేరుతో వైసీపీ అభ్యర్థులను ఎంపికచేసినట్లు అయింది.

గిద్దలూరు, మార్కాపురంలలో తీవ్ర అసంతృప్తులు

కాగా గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గాల్లోని శ్రేణుల్లో అసంతృప్తులు వ్యక్తమవుతున్నాయి. వైసీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి పార్టీ నిర్ణయంపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. 2014లో గెలిచినా ఎలాంటి ఫిరాయింపులు చేయకుండా పార్టీతో ఉన్న 2019లో టికెట్ ఇవ్వకపోగా ఎమ్మెల్సీ ఇస్తామని చెప్పారు. ఆ పదవి ఇవ్వకపోగా ఈ ఎన్నికల్లో టికెట్ ఇస్తామని ఆశ చూపి మోసం చేశారంటూ వ్యాఖ్యానిస్తున్నట్లు తెలిసింది. నియోజకవర్గంలోని ఆయన అనుచరులు మీరు ఉన్నా మేము వైసీపీకి చేసేది లేదని ఆయనకు మొహం మీదనే చెప్పేశారు. మరోవైపు ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి అనుచరులు పార్టీ నిర్ణయంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఎమ్మెల్యే తండ్రి, అలాగే ఆయన మామ వర్గీయులంతా పార్టీ నిర్ణయాన్ని స్వాగతించలేమని చెప్పినట్లు తెలిసింది. గిద్దలూరులో అయితే ముందుగానే స్థానికేతరులకు అవకాశం ఇస్తే సహకరించబోమని బలమైన వర్గం నాయకులు ప్రకటించారు. తొలుత గిద్దలూరు టికెట్ ఇవ్వాలని భావించిన లింగారెడ్డిని శుక్రవారం సీఎం వద్దకు పిలిచి సమాచారం ఇవ్వగా అక్కడే కన్నీరుపెట్టుకున్నారు. సీనియర్ అవటమే గాక పార్టీ అధ్యక్షుడుగా కూడా ఉన్న జంకెని కనీసం పిలవకపోవటం ఆయన అనుచరుల్లో తీవ్ర ఆగ్రహాన్ని కలిగించింది. గిద్దలూరులోని పలువురు ద్వితీయ శ్రేణి నేతలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు శుక్రవారం హైదరాబాద్‌లో బాలినేనితో సమావేశమయ్యారు. మార్కాపురం నియోజకవర్గంకు చెందిన కొందరు నాయకులు కూడా ఆయనతో సమావేశమైనట్లు తెలిసింది.

చివర్లో కందుకూరు ప్రకటన వాయిదా

కందుకూరు నియోజకవర్గ అభ్యర్థి నియామకాన్ని కూడా శుక్రవారం ప్రకటించాలనుకున్నప్పటికీ అధిష్ఠానం చివర్లో వాయిదా వేసుకున్నట్లు తెలిసింది. ప్రస్తుత ఎమ్మెల్యే మహీధరరెడ్డి స్థానే బీసీ అభ్యర్థిని రంగంలోకి దించాలని భావించారు. బొట్ల రామారావు పేరును పరిశీలించిన అధిష్ఠానం తాజాగా కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ పేరును పరిశీలనలోకి తీసుకుంది. శుక్రవారం తాడేపల్లిలో బుర్రా మీడియా సమావేశాన్ని ఏర్పాటుచేసి తాను జగన్‌కు నమ్మిన బంటునని ఆయన ఏది చెప్తే అది చేస్తానని కనిగిరిలో వైసీపీని గెలిపిస్తానని చెప్పారు. తద్వారా ఆయనకు కందుకూరు టికెట్ ఖరారైందని భావించారు. ఆ మేరకు అధిష్ఠానం జాబితాను కూడా సిద్ధం చేసింది. అయితే బుర్రా చివర్లో తనకు కందుకూరు కాదు కనిగిరే కావాలనడంతో కందుకూరు ఇన్‌చార్జి ప్రకటనను వాయిదా వేసినట్లు తెలిసింది. ఈనెల 27న రాజ్యసభ ఎన్నికలు జరగనున్నందున ఎమ్మెల్యేలను పూర్తిగా పక్కన పెట్టే అంశాలపై అధిష్ఠానం ఆచితూచి వ్యవహరిస్తున్నదని అందులో భాగంగానే కందుకూరు అభ్యర్థి ప్రకటన చేయలేదని భావిస్తున్నారు.

రేపు హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంపికలు

సంతనూతలపాడు, ఫిబ్రవరి 2: జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఒంగోలులోని నెల్లూరు బస్టాండ్ డీఆర్ఆర్ఎంఎం హైస్కూల్‌లో జూనియర్ బాలికలు, సబ్ జూనియర్స్ బాలికలు, బాలురు ఎంపికలు జరుగుతాయని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఏవీ.రమణారెడ్డి, ఎ.సుందరరామిరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆధార్‌కార్డు, జననధృవీకరణ పత్రాలు తీసుకురావాలన్నారు. వివరాలకు 9666067764, 9849897755 సెల్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నీటిలోనూ దోపిడీ

వైసీపీ నేతల నిర్వాకం

నీటి కోసం గగ్గోలు పెడుతున్న పల్లెజనం

ట్యాంకర్లతో నీటి తోలకంలో అక్రమాలు గుర్తింపు

సరఫరా నిలిపివేతకు ఉన్నతాధికారులు ఆదేశం

నీటి కోసం పశ్చిమ ప్రాంతంలో ప్రజలు ఇక్కట్లు

క్షేత్రస్థాయి పరిస్థితిపై కలెక్టర్ దృష్టి

జేసీ నేతృత్వంలో కమిటీ నియామకం

నివేదిక వచ్చేవరకు నీటి సరఫరా బంద్

ఒంగోలు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రత్యేకించి పశ్చిమ ప్రాంతంలోని వైపాలెం, మార్కాపురం, దర్శి, గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గాల్లోని అనేక గ్రామాల్లో ఏడాది పొడవునా ట్యాంకర్లతో నీటి సరఫరా జరుగుతుంది. వేసవిలో 400 వరకు హ్యాబిటేషన్లలో ఇలాంటి పరిస్థితి ఎదురవుతుంది. ప్రస్తుతం కూడా నాలుగు నియోజకవర్గాల్లోని 12 మండలాల పరిధిలో 82 హ్యాబిటేషన్లలో రోజుకు 800 ట్రిప్పులు నీటిని సరఫరా చేస్తున్నారు. గతంలో ఇలాంటి పరిస్థితి ఎదురైనప్పుడు ట్యాంకర్లతో నీటి సరఫరా చేసి వాటిపై నిఘా ఉంచి ఎప్పటికప్పుడు బిల్లులు ఇచ్చేవారు. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చాక అంతా ఇష్టారాజ్యంగా మారింది. వైసీపీ నేతలకు ఇదో ఆదాయ మార్గంగా మారింది. ఇదే సమయంలో నిఘా కొరవడింది. దీంతో గ్రామస్థాయిలోని వైసీపీ నేతలు, ఆ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ఇష్టారీతిన నీటి ట్యాంకర్ల సరఫరాలో అక్రమాలకు పాల్పడుతున్నారన్న విమర్శలు సర్వత్ర వినిపిస్తున్నాయి. ఇతర వనరులు ఉన్న వాటిని పట్టించుకోకుండా చిన్న చిన్న మరమ్మతులు చేస్తే నీటి సరఫరాకు వీలున్న వాటిని చేయకుండా ట్యాంకర్లతో తోలడం, అందులోనూ నాలుగు తొలి పది నమోదు చేయడం చేస్తుండగా అదేమని అడగలేని దుస్థితిలో యంత్రాంగం ఉంది. అదే సమయంలో నీటి సరఫరా బిల్లులను సకాలంలో ప్రభుత్వం ఇవ్వక పోతుండటంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు కూడా నీటిని తోలే కాంట్రాక్టర్లపై నియంత్రణ కొరవడింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక 2019 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు సుమారు రూ.132కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో రెండు మూడు సార్లు కలెక్టర్ లేఖలతో రూ.70 కోట్లు ఇటీవల చెల్లించారు. ఇంకా రూ.60కోట్లకుపైగా బిల్లులు రావాల్సి ఉంది.

> నీటి ట్యాంకర్ల సరఫరాలో వైసీపీ నేతలు చేసిన నిర్వాకం పశ్చిమ ప్రాంత ప్రజలకు నీటి కష్టాలను తెచ్చిపెట్టింది. వైసీపీ పాలనలో ఉన్నత స్థాయి ప్రజాప్రతినిధుల నుంచి గ్రామస్థాయి నేతల వరకు అందిన కాడికి దోచుకున్నారు. చివరకు పల్లె జనం తాగేనీటి కోసం ట్యాంకర్లతో సరఫరాను కూడా వారు వదలకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ప్రస్తుతం ఆ ప్రజలకు తాగేందుకు నీరందక గగ్గోలు పెడుతున్నారు. అదేసమయంలో గుర్తించిన ఆ గ్రామాలను హేతుబద్ధంగా పరిశీలించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా అక్రమార్కులపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఏకంగా నీటి సరఫరానే నిలిపేశారు. రెండురోజులుగా పశ్చిమ ప్రాంత పల్లెల్లో ట్యాంకర్లతో నీటి సరఫరాను అధికారులు నిలిపివేయడంతో ప్రత్యామ్నాయ మార్గాలు లేక జనం ఇబ్బందులు పడుతున్నారు.

అక్రమాలు, అవకతవకలు గుర్తింపు

జిల్లాలో ట్యాంకర్లతో నీటి సరఫరా నిరంతరం చేస్తుండటం, అందుకు భారీగా వ్యయం అవుతుండటంతో ఉన్నతాధికారులు దృష్టిసారించారు. ఈ వ్యవహారంలో భారీగా అక్రమాలు జరుగుతున్నట్లు సమాచారం రావడంతో విచారణకు ఆదేశించారు. పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ బి.రాజశేఖర్ ఆదేశాలతో గత నెలలో ప్రత్యేక బృందం వైపాలెం నియోజకవర్గంలో పర్యటించింది. ట్యాంకర్లతో నీటి సరఫరాలో అక్రమాలు, అవకతవకలు జరుగుతున్నట్లు గుర్తించింది. ఆ మేరకు సెక్రటరీకి నివేదించడంతో తక్షణం ట్యాంకర్లను ఆపేయాలని జిల్లా అధికారులను ఆయన ఆదేశించారు. తదనుగుణంగా జిల్లాలో రెండు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. ప్రస్తుతం వైపాలెం సెగ్మెంట్‌లో 43, మార్కాపురంలో 23, దర్శి సెగ్మెంట్‌లో 15, గిద్దలూరులో ఒకటి వెరసి 82 ఆవాసాలలో ట్యాంకర్లతో సరఫరా జరుగుతుండగా వాటన్నింటిలో నీటి సరఫరా బంద్ అయ్యింది. ప్రజలకు ఇబ్బందిలేకుండా నీటి సరఫరా చేస్తూ అక్రమ వ్యవహారాలను వెలుగులోకి తెచ్చి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఏకంగా నీటిని బంద్ చేయడం ఆ ప్రాంత ప్రజలకు ఇక్కట్లను తెచ్చిపెట్టింది.



పొదిలి సమీపంలో నీటి ట్యాంకర్ల వద్ద బిందెల క్యూ(ఫైల్)

పరిశీలించాకే సరఫరా పునరుద్ధరణ

కాగా క్షేత్రస్థాయిలో పరిస్థితిపై కలెక్టర్ దృష్టిసారించారు. పంచాయతీరాజ్‌శాఖ సెక్రటరి నుంచి వచ్చిన నీటి సరఫరా నిలిపివేత ఉత్తర్వులు, క్షేత్రస్థాయిలో ప్రజల ఇక్కట్ల నేపథ్యంలో సమగ్ర పరిశీలనకు కలెక్టర్ నిర్ణయించారు. అందుకోసం జేసీ గోపాలకృష్ణ నేతృత్వంలో వివిధ స్థాయిల్లోని అధికారులతో కమిటీని నియమించారు. ప్రస్తుతం నీటి సరఫరా జరుగుతూ నిలిపివేసిన ఆవాసాలలో నీటి సమస్య నిజంగా ఉందా, వాటిలో ఉన్న నీటి వనరుల పరిస్థితేమిటి, వాటికి మరమ్మతులు ఇతరత్రా చర్యలు తీసుకుంటే సమస్య పరిష్కారం అవుతుందా, ట్యాంకర్లతో నీటి సరఫరా తప్పమకొక మార్గం లేదా అనే అంశాలను పరిశీలించి మూడు రోజుల్లో నివేదించాలని ఆదేశించారు. అనంతరం ట్యాంకర్లతో నీటిని తోలితే తప్ప సమస్య తీరే అవకాశం లేని హ్యాబిటేషన్లకు సరఫరాను పునరుద్ధరించే యోచనలో అధికారులు ఉన్నట్లు సమాచారం. అయితే అధికారుల పరిశీలన పూర్తయి దానిని కలెక్టర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారి నుంచి మళ్లీ అనుమతి పొందిన తర్వాత తిరిగి సరఫరా జరిగే అవకాశం కనిపిస్తుండగా అప్పటివరకు ప్రజలకు నీటి కష్టాలు తప్పేట్లుగా కనిపించడం లేదు. మరోవైపు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పెండింగ్ బిల్లులు రూ.60కోట్లు రావాల్సి ఉండటంతో నీటి తోలకం చేసిన వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది.

అక్రమార్కులపై వేటుపడేనా?

వైద్యశాఖ నియామకాల్లో భారీగా అక్రమాలు

41 మంది అనర్హులకు ఉద్యోగాలు

ఇచ్చినట్లు గుర్తించిన విచారణ కమిటీ

ముగ్గురు అధికారులతో పాటు

ఏడుగురు ఉద్యోగులు, సిబ్బంది నిర్లక్ష్యం

అవినీతిని పూసగుచ్చినట్లు ఇచ్చిన నివేదిక

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 2 : వైద్య ఆరోగ్యశాఖలో చేపట్టిన ఉద్యోగ నియామకాల్లో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నట్లు విచారణ కమిటీ తేల్చినట్లు సమాచారం. 2020లో ఆ శాఖలో భర్తీచేసిన పోస్టుల్లో నిబంధనలకు విరుద్ధంగా 41మంది అనర్హులకు ఉద్యోగాలు ఇచ్చినట్లు గుర్తించింది. మొత్తం నాలుగు రకాల నియామకాల్లో చోటు చేసుకున్న అక్రమాలపై పూసగుచ్చినట్లు విచారణ కమిటీ కలెక్టర్ దినేష్‌కుమార్‌కు నివేదికను అందజేసినట్లు తెలిసింది. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటారా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో 2020లో భర్తీచేసిన పోస్టుల్లో భారీ అక్రమాలతో పాటు అనర్హులకు ఉద్యోగాలు ఇచ్చినట్లు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. వాటిపై స్పందించిన కలెక్టర్ సమగ్ర విచారణకు కమిటీని నియమించారు. జడ్పీ సీఈవో జాలిరెడ్డి నేతృత్వంలో డీఈవో వీఎస్ సుబ్బారావు, సీనియర్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, డైట్ ప్రిన్సిపాల్‌ను విచారణ చేసి నివేదికను అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. దీంతో ఆ కమిటీ వైద్యశాఖ కార్యాలయంలో 50రోజుల పాటు విచారణ చేసింది. నోటిఫికేషన్ నాటి నుంచి ఉద్యోగ నియామకాల వరకు జరిగిన అన్ని అంశాలను పరిశీలించినట్లు తెలిపారు. ఆ ఉద్యోగాల నోటిఫికేషన్ నాటి నుంచి నియామకపత్రాలు ఇచ్చేంతవరకు ముగ్గురు డీఎంహెచ్‌వోలు పనిచేయగా, సూపరింటెండెంట్‌తోపాటు మరో ఆరుగురు ఉద్యోగుల పాత్రను పూసగుచ్చినట్లు నివేదికలో పొందుపర్చినట్లు సమాచారం. దరఖాస్తుల స్వీకరణ నాటి నుంచి మెరిట్ జాబితా ప్రచురణ, అభ్యర్థుల సర్టిఫికెట్లను కూడా విచారణ చేసినట్లు సమాచారం. మొత్తం నాలుగు విభాగాల్లో 395 ఉద్యోగాలను భర్తీచేయగా అందులో 41మంది అనర్హులకు పోస్టులు ఇచ్చినట్లు తేల్చారు. అందుకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఆ విచారణ నివేదికలో కలెక్టర్ దినేష్‌కుమార్‌కు నివేదించినట్లు సమాచారం. 342 స్టాఫ్‌నర్సుల ఉద్యోగాలు భర్తీచేయగా అందులో 23మంది అనర్హులు ఉండగా, ల్యాబ్‌టెక్నీషియన్స్ విభాగంలో 33 ఉద్యోగాలకు 14మందిని, ఫార్మసిస్టు విభాగంలో 18 మందికి ముగ్గురు, రేడియాలజిస్ట్ విభాగంలో రెండు పోస్టులకు ఒక పోస్టును అనర్హులకు ఇచ్చినట్లు తెలిసింది. ఆయా పోస్టులకు సంబంధించిన దరఖాస్తున్నింటినీ పరిశీలించిన అనంతరం ఆ నివేదికను కలెక్టర్‌కు అందజేసినట్లు తెలిసింది. ఉద్యోగ నియామక సమయంలో ముగ్గురు డీఎంహెచ్‌వోలుగా పనిచేసినట్లు విచారణ కమిటీ గుర్తించినట్లు సమాచారం. ఆ ముగ్గురు కూడా కనీసం మెరిట్ జాబితాలను పరిశీలించకుండానే ఉద్యోగాలు ఇచ్చారని నిర్ధారించినట్లు సమాచారం. ఆయా పోస్టులను భర్తీచేసిన సూపరింటెండెంట్‌తోపాటు మిగిలిన ఆరుగురు ఉద్యోగులు కూడా నిబంధనలకు విరుద్ధంగా అనర్హులకు ఉద్యోగాలు ఇచ్చినట్లు పేర్లతో సహా ఆ నివేదికలో పొందుపర్చినట్లు తెలిసింది. ఆయా ఉద్యోగులపై ఏయే చర్యలు తీసుకోవాలో ఆ విచారణ కమిటీ స్పష్టంగా చెప్పినట్లు సమాచారం. ఆ విచారణ నివేదికను పరిశీలించిన కలెక్టర్ ఉద్యోగ నియామకాల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ఆ విచారణ నివేదికను కలెక్టర్ నుంచి వైద్య ఆరోగ్యశాఖాధికారికి వచ్చినట్లు తెలిసింది. ఆ విచారణ నివేదికను పరిశీలించిన అనంతరం ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సి ఉంది.

మెగా డీఎస్సీ పేరుతో మరోసారి మోసం చేస్తున్న జగన్



చెవిలో పూలతో నిరసన తెలియజేస్తున్న యువత

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 2: అధికారంలోకి రాగానే ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని ప్రగల్భాలు పలికిన జగన్ ఐదేళ్ళుగా ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేయలేదని, తాజాగా ఎన్నికల సమయంలో మెగా డీఎస్సీ పేరుతో మరోసారి మోసం చేసేందుకు వస్తున్నారని తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకుల ఆరోపించారు. మెగా డీఎస్సీ మోసాన్ని నిరసిస్తూ టీడీపీ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని బాపూజీ కాంప్లెక్స్ వద్ద గాంధీజీ విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సదర్భంగా చెవిలో పూలు పెట్టుకుని వైసీపీ ప్రభుత్వం అబద్దపు ప్రచారాన్ని వారు ఎద్దేవా చేశారు. చదువులు పూర్తి చేసుకుని లక్షలాది మంది నిరుద్యోగులు ఐదేళ్ళుగా ఎదురు చూస్తుంటే పట్టించుకోని జగన్‌రెడ్డికి కొత్తగా ఇపుడు నిరుద్యోగులు గుర్తువచ్చారా అని ప్రశ్నించారు. త్వరలోనే ఎన్నికలు వస్తున్న తరుణంలో ఇలా అబద్దపు హామీలు చేసి మరోసారి నిరుద్యోగులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి రాగానే వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడానికి చంద్రబాబు నాయుడు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో తెలుగుయువత అధ్యక్షుడు ముత్తన శ్రీనివాసరావు, నాయకులు నల్లమోతు రమేష్, షేక్ ఉమర్, కొత్తపట్నం మండల అధ్యక్షుడు పిన్నిక దేవప్రసాద్, కొప్పురావూరి సురేష్, మంచు లలిత్‌కుమార్, బ్రహ్మేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి

కలెక్టర్ దినేష్‌కుమార్



ప్రకాశం పంతుల విగ్రహం వద్ద కలెక్టర్, జేసీ, అధికారులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 2 : 'సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ప్రకాశం జిల్లాలో సాధించాల్సిన లక్ష్యాలు ఎన్నో ఉన్నాయి.. నేటి యువత లక్షాలను నిర్దేశించుకొని వాటి సాధనకు కృషిచేయాలి.. దాంతోపాటు జిల్లా సమగ్రాభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలి' అని కలెక్టర్ దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. 55వ జిల్లా అవతరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక స్పందన హాలులో జరిగిన సభలో కలెక్టర్ మాట్లాడారు. 1970లో నెల్లూరు, గుంటూరు, కర్నూలు జిల్లాల్లోని సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాలను ఒకటిగా చేసి ఈ ప్రాంతవాసైన టంగుటూరి ప్రకాశం పంతులు పేరుతో ప్రకాశం జిల్లాగా ఏర్పాటు చేశారన్నారు. జిల్లా ఆవిర్భావం 56 మండలాలతో ఏర్పడగా సీఎం జగన్మోహన్‌రెడ్డి పరిపాలన సౌలభ్యం కోసం 2022లో ప్రతి పార్లమెంట్ పరిధిలో ఒక జిల్లాను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లాలో మూడు రెవెన్యూ డివిజన్లతోపాటు 39 మండలాలతో ఏర్పాటు చేశారని కలెక్టర్ తెలిపారు. అంతకు ముందు ప్రకాశం పంతులు విగ్రహానికి కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ ఆర్.గోపాలకృష్ణ, సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా, అసిస్టెంట్ కలెక్టర్ శౌర్యమన్‌పటేల్, డీఆర్వో ఆర్.శ్రీలత, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ మహబూబ్ బాషాలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ జిల్లా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రకాశం మనమడు టంగుటూరి సంతోష్‌కుమార్, జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ మాజీ చైర్మన్ డాక్టర్ చలమయ్యతోపాటు పలువురిని సత్కరించారు. వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

విస్మరించిన మంత్రులు, ప్రజాప్రతినిధులు

జిల్లా అవతరణ దినోత్సవాన్ని ప్రజాప్రతినిధులు విస్మరించారు. ఏటా కలెక్టరేట్‌లో జరిగే ఈ వేడుకలకు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు ఇతర ప్రజాప్రతినిధులందరూ పాల్గొనేవారు. త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అధికారపార్టీలో కొనసాగుతున్న ఉత్కంఠతో మంత్రులు కానీ, ప్రజాప్రతినిధులు కలెక్టరేట్ వైపు చూసిన దాఖలాలు లేవు. కేవలం నామినేటెడ్ పోస్టుల్లో ఉండే ఒకరిద్దరు తప్ప ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన లేదు. దీంతో జిల్లా అధికారులే ఈ వేడుకలను నిర్వహించడం గమనార్హం.

ఒంగోలులో చెవిరెడ్డి ఫ్లెక్సీల చించివేత

బాలినేనికన్నాపైన ఫొటో పెట్టడంపై అనుచరుల ఆగ్రహం

నాగార్జున క్యాంపు ఆఫీసు ఎదుట సంఘటన

ఆరా తీసి అరెస్టు చేయమంటూ పోలీసులకు సీఎంఓ నుంచి ఫోన్

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

సీఎం ఏరికోరి ఒంగోలు పార్టీ బాధ్యతలు అప్పగించిన చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఫ్లెక్సీలను గురువారం అర్ధరాత్రి కొందరు చించివేశారు. కొన్ని ఫ్లెక్సీలను దహనం చేసినట్లు తెలిసింది. అలాగే మంత్రి మేరుగ నాగార్జున క్యాంపు కార్యాలయానికి ముఖద్వారంగా ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలను కూడా చించివేశారు. దీంతో అధిష్ఠానం సీరియస్ అయింది. ఎస్ఎన్‌పాడు ఇన్‌చార్జిగా నియమితులైన మంత్రి నాగార్జున ఒంగోలులో తన క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆ కార్యాలయానికి వెళ్లే దారిలో ముఖద్వారంలో ఒకపక్క పైన చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఫొటో పెట్టి దాని కింద ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని ఫొటోను ఉంచారు. కాగా గురువారం అర్ధరాత్రి పైన చెవిరెడ్డి ఫొటో పెటిన ఫ్లెక్సీ వరకు చించివేశారు. అలాంటి కొన్ని ఫ్లెక్సీలను దహనం కూడా చేసినట్లు కనిపిస్తోంది. ఎమ్మెల్యే బాలినేని ఫొటోను పైన ఉంచి ముద్రించిన ఫ్లెక్సీలు మాత్రం అలానే ఉంచారు. దీంతో ఇది బాలినేని అనుచరుల పనేనని అందరూ భావిస్తున్నారు. శుక్రవారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించి మంత్రి మేరుగ నాగార్జున సజ్జలకు ఫోన్ చేసినట్లు సమాచారం. వెంటనే సజ్జల బాలినేనికి ఫోన్ చేయగా ఫొటోల విషయమై తన అనుచరులు బాధపడి ఉండొచ్చు. ఏమి జరిగిందో తెలుసుకుంటానని బాలినేని అన్నట్లు సమాచారం. బాలినేని అనుచరులు మాత్రం ఒంగోలు నియోజకవర్గంలో ఇలాంటి కుట్రలతో ఫ్లెక్సీలు వేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరిస్తూ మాట్లాడుతున్నారు. కానీ ఈ విషయాన్ని సీఎం జగన్ నుంచి వైసీపీ అధిష్ఠానం కూడా సీరియస్‌గా తీసుకున్నట్లు సమాచారం. జగన్ నేరుగా మంత్రి నాగార్జునకే ఫోన్ చేసి ధైర్యంగా ఉండు, నేనే ఎస్ఎన్‌పాడు వచ్చి పార్టీ చేపట్టిన సిద్ధం కార్యక్రమం నిర్వహిస్తానని భరోసా ఇచ్చినట్లు తెలుస్తోంది. మరోవైపు సీఎంవో అధికారులు ఎస్పీకి ఫోన్‌చేసి ఈ ఘటనకు ఎవరు కారకులో ఎవరు ఆ కార్యక్రమంలో పాల్గొన్నారో గుర్తించాలని ఆదేశించినట్లు తెలిసింది. తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని కూడా చెప్పినట్లు సమాచారం. దీంతో పోలీసు అధికారుల ఆదేశాలతో ఆ సంఘటనలో ఎవరు పాల్గొన్నారనే విషయంపై ఆరా తీస్తున్నారు. శుక్రవారం రాత్రి వరకు ఎలాంటి కేసులు పెట్టలేదని సమాచారం.





ఒంగోలులో చెవిరెడ్డి ఫ్లెక్సీలను చించి తగులబెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు

ప్రమాదాల నివారణకు చర్యలు

మేదరమెట్ల , ఫిబ్రవరి 2: అద్దంకి రూరల్ సీఐగా శివరామ కృష్ణారెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిలో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్లపై వాహనాలు నిలపడం వలనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. జాతీయ రహదారి అధికారులతో కలిసి రోడ్లపై వాహనాలు నిలుపకుండా చూస్తామన్నారు. గతంలో ఎ క్కువ ప్రమాదాలు జరిగిన పాయింట్లను గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. ఎన్నికల సందర్భంగా శాంతి భద్రతలకు అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. అలాగే, కొరిశపాడు ఎస్‌ఐగా శివయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

శాంతి భద్రతలకు అధికప్రాధాన్యం

బల్లికురవ, ఫిబ్రవరి 2: బల్లికురవ ఎస్‌ఐగా వి.శివనాగిరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ వేమన చీరాలకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కొరిశపాడు స్టేషన్‌ను నుంచి శివనాగిరెడ్డి బదిలీపై వచ్చారు. ఈసందర్భంగా ఎస్‌ఐ శివనాగిరెడ్డి మాట్లాడుతూ శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా గ్రామాలలో ప్రత్యేక నిఘా పెడతామని చెప్పారు. సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళతామన్నారు. ప్రజలందరూ తమకు సహకరించాలని ఆయన కోరారు.

చినగంజాం ఎస్‌ఐగా శ్రీనివాసరావు

చినగంజాం, ఫిబ్రవరి 2: చినగంజాం ఎస్‌ఐగా ఎం.శ్రీనివాసరావు శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. మార్టూరు పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆయన బదిలీపై చినగంజాం వచ్చారు. చినగంజాం పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ కె.సురేష్ బదిలీపై కారంచేడు వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావుకి స్టేషన్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

అద్దంకి అభివృద్ధికి రూ.30 కోట్లు ఒట్టిమాటేనా!

» వైసీపీ కౌన్సిలర్‌లు తీవ్ర అసంతృప్తి

అద్దంకి, జనవరి 2: అద్దంకి పట్టణంలో పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా రూ.30 కోట్ల నిధులు మంజూరు కాబోతున్నాయని ఏడాది కాలంగా వైసీపీ నేతలు ఊదరగొడుతున్నారు. నాలుగైదు నెలల క్రితం అయితే ప్రతిపాదనలకు ఆమోదం పూర్తయింది, ఇక నిధులు మంజూరే తరువాయి, సార్వత్రిక ఎన్నికలలోపు పనులు పూర్తి చేసి ఓట్లు అడుగుతామని కూడా నమ్మబలికారు. తీరా చూస్తే అతిత్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్ రాబోతున్నప్పటికీ నిధుల మంజూరు జాడ గురించి పట్టించుకునే నాథుడే లేడన్న విమర్శలు వస్తున్నాయి.

ప్రధానంగా అద్దంకి పట్టణంలో అంతర్భాగమై ఆక్రమణలకు గురైన అద్దంకి మేజర్ కాలువ కట్టలను రెండువైపులా అభివృద్ధిచేసి మినీ బైపాస్‌గా మార్చాలని పూర్తిస్థాయిలో కసరత్తు జరిగింది. ఆక్రమణలదారులను ఖాళీ చేయించేందుకు ఆయా శాఖల అధికారులు సిద్ధమయ్యారు. ఈనేపథ్యంలో ప్రాథమికంగా ఆక్రమణలు లేనిచోట కాలువ కట్టల అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఇక పట్టణంలోని పలు శివారు కాలనీలలో సీసీ రోడ్లు ఎలాగూ వేయలేదు, కనీసం గ్రావెల్ రోడ్లు అయినా వేయాలని ఆయా వార్డుల కౌన్సిలర్‌లు కోరటంతో సుమారు రూ.30 లక్షలతో ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపారు. ఇక నిధులు అదిగో వస్తున్నాయి... ఇదిగో పనులు ప్రారంభిస్తున్నామని అధికార పార్టీ కౌన్సిలర్‌లు, నాయకులు ఒకింత హడావుడి చేశారు. ఎలాగూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రత్యేక నిధులు మంజూరు కానందున ఎన్నికల సమయానికి నిధుల వరద పారుతుందని, అభివృద్ధి పనులు చేపడతారని ప్రజలు కూడా భావించారు.


మినీ బైపాస్‌గా అభివృద్ధికి ప్రతిపాదించిన ఆక్రమణలకు గురై ఉన్న అద్దంకి మేజర్ కాలువ కట్టలు


కాలువలో ముందుకు కదలని మురుగు

అదేసమయంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్న బాచిన కృష్ణచైతన్యను తప్పించి పాణెం హనిమిరెడ్డికి అప్పగించారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన హనిమిరెడ్డి వైసీపీ కౌన్సిలర్‌లను తన చెంతకు చేర్చుకోవటంలో సఫలీకృతమైనప్పటికీ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు విషయమై దృష్టి పెట్టలేదన్న విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధికారపార్టీ కౌన్సిలర్‌లు ఒకింత అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తుంది. మున్సిపల్ ఎన్నికల సమయంలో అభివృద్ధి పనులకు హామీ ఇచ్చి ఇప్పుడు కనీసం చిన్నపని కూడా చేపట్టకుండా ఏముఖం పెట్టుకొని వైసీపీకి ఓటు వేయమని అడగాలన్న మీమాంసలో పలువురు అధికార పార్టీ కౌన్సిలర్‌లు ఉన్నారు. ఎన్నికల ప్రచార సమయం లో ఓట్లు అడిగేందుకు వచ్చే అధికార పార్టీ నేతలను ప్రశ్నించాలన్న ఆలోచనలో ప్రజలు ఉన్నట్లు తెలుస్తుంది. ప్రజల నుంచి వచ్చే వ్యతిరేకతను ముందే గ్రహించిన కొంతమంది అధికారపార్టీ కౌన్సిలర్‌లు ప్రచారానికి అంటీ ముట్టనట్లు ఉండటమో లేక టీడీపీలోకి జంప్ కావాలన్న ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తుంది. వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయలేదన్న సాకును చూపించి పార్టీ మారాలన్న ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తుంది.


వ్యవసాయ బోరును పరిశీలిస్తున్న జిల్లా భూగర్భజలశాఖాధికారి సాంబశివరావు, తదితరులు

పంటలకు నీటి అవసరాన్ని మీటర్లు పెట్టి లెక్కిస్తాం!

మేదరమెట్ల , ఫిబ్రవరి 2: జిల్లాలో రైతులు సాగుచేసే పంటలకు సంబంధించి ఒ క్కో పంటకు ఎంత నీరు అవసరమవుతుందో మీటర్లు పెట్టి లెక్కిస్తామని జిల్లా భూగర్భ జల శాఖ అడిషనల్ డైరెక్టర్ సాంబశివరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని దైవాలరావులో వ్యవసాయ బోర్లను, బోర్లు కింద వేసిన పంటలను ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వర్షపాతాన్ని లెక్కించి భూమిలోకి ఎంత నీరు వెళ్తుంది అనే అంచనాలను తయారు చేస్తామన్నారు. ప్రతి సంవత్సరం ఇదే విధంగా లెక్కిస్తామని, వివిధ రకాల భూములలో వేసే పంటలను బట్టి ఏ పంటకు ఎంత నీరు వినియోగం అవుతుందనే విషయాన్ని మీటర్లు పెట్టడం ద్వారా అంచనా వేస్తామన్నారు. దీని ద్వారా ఆయా ప్రాంతాలల్లో భూ గర్భ జల మట్టలను గుర్తించడానికి వీలవుతుందని చెప్పారు. కొత్తగా భూగర్భ జలాలను తోడడానికి బోర్లు వేయడానికి నిర్ధారిస్తామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ శివవరప్రసాద్, వసంతకుమారి పాల్గొన్నారు.

రేపు దేవపాలనకు సాహిత్య పురస్కారం


దేవపాలన

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 2: కవి, జానపదకళాపీఠం అధ్యక్షుడు, రిటైర్డ్ ఆర్‌జేడీ డాక్టర్ యు.దేవపాలనకు ఈనెల 4న పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ సాహిత్య పురస్కారం-2024ను అందజేయనున్నారు. ఇందుకు సంబంధించిన సభ ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక మారం వారి సేవాసదన్ లో జరుగుతుందని పురస్కార ప్రదాత పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, సాహితి మిత్రమండలి అధ్యక్షుడు లక్కరాజు చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం

చీరాల,ఫిబ్రవరి 2: కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయటమే లక్ష్యంగా కలసికట్టుగా ముందుకు సాగుదామని ఆపార్టీ నాయకుడు నీలం శామ్యూల్ మోజెస్ పిలుపునిచ్చారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా గడియార స్తంభం సెంటర్లోని వైఎస్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు ఉచిత గుండె వైద్య శిబిరం

ఇంకొల్లు, ఫిబ్రవరి 2: ఇంకొల్లు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 4న స్థానిక ఎన్‌ఆర్‌అండ్‌వీఎస్‌ఆర్ బాలికోన్నత పాఠశాలలో విజయవాడ హెల్ప్ హాస్పిటల్ వారిచే ఉచిత గుండె వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కరి కమలేశ్వరరావు, జెట్టి స్వామి తెలిపారు. ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఈ శిబిరంలో గుండె సంబంధిత వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారని వారు పేర్కొన్నారు.

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

చినగంజాం, ఫిబ్రవరి 2: ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న వైద్యసేవలను ప్రతిఒక్కరూసద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో యూబీ వరప్రసాద్ అన్నారు. మండలంలోని పెదగంజాం-1 సచివాలయం ఆవరణలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. చినగంజాం పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.విజయభాస్కరరావు, పి.సాయిశ్రీచరణ్, డాక్టర్ సమీన, డాక్టర్ సుధాకర్ 423 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 13 మందికి కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎస్‌వీ గోపాల కృష్ణమూర్తి, గ్రామ కార్యదర్శి ఎం.భారతి, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

చినగంజాం, ఫిబ్రవరి 2: చినగంజాం మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన పాలపర్తి పార్వతి ఎన్నికల నేపథ్యంలో గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కార్యాలయ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ రెవెన్యూ సహాయకులు శుక్రవారం ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సుబ్బారావు, భూ రీసర్వే డీటీ దాసరి శ్రీకాంత్, సర్వేయర్ బి.శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ నాగబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

మార్టూరు, ఫిబ్రవరి 2: మార్టూరులోని విజయనగర్ కాలనీ సమీపంలో పొలాల్లో చెట్టుకు తన్నీరు సురేష్ (42) అనే వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని రాజుపాలెం గ్రామ పంచాయతీలోని శాంతినగర్‌లో నివాసం ఉంటున్న మృతుడు సురేష్ మార్టూరులో ట్రాక్టర్ డ్రైవరుగా పనిచేస్తుంటారు. అతనికి భార్య లక్ష్మీకోటేశ్వరమ్మ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె నర్సరావుపేటలో నర్సింగ్ కోర్సు చదువుతున్నారు. ఆమె వివాహ విషయమై తీవ్ర మనస్తాపానికి గురైన తండ్రి సురేష్ ఆత్మహత్యకు పాల్పడినట్లు బంధువులు చెబుతున్నారు. సురేష్ ఆత్మహత్య చేసుకున్న విషయం సాయంత్రం సమీపంలో పొలాల్లో పనిచేస్తున్న కూలీలు గమనించి మృతుని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అనంతరం కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించగా సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు విచారణ చేస్తున్నట్లు ఏఎస్‌ఐ సైదా తెలిపారు.

ప్రతిభచాటిన సూరవరపుపల్లె విద్యార్థులు

యద్దనపూడి(మార్టూరు), ఫిబ్రవరి 2: గుంటూరులోని మాజేటి గురవయ్య హైస్కూల్ ఆడిటోరియంలో ఆదివారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన చేతిరాత నైపుణ్య పరీక్షలలో మండలంలోని ముగ్గురు విద్యార్థులకు బహుమతులు లభించాయని ఎంఈవో చిలుకూరి గోపి శుక్రవారం తెలిపారు. యద్దనపూడి మండలం సూరవరపుపల్లె గ్రామంలో ఎంపీపీఎస్(ఎస్‌సి) పాఠశాలకు చెందిన బొల్లాపల్లి చరణ్‌తేజ్ సూపర్ సబ్ జూనియర్స్‌లో మొదటి బహుమతిని గెలుచుకున్నారు. సబ్ జూనియర్స్‌లో ద్వితీయ బహుమతిని వంజా కీర్తి, నాల్గవ బహుమతిని నేలపాటి జెస్సీ గెలుచుకున్నారు. వీరిని శుక్రవారం పాఠశాలలో ఎంఈవో చిలుకూరి గోపితో పాటు పలువురు గ్రామస్థులు అభినందించారు. ఈసందర్భంగా స్కూలు ప్రధానోపాధ్యాయురాలు శారదను ఎంఈవోతో పాటు గ్రామస్థులు అభినందించారు.

పారిశుధ్యంపై మెరుగైన చర్యలు తీసుకోవాలి

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 2: గ్రామాల్లో తడి, పొడి ప్రమాదకర వ్యర్థాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని ఎంపీడీవో జీవీ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశపు హాల్‌లో సెర్ప్ సంస్థ ఆధ్వర్యంలో పారిశుధ్యంపై మండల స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలలో పారిశుధ్యంపై మెరుగైన చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు క్లాప్ మిత్రలు తగినవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ హనుమంతరావు, సెర్ప్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ సీహెచ్ శ్రీనివాసరావు, సంస్థ ట్రైనర్ బొల్లయ్య, ప్రదీప్, ఏసోబు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మార్టూరులో సబ్‌స్టేషన్ ప్రారంభం

మార్టూరు, ఫిబ్రవరి 2: గృహ వినియోగదారులు, పరిశ్రమల యజమానులు సక్రమంగా విద్యుత్ బిల్లులు చెల్లించాలని ఈఈ ఎస్.మస్తానరావు అన్నారు. మా ర్టూరులో రూ.2.5 కోట్లతో నిర్మించిన సబ్‌స్టేషన్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ పాల్గొనగా, విద్యుత్ అధికారులు ఎం.సురేంద్రబాబు, అంజిరెడ్డి, రమేష్, ఎంపీపీ భుక్యా శాంతి బాయి, సర్పంచ్ భుక్యా సుమితాబాయి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీత్యాగరాజ ఆరాధనోత్సవాలు

చీరాలటౌన్, ఫిబ్రవరి 2: శ్రీత్యాగరాజ ఆరాధనోత్సవాలు శుక్రవారం స్థానిక సాంస్కృతిక సమితి, చైతన్యభారతి ఆధ్వర్యంలో పట్టణంలో ఘనంగా నిర్వహించారు. చెన్నైకు చెందిన కృతియస్ భట్ గాత్రకచేరి ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమాన్ని అధ్యక్షుడు సూర్యదేవర ఉమామోహన్, కార్యదర్శి భాగినాశా మణిశాస్త్రి పర్యవేక్షించారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు

» ప్రయాణికుల అవస్థలు



మల్లాయపాలెం సమీపంలో మొరాయించిన ఆర్టీసీ బస్సు

బల్లికురవ, ఫిబ్రవరి 2: సురక్షితమైన ప్రయాణం అని నమ్ముకుని ఆర్టీసీ బస్సు ఎక్కిన ప్రయాణికులకు మార్గమధ్యంలో మొరాయించటంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. మండలంలోని మల్లాయపాలెం సమీపంలో శుక్రవారం ఉదయం పది గంటల సమయంలో నర్సరావుపేట వైపు నుంచి అద్దంకి వస్తున్న ఆర్టీసీ బస్సు నడి రోడ్డుపై మొరాయిచింది. దీంతో ప్రభుత్వ కార్యాలయాలకు, ఉన్నత పాఠశాలకు, జూ నియర్ కళాశాలకు వచ్చే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. ఆర్టీసీ బస్సులు కం డిషన్‌లో లేవని, అందుకే ఇలాంటి పరిస్థితి వచ్చిందని పలువురు ప్రయాణికులు ఆరోపించారు. అద్దంకి నుంచి నర్సరావుపేటకు వెళ్లే ఏకైక బస్సు మార్గమధ్యంలో నిలిచిపోవటంతో ప్రయాణి కులు తీవ్ర అవస్థలు పడ్డారు. బల్లికురవ మండల పరిదిలో సక్రమంగా ఆర్టీసీ బస్సులను నడవటం లేదని, కొన్నిరూట్లలో ఉన్న సర్వీ సులు కూడా రద్దు చేశారని ప్రయాణికులు ఆరోపించారు.

ఖోఖో విజేత అద్దంకి


గెలుపొందిన అద్దంకి క్రీడాకారులు

చీరాలటౌన్, ఫిబ్రవరి 2: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర ఖోఖో జిల్లాస్థాయి పోటీలు శుక్రవారం చీరాల ఎస్‌ఆర్‌అండ్‌పీఎం హైస్కూల్‌లో పోలీసులు పటిష్ఠ బందోబస్తు నడుమ జరిగాయి. ఈపోటీ గురువారం బాపట్లలో జరుగుతున్న సమయంలో నిర్వాహకులకు, క్రీడాకారులకు మధ్య చోటుచేసుకున్న వివాదం తారస్థాయికి చేరింది. దీంతో అధికారులు పోలీసుల సంరక్షణలో చీరాలలో ఈ పోటీని నిర్వహించారు. ఉత్కంఠ భరితంగా సాగిన పోటీలో బాపట్ల నియోజకవర్గ టీం 6 పాయింట్‌లు సాధించగా, అద్దంకి నియోజకవర్గ టీం 15 పాయింట్‌లతో విజయ కేతనం ఎగురవేసింది. విజేతలు వైజాగ్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారు. విజేతలకు బాపట్లలో బహుమతులు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నత్తనడకన పార్కుల అభివృద్ధి పనులు


ఎన్‌ఆర్‌అండ్‌పీఎం హైస్కూల్ వెనుక వైపు నిర్మాణంలో ఉన్న పార్కు పనులు

చీరాల, ఫిబ్రవరి 2: చీరాల నియోజకవర్గంలో పలుచోట్ల పార్కుల పనులు జరుగుతున్నాయి. ప్రారంభించిన తరువాత తగినంత వేగంగా పనులు జరగటంలేదు. దీంతో ఆహ్లాదం.. ఆటవిడుపు కోరుకునే వారు ఆ పార్కులు ఎప్పుడు పూర్తవుతాయా అని ఎదురుచూస్తున్నారు. మున్సిపల్ పరిధిలో ఎన్‌ఆర్‌అండ్‌పీఎం హైస్కూల్ ప్రాంగణంలో స్కూలు వెనుకవైపు ఉన్న పార్కును అభివృద్ధి చేసేందుకు పనులు చేపట్టి కొన్ని నెలలవుతోంది. అయితే, నిర్మాణ పనులు నెమ్మదిగా జరుగుతున్నాయి. సెయింట్‌ఆన్స్ స్కూల్ సమీపంలో ఓ పార్కు నిర్మాణం జరుగుతోంది. ఆప్రాంతం గతంలో అపరిశుభ్రంగా ఉండేది. పార్కు పనులు ప్రారంభిచటం, పక్కనే సీసీ రోడ్డు నిర్మాణం జరగటంతో ఆ ప్రాంతం పరిశుభ్రంగా ఉంది. అంతవరకు బాగానే ఉంది. అయితే, పార్కు కోసం కేటాయించిన స్థలం చుట్టూ ఫెన్సింగ్ మాత్రమే వేసి, లోపల ఎర్రమట్టి తోలారు. అతరువాత పార్కుకు సంబంధించిన పనులు ప్రారంభించటంలో జాప్యం జరటం పట్ల ఆప్రాంత ప్రజలు ఒకింత అసంతృప్తి వ్యయం చేస్తున్నారు. ఆ పార్కు పూర్తయితే మూడు, నాలుగు వార్డుల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.


కొత్తపేట పరిధిలో కుందేరు ఒడ్డున నిర్మాణంలో ఉన్న పార్కు పనులు

ఇక కుందేరు పక్కన కొత్తపేట పంచాయితీ పరిధిలో నిర్మాణంలో ఉన్న పార్కు పనులను వేగవంతంచేసి ప్రారంభిస్తే ఆప్రాంత ప్రజలకు కూడా ఉప యోగకరంగా ఉంటుందని, పార్కు పనులను వేగవంతం చేయాలని కోరుతు న్నారు. కుందేరుకు మున్సిపల్ పరిధిలోని రామానాయుడు పార్కు మధ్యఉన్న ప్రాంతం అపారిశుధ్యానికి అడ్డాగా ఉంది. దీంతో రామానాయుడు పార్కులో వాకింగ్, ఎక్సర్‌సైజులు చేసే వాకర్స్ అపరిశుభ్రంగా ఉండే ప్రదేశం నుంచి వచ్చే దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు. కుందేరుకు, రామానాయుడు పార్కుకు మధ్యఉన్న ప్రదేశానికి కంచె ఏర్పాటుచేస్తే బాగుంటుందని వాకర్స్ కోరుతున్నారు. పాలకులు, అధికారులు వెంటనే స్పందించి పార్కుల నిర్మాణ పనులను వేగవంతంచేసి ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.


సెయింట్‌ఆన్స్ స్కూల్ సమీపంలో నిర్మాణంలో ఉన్న పార్కు

వ్యవసాయ మోటార్ల వైర్లు చోరీ

» ఆందోళన చెందుతున్న రైతులు

బల్లికురవ, ఫిబ్రవరి 2: గత కొంతకాలంగా పలు గ్రామాల్లో కొందరు గుర్తుతెలియని దొంగలు వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్లను పెద్ద ఎత్తున తస్కరిస్తున్నారు. తాజాగా బల్లికురవ మండలం కొమ్మినేనివారిపాలెం గ్రామంలో గత నాలుగు రోజుల్లో సుమారు వంద వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్లను రాత్రి సమయంలో కట్ చేసుకువెళ్లారు. రైతులు పంటలకు నీటిని పెట్టేందుకు వెళ్లి మోటార్లు పనిచేయకపోవటంతో కేబుల్ వైర్ కట్ చేసి ఉండటం చూసి లబోదిబో మంటున్నారు. ఒక్కో మోటార్‌కు సుమారు రూ.రెండు వేల విలువ కలిగిన వైరు చోరీ జరుగుతుంది. కేబుల్ వైరు మోటార్ లోపలికి దొంగలు కట్ చేయటంతో బోరులో ఉన్న మోటార్లు బయటకు తీయటం చాలా కష్టంగా మారుతుందని రైతులు వాపోతున్నారు.


కొమ్మినేనివారిపాలెంలో వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్లు చోరీ చేయగా నిరుపయోగంగా ఉన్న బోర్లు

గతంలో కూడా పలుమార్లు ఇదే పద్ధతిలో చోరీలు జరిగాయి. రాత్రుళ్లు పొలాల్లో రైతులు లేని సమయం గమనించి ఇలాంటి చోరీలు జరుగుతున్నాయి. ఎవరో అనుభవం కలిగిన దొంగల పనే అయి ఉంటుందని రైతులు అంటున్నారు. మండలంలోని బల్లికురవ. నక్కబొక్కలపాడు, గుంటుపల్లి, కొత్తపాలెం, అంబడిపూడి, వల్లాపల్లి, వైదన, ఎస్ఎల్ గుడిపాడు గ్రామాల్లో కూడా గత ఆరు మసాల వ్యవధిలో వందల సంఖ్యలో వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్లు చోరీలు జరిగాయని రైతులు తెలిపారు. చోరీ విషయం పోలీసు స్టేషన్‌కు వెళితే వారు ఫిర్యాదులు కూడా తీసుకోవటం లేదని రైతులు తెలిపారు. తక్కువ నగదు చేసే కేబుల్ పోవటంతో కొందరు రైతులు ఫిర్యాదు చేసినా ఉపయెగం ఉండదులే అని కొత్త వైరు తీసుకువచ్చి అమర్చుతున్నారని కొందరు రైతులు తెలిపారు. గతంలో సోలార్ ప్లేట్లు, బోర్డులు కూడా తస్కరణకు గురయ్యాయని వారు తెలిపారు. ఒకేమారు వందల సంఖ్యలో పంట భూముల్లో ఉన్న మోటార్ల వైర్లు చోరీ జరగటంతో బోర్లు నిరుపయోగంగా ఉన్నాయని రైతులు తెలిపారు. గ్రామాల్లో జరుగుతున్న మోటార్ల కేబుల్ వైర్ల చోరీ ముఠా గుట్టురట్టు చేసేలా పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నదాతలు కోరుతున్నారు.

అక్రమ అరెస్టులతో టీడీపీని దెబ్బతీయలేరు!

» మచ్చలేని నాయకుడు ఎమ్మెల్యే ఏలూరి

» పార్టీ మండల అధ్యక్షుడు షంషుద్దీన్

పర్చూరు, ఫిబ్రవరి 2: అక్రమ కేసులు, అరెస్టులతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రతిష్టను దెబ్బతీయలేరని టీడీపీ మండల అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్ అన్నారు. మచ్చలేని, స్వచ్ఛమైన నాయకుడు ఎమ్మెల్యే ఏలూరని పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాసేవే లక్ష్యంగా రాజకీయాల్లోకి వచ్చి అభివృద్ధి, సంక్షేమం అనే ఆయుధంతో ప్రగతి పథంలో నిలిచిన ఘనత ఏలూరికే దక్కుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి ఎక్కడా అభివృద్ధి చేసిన దాఖలాలు లేవన్నారు. అధికార పార్టీ పేరుతో అక్రమాలు, అరాచకాలు, దౌర్జన్యాలకు పాల్పడుతుంది ఎవరో అందరికీ తెలుసునని చెప్పారు. బహిరంగా మైనింగ్, ఇసుక, రేషన్ అక్రమ వసూలు చేస్తుంది ఎవరో చిన్నపిల్లవాడిని అడిగినా చెప్పే పరిస్థితిలో ఉందన్నారు. దొంగే దొంగ అన్న చందంగా అధికార పార్టీ నేత కేకలు వేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే ఏలూరిపై విమర్శలు చేసిన ప్రతిఒక్కరూ ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు. ఇప్పటికైనా విమర్శలు మానుకొని, ప్రజలకు సేవచేసి మన్ననలు పొందాలే కానీ ఇలా అక్రమ మార్గంలో తప్పుడు ఆరోపణలు చేయకూడదన్నారు. దాడికి వచ్చిన వ్యక్తులను వదిలి ఫిర్యాదు చేసిన ఫ్యాక్టరీల యాజమాన్యంపై కేసులు పెట్టడం దుర్మార్గమైన చర్య అని అన్నారు.

విలేకరుల సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు అగ్నిగుండాల వెంకటకృష్ణారావు, కోడూరి శేషబ్రహ్మాచారి, దూళిపల్లి వెంకటస్వామి, కొరిటాల సురేష్, కొండ్రగుంటి శివనాగేశ్వరరావు, చెరుకూరి చింపయ్య, షేక్ బషీర్, కన్నెగంటి సాంబయ్య, షేక్ హసేన్(ట్విన్స్) వెంకటేశ్వర్లు, శ్రీరాం వెంకటసుబ్బారావు, గిరి, తంగెళ్ళ మల్లికార్జునరావు, ఏసు, దాసి కిరణ్, ఇజ్రాయిల్, కట్టెంపూడి జీవన్, ఉప్పుటూరు జానీ తదితరులు పాల్గొన్నారు.


పర్చూరులో మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు షంషుద్దీన్

కేసులకు భయపడేదిలేదు!

యద్దనపూడి(మార్టూరు), ఫిబ్రవరి 2: పర్చూ రు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేక, అధికార పార్టీ ఆయనపై అక్రమంగా కేసులు పెడుతుందని టీడీపీ నాయకులు ధ్వజమెత్తారు. శుక్రవారం యద్దనపూడిలోని పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. పర్చూరులో రెండుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించిన ఏలూరి సాంబశివరావు మూడోసారి పర్చూరులో గెలిచి హ్యాట్రిక్ సాధించడం ఖాయమన్నారు. ఏలూరి గెలుపును అడ్డుకోవడం ఎవరితరమూ కాదన్నారు. పర్చూరు నియోజకవర్గం ప్రశాంతంగా ఉండటానికి కారణం ఏలూరి అని చెప్పారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ప్రజానీకం వాస్తవాలు గమనిస్తున్నారన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఓటు ద్వారా అధికార పార్టీకి గుణపాఠం చెబుతారని అన్నారు. కేసులకు భయపడే నాయకులు ఏలూరి కాదని, ఆయన వెంట నడిచే సైనికులుగా మేమంతా ఉన్నామని నాయకులు స్పష్టం చేశారు.

విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు గుదే తారక రామారావు, నల్లపనేని రంగయ్య చౌదరి, కనపర్తి నాగేశ్వరరావు, రావిపాటి సీతయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై చలో చినగంజాం

» పోలీసుల ముందస్తు అరెస్టులు

» ధ్వజమెత్తిన జనసేన నాయకులు

చినగంజాం, ఫిబ్రవరి 2: మండలంలోని చినగంజాం గ్రామ సర్వే నెంబర్లు 829, 830 భూముల్లో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలపై చలో చినగంజాం కార్యక్రమంలో జనసేన, సీపీఎం నాయకులు పాల్గొనకుండా పోలీసులు శుక్రవారం వేకుమజామున ముందుస్తు అరెస్టులు చేశారు. చినగంజాం ప్రాంతంలో అధికార పార్టీ నాయకులు అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఇసుక అక్రమ తవ్వకాలపై గురువారం జనసేన పార్టీ చలో చినగంజాం కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఈనేపథ్యంలో శుక్రవారం వేకువజామున సీపీఎం నాయకుడు గున్నమనేని ప్రతాప్‌కుమార్, జనసేన మండల నాయకులు సందు శ్రీనివాసరావు, అడుసుమల్లి హరిబాబు, తోట అశోకచక్రవర్తి, తుమ్మలపెంట సతీష్, గంటా వెంకటేష్, బొప్పన శ్రీనివాసరావు, షేక్ కరిముల్లా, గంటా లక్ష్మీనారాయణ తదితరులను అదుపులోకి తీసుకొని చినగంజాం పోలీసుస్టేషన్‌కు తరలించారు. పర్చూరు, చీరాల నియోజకవర్గాలలోని జనసేన నాయకులను హౌస్ అరెస్టులు చేశారు. విచ్చలవిడిగా ఇసుక మాఫియా జరుగుతున్న కనీసం కన్నెత్తి చూడని అధికారులు అక్రమాలను ఎత్తి చూపాలనుకుంటున్న జనసేన నాయకులను అక్రమంగా నిర్బంధించడం హాస్యాస్పదంగా ఉందని జనసేన పార్టీ నాయకులు అన్నారు. ఇసుక అక్రమ రవాణాని వెంటనే ఆపాలని, చట్టప్రకారం అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా చలో చినగంజాం కార్యక్రమం ద్వారా నిరసన తెలపడానికి పూనుకున్న ప్రతిపక్షాలపై పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకొని నిర్బంధించడం సరైన పద్ధతి కాదని అన్నారు. మండలంలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలపై ఎన్ని నిర్బంధాలు విధించినా పోరాటం ఆపే ప్రసక్తి లేదని తెలిపారు.


పోలీసుస్టేషన్‌లో ఉన్న జనసేన, సీపీఎం నాయకులు


చినగంజాంలో అనుమతులు లేకుండా తవ్వుతున్న ఇసుక క్వారీ

ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతన్న క్వారీల వద్దకు ఎవరు వెళ్లకుండా కడవకుదురు బస్టాండ్, కడవకుదురు జడ్పీ పాఠశాల సమీపంలో, ఇసుక క్వారీకి వెళ్లే దారిలో, క్వారీ వద్ద భారీసంఖ్యలో పోలీసు బలగాలను మోహరించారు. శుక్రవారం వేకువజామున 5గంటలకు అదుపులోనికి తీసుకున్న జనసేన, సీపీఎం నాయకులను శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటలకు విడుదల చేశారు. చీరాల డీఎస్పీ ప్రసాదరావు ఆధ్వర్యంలో ఇంకొల్లు, చీరాల టూ టౌన్, చీరాల రూరల్ సీఐలు బి.శ్రీనివాసరావు, సోమశేఖర్‌రావు, నిమ్మగడ్డ సత్యనారాయణ, చీరాల డివిజన్ పరిధిలోని ఎస్‌ఐలు, ఏఆర్, సర్కిల్ పరిధిలోని హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, మహిళా కానిస్టేబుళ్లతో బందోబస్తు నిర్వహించారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
శనివారం 3 ఫిబ్రవరి 2024

సోమశిలలో తగ్గుతున్న నీటి నిల్వ



అనంతసాగరం : సోమశిల జలాశయంలో నీటి నిల్వ తగ్గుతోంది. ఎగువ ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. గురువారం 25.439 టీఎంసీల నీరు ఉండగా, శుక్రవారానికి 25.173 టీఎంసీలకు చేరింది. ఇక దిగువ డెల్టాకు 2,250, ఉత్తరకాలువకు 500, దక్షిణ కాలువకు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



వలేటివారిపాలెం ఎగుమతికి సిద్ధంగా..

'ఎవరేం అనుకున్నా మాకేం. అధికారం మాది. ఏం చేసినా చెల్లుబాటు అవుతుంది. ఎన్నికల 'కోడ్' రాకముందే అన్ని సర్దేద్దాం.' అన్నధోరణిలో అక్రమార్కులు బరితెగిస్తున్నారు. ప్రకృతి వనరులైన తెల్లరాయి (క్వార్ట్జ్), గ్రావెల్‌ను భారీ యంత్రాలతో ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. ఆ తర్వాత గుట్టుచప్పుడు కాకుండా జిల్లా సరిహద్దు దాటించి సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా జరుగుతున్న ఈ వ్యవహారంపై తెలిసినా అధికార యంత్రాంగం మొద్దునిద్ర వీడటం లేదు. కరిగిపోతున్న ప్రకృతి సంపదను చూసి కడుపు మండిన స్థానికులు నిలదీస్తే అక్రమార్కులు దౌర్జన్యాలకు దిగుతున్నారు.



సంగం : గ్రావెల్ తరలింపుతో తిరుమనతిప్పలో ఏర్పడిన గుంతలు

మాఫియా దెబ్బకు కరిగిపోతున్న 'తిప్ప'

సంగం : మండలంలోని తిరుమనతిప్పలో గ్రావెల్ అక్రమ తరలింపు యథేచ్ఛగా సాగుతోంది. కొందరు అక్రమార్కులు ఎక్స్‌కవేటర్లతో తవ్వి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వార ప్రైవేట్ లే అవుట్లకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో 252 సర్వే నెంబరులో ఉన్న తిరుమనతిప్పలో విలువైన గ్రావెల్ ఉంది. ఎక్కడ గ్రావెల్ అవసరమైనా మాఫియా కళ్లు ఈ తిప్పపై పడిపోతున్నాయి. రాత్రి పొద్దుపోయిన తరువాత ఎక్స్‌కవేటర్లతో తవ్వి ట్రాక్టర్ల లోడ్ దూరాన్ని బట్టి రూ.1500 నుంచి 2000లకు విక్రయిస్తున్నారు. అనుమతులు లేకుండా అక్రమార్కులు బరితెగిస్తున్నా రెవెన్యూ యంత్రాంగం కబోదిలా వ్యవహరిస్తోంది. పత్రికల్లో కథనాలు వచ్చినప్పుడు హడావుడి చేస్తున్న అధికారులు ఆ తర్వాత మిన్నకుండిపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం తిరుమనతిప్పలో నిఘా పెట్టి గ్రావెల్ తరలింపును అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఏ బిడ్డా.. మా అడ్డా!



- బరితెగిస్తున్న మైనింగ్ మాఫియా
- రెవెన్యూ, అటవీ భూముల్లో అక్రమ తవ్వకాలు
- భూమి పొరల్లో నుంచి తెల్లరాయి వెలికితీత
- ఆపై గట్టుచప్పుడు కాకుండా తరలింపు
- రూ. కోట్లు గడిస్తున్న అక్రమార్కులు
- మొద్దు నిద్ర వీడని అధికార యంత్రాంగం
- నిలదీసిన స్థానికులపై దౌర్జన్యం

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 2 : మండలంలో తెల్లరాయి దొంగలు రెచ్చిపోతున్నారు. అటవీ, రెవెన్యూ భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా ఎక్స్‌కవేటర్లతో తవ్వకాలు జరుపుతూ రూ.కోట్లు గడిస్తున్నారు. అయినా అటవీ, రెవెన్యూ, మైనింగ్ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడంలేదు. దీంతో తెల్లరాయి (క్వార్ట్జ్) వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలు గా సాగుతోంది. అయ్యవారిపల్లె, మాలకొండ, చుండి, పోలినేని చెరువు, రామలింగాపురం, గరుకపాలెం, అంకభూపాల పురం గ్రామాల్లోని అటవీ, రెవెన్యూ భూముల్లో తెల్లరాయి నిక్షేపాలు అధికంగా ఉన్నాయి. ఆయా ప్రాంతాలపై కన్నేసిన అక్రమార్కులు రాత్రింబవళ్లు విచ్చలవిడిగా ఎక్స్‌కవేటర్లతో తవ్వి తెల్లరాయిని వెలికి తీస్తున్నారు. ఈ గ్రామాల్లో లభ్యమవుతున్న తెల్లరాయి నాణ్యతలో నెంబర్‌వన్‌గా ఉండడంతో విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. ఈ తెల్లరాయి పొడి వివిధ వస్తువుల తయారీ, మందుల ఉత్పత్తిలోనూ ఉపయోగపడుతుంది. దీంతో అక్రమార్కులు దాన్ని ఎగుమతి చేసి అనతికాలంలోనే రూ.కోట్లు గడిస్తున్నారు.

● ఖజానాకు గండి

ప్రకృతి సంపద అయిన తెల్లరాయిని తవ్వుకోవాలంటే ముందుగా మైనింగ్ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి. ఆ తర్వాత తహసీల్దార్ వద్ద ఎన్‌వోసీ తీసుకోవాలి. మైనింగ్ అధికారుల నుంచి అనుమతి వచ్చాక క్వారీ పనులు చేపట్టాలి. భూమి నుంచి వెలికి తీసిన తెల్లరాయికి టన్నేజీ ప్రకారం విలువ కట్టి ప్రభుత్వానికి రుసుం చెల్లించాలి. కానీ ఎలాంటి అనుమతులు లేకుండానే అక్రమంగా తెల్లరాయి తవ్వకాలు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఖజానాకు గండి పడుతోంది.

● జోరుగా అక్రమ తవ్వకాలు

రెవెన్యూ, అటవీ భూముల్లో జోరుగా తెల్లరాయి అక్రమ తవ్వకాలు చేస్తున్నారు. యంత్రాల ద్వారా తెల్లరాయిని వెలికితీసి, కూలీల ద్వారా రాయిని సైజులుగా కొట్టిస్తున్నారు. దాన్ని రాత్రిళ్లు గుట్టుచప్పుడు కాకుండా లారీలకు లోడ్ చేయించి చెన్నైకి తరలిస్తున్నారు. అక్కడ నుంచి వ్యాపారులు విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు అటు వైపు కన్నెత్తి కూడా చూడడంలేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తెల్లరాయి అక్రమ తవ్వకాలపై చర్యలు చేపట్టాలి.



వలేటివారిపాలెం : అయ్యవారిపల్లెలో తెల్లరాయి కోసం తవ్వకాలు జరుపుతున్న వాహనం

అనుమతుల పేరుతో బరితెగింపు

మర్రిపాడు : అనుమతుల పేరుతో మండలంలో అక్రమార్కులు బరితెగిస్తున్నారు. శెట్టిసముద్రం గ్రామ చివర పొలాలు, చిలకపాడు రెవెన్యూలో భూముల్లో సుమారు 20అడుగుల లోతున బండరాళ్లను భారీ ఎక్స్‌కవేటర్లతో వెలికి తీస్తున్నారు. వీటిని గట్టుచప్పుడు కాకుండా సరిహద్దులు దాటించేస్తున్నారు. మూడు రోజులుగా ఈ వ్యవహారం సాగుతుండటంతో స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేయగా, తమకు అనుమతులు ఉన్నాయంటూ బుకాయిస్తున్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో తెల్లరాయి తవ్వకాలు తగ్గటంతో సరిహద్దు మండలమైన మర్రిపాడులో అక్రమార్కులు చొరబడ్డారు. చూస్తుండగానే ఒకేచోట 12ఎకరాల భూమిలోని రాయిని తవ్వుకునేందుకు శ్రీకారం చుట్టారు. గతంలో కూడా మండలం నుంచే తెల్లరాయిని తవ్వి చెన్నైకు తరలించి, సొమ్ము చేసుకున్నారు. ప్రస్తుతం టన్ను మన దగ్గర రూ.15వేలు ఉండగా విదేశాల్లో 40వేల నుండి 50 వేల వరకు పలుకుతోంది. దీంతో అక్రమార్కులు బరితెగించి తవ్వకాలు జరుపుతున్నారు.



మర్రిపాడు : భూమిలో తెల్లరాయిని వెలికి తీస్తున్న ఎక్స్‌కవేటర్

అక్రమ మైనింగ్ మళ్లీ మొదలు

పొదలకూరు : వరదాపురం గ్రామంలోని రుస్తుం, భారత్ క్వారీలలో మొన్నటిదాకా ఆగిన అక్రమ మైనింగ్‌ను అక్రమార్కులు పునఃప్రారంభించారు. రోజుకు ఐదు లారీల సరుకును అక్రమంగా తరలిస్తున్నారని విశ్వసనీయ సమాచారం. వారం రోజులుగా తెల్లరాయి యథేచ్ఛగా తరలిపోతున్నా అధికార యంత్రాంగం అటువైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు ఉన్నాయి. టీడీపీ నేత సోమిరెడ్డి సత్యాగ్రహ దీక్షతో కొన్ని రోజులపాటు అక్రమ మైనింగ్‌ను ఆపేశారు. అయితే, ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కోడ్ రాకముందే అక్రమ సొమ్మును గడించేందుకు అధికార పార్టీ నాయకులు ఏ అవకాశాన్ని వదులుకోవడం లేదని, అందులోభాగంగానే రుస్తుం మైకా మైన్‌లో మైనింగ్ కొనసాగిస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు విమర్శించారు.



పొదలకూరు: మైన్‌లో క్వార్ట్జ్ లోడ్‌తో ఉన్న లారీ



ఆదిదంపతులకు పుష్పాభిషేకం

జొన్నవాడలో మల్లికార్జున, కామాక్షితాయి స్వామి అమ్మవార్లకు శుక్రవారం పుష్పయాగం వేడుకగా జరిగింది. నెల్లూరు, హైదరాబాదు, చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాలకు చెందిన దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలోని అలంకార మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. అంతకముందు పల్లవ గ్రానైట్స్ అధినేత దాత కొడవలూరు సుబ్బారెడ్డి సహకారంతో నిర్మించిన నిత్యాన్నదాన భవనం, మరో దాతల సహకారంతో నిర్మించిన వాటర్ ట్యాంకును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం వారిని ఆలయ మర్యాదలతో చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు, ఈఓ గిరికృష్ణ, అర్చకులు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. బుచ్చి చైర్‌పర్సన్ సుప్రజ, ఆలయ కమిటీ సభ్యులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ఓ భజన బృందం నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది.

\- బుచ్చిరెడ్డిపాళెం

వైసీపీ సిటీ సమన్వయకర్తగా ఖలీల్

నెల్లూరు ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నగర నియోజకవర్గంపై వారం రోజులుగా కొనసాగు తున్న ఉత్కంఠకు తెరపడింది. ప్రస్తుత ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్‌ను నరసరావుపేట పార్ల మెంట్ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించిన తర్వాత సిటీపై అందరి దృష్టి పడింది. ఈయన స్థానంలో నగర ఇన్‌చార్జిగా ఎవరిని నియమిస్తా రన్నది ఆసక్తిగా మారింది. ఈ క్రమంలో అనేక పేర్లు తెరమీదకు వచ్చాయి. అయితే శుక్రవారం రాత్రి వైసీపీ అధిష్ఠానం విడుదల చేసిన జాబితాలో నెల్లూరు సిటీ సమన్వయకర్తగా డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్ అహ్మద్‌ను నియమించారు. ఆయన అనిల్ వర్గానికి చెందిన వ్యక్తి. సిటీ ఇన్‌చార్జిగా పలువురు పేర్లు ప్రచారానికి వచ్చిన నేపథ్యంలో అనిల్ వర్గంలో ఆందోళన మొదలయింది. దీంతో ప్రస్తుతానికి వారందరి ఆందోళనలను తొలగించేందుకు ఖలీల్ అహ్మద్‌ను సమన్వయ కర్తగా నియమించినట్లు వైసీపీ వర్గాల ద్వారా తెలుస్తోంది.

మార్చి 3న పల్స్‌పోలియో

నెల్లూరు (వైద్యం) : మార్చి నెల 3వ తేదీన జరిగే పల్స్‌పోలియో కార్యక్రమానికి అంతా సిద్ధంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య వెల్లడించారు. శుక్రవారం నెల్లూరులోని తన కార్యాలయంలో నెల్లూరు, కావలి, కందుకూరు డివిజన్ల ఆరోగ్య పర్యవేక్షకులకు సర్వేలెన్స్ వర్క్‌షాపు జరిగింది. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ పల్స్‌పోలియోలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి 100 శాతం లక్ష్యాలను సాధించాలని తెలిపారు. అదనపు జిల్లా వైద్యాధికారి ఖాదర్‌వలి మాట్లాడుతూ క్షయ రహిత సమాజం మనందరి ధ్యేయమన్న విషయం మరిచి పోవద్దని సూచించారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ సెలీనాకుమారి, సర్వేలెన్స్ వైద్య అధికారి డాక్టర్ మోనికా తదితరులు పాల్గొన్నారు.



కలువాయిలో చెన్నయ్య కుటుంబ సభ్యులకు చెక్కు ఇస్తున్న భువనేశ్వరి, పక్కన కురుగొండ్ల

కష్టాలు వింటూ.. కన్నీళ్లు తుడుస్తూ..

అధైర్య పడొద్దు.. ధైర్యంగా ఉండాలని భువనేశ్వరి భరోసా

బాధిత కుటుంబాలకు అండగా టీడీపీ

జిల్లాలో ముగిసిన 'నిజం గెలవాలి' యాత్ర

పెద్దదిక్కును కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబసభ్యులను ఓదార్చుతూ వారి కష్టాలు వింటూ కన్నీళ్లు తుడుస్తూ 'అధైర్య పడొద్దు.. మేమున్నాం. అంటూ నారా భువనేశ్వరి భరోసా నిచ్చారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా జిల్లా పర్యటనలో మూడవ రోజు శుక్రవారం ఆత్మకూరు, వెంకటగిరి నియోజకవర్గాల్లో ఆమె పర్యటించారు. అడుగడుగునా భువనేశ్వరికి టీడీపీ నాయకులు, కార్యకర్తలతోపాటు సమీప ప్రజలు ఘన స్వాగతం పలికారు. చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక చనిపోయిన కార్యకర్తల కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పడంతో పాటు ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు.

మాటలు తప్ప... ఇళ్లేవి?

- ఫలితమివ్వని అందరికీ ఇళ్లు పథకం
- పేదలకు నెరవేరని సొంతింటి కల
- 95,963 ఇళ్లు మంజూరు.. 16,849 మాత్రమే పూర్తి
- లేఅవుట్లలో సాగని నిర్మాణాలు

నెల్లూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : అంతన్నారు.. ఇంతన్నారు. అదిగో స్థలం అంటే... ఇవిగో ఇళ్లు అంటూ గొప్పలు చెప్పుకున్నారు. నాలుగేళ్లు గడిచిపోయాయి. కానీ పేదవాడికి మాత్రం సొంతింటి కల నెరవేర లేదు. ఎంతో ఆర్భాటంగా ప్రారం భమైన పేదలందరికీ ఇళ్ల పథకం అభాసుపాలవుతోంది. జిల్లాలో లబ్ధిదారు లకు మంజూరైన ఇళ్లకు, పూర్తయిన ఇళ్ల సంఖ్య కు అస్సలు పొంతన కనిపించడం లేదు. రూ.వంద ల కోట్లు ఖర్చు చేసినా కనీసం ఇరవై శాతం ఇళ్లను కూడా పూర్తి చేయలేకపోయారు. ఆది నుంచీ సరైన ప్రణా ళిక లేకపోవడం, ఇళ్లు నిర్మించుకునేందుకు వీలులేని ప్రదేశా ల్లో లేఅవుట్లు వేయడం, కొన్ని లేఅవుట్లలో నిర్మాణాలు చేసినా కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకపోవడం.. ఇలా అనేక లోపాలు పేదలందరికీ ఇళ్ల పథకం విఫలమవడానికి కారణమని అధికార వర్గాలే చెప్పుకుంటున్నాయి. జిల్లాలో 95,963 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయగా నాలుగేళ్ల క్రితం ఈ నిర్మాణాలు మొదలుపెట్టారు. ఇప్పటికి 16,849 ఇళ్లు మాత్రమే పూర్తవగా, 15,474 ఇళ్లు అసలు మొదలే పెట్టలేదు. మరో 28,188 ఇళ్లు బేస్ లెవల్ కన్నా దిగువున ఉండగా మరో 19,567 ఇళ్లు బేస్ స్థాయిలోనే ఉన్నాయి. ఇక 5,426 ఇళ్లు రూఫ్ లెవల్, 10,459 ఇళ్లు రూఫ్ కాంక్రీట్ స్థాయిలో ఉన్నాయి. గడిచిన నాలుగు నెలలుగా చూసుకుంటే పేదల ఇళ్ల నిర్మాణాల్లో మరీ నిర్లక్ష్యం కనిపిస్తోంది. గత అక్టోబరు ప్రారంభం నాటికి 15,504 ఇళ్లు పూర్తి చేశారు. అంటే ఈ నాలుగు నెలల వ్యవధిలో 1,345 ఇళ్లను మాత్రమే పూర్తి చేయగలిగారు. ఈ లెక్కన జిల్లాలోని అర్హులైన పేదలందరికీ ఎప్పటికి ఇళ్లు నిర్మిస్తారో అధికారులే సమాధానం చెప్పాలి.

సమీక్షించేవారేరి..?

నాలుగేళ్ల క్రితం అర్హులకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారు. అప్పుడే అందరికీ పట్టాలు కూడా అందజేశారు. అయితే చాలా చోట్ల ఊర్లకు దూరంగా, శ్మశానాలకు దగ్గరగా లేఅవుట్లు వేయడంతో అక్కడ ఇళ్లు నిర్మించుకునేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపలేదు. కొన్ని చోట్ల ఇళ్లు నిర్మించుకునేందుకు అవకాశమున్నప్పటికీ ప్రభుత్వమే నిర్మించి ఇచ్చేలా ఆప్షన్-3ని లబ్ధిదారు లు ఎంచుకున్నారు. దీంతో దాదాపు వంద మంది కాంట్రాక్టర్లకు జిల్లాలో ఇళ్ల నిర్మాణాలను అప్పగించారు. అయితే చాలా చోట్ల ఇళ్లను నాసిరకంగా నిర్మిస్తున్నారు. మరికొన్ని చోట్ల బేస్‌మెంట్ స్థాయిలోనే ఆపేశారు. ఈ ఇళ్లను పూర్తి చేసి పేదలకు అందించాల్సిన ప్రభుత్వం ఆ దిశగా దృష్టిసారించడం లేదన్న విమర్శలున్నాయి. ఆరు నెలల ముందు వరకు అటు రాష్ట్ర ఉన్నతాధికారులు, ఇటు జిల్లా ఉన్నతాధికారులు ప్రతి రోజూ ఇళ్ల నిర్మాణాల పురోగతిని సమీక్షించే వారు. కానీ ఇప్పుడు ఎవరూ పట్టించుకో వడం లేదు. ఇళ్ల నిర్మాణాలను వదిలేసి గతంలో ఇచ్చిన పట్టాలకు ఇప్పుడు రిజిస్ట్రేషన్ అంటూ హడావిడి చేస్తుండడంపైనా లబ్ధిదారుల నుంచి అసహనం వ్యక్తమవుతోంది. ఇప్పటి వరకు నిర్మించిన 16,849 ఇళ్లలో సగం వరకు సొంత స్థలాల్లో నిర్మించుకున్నవే ఉన్నాయి. దీనిని బట్టి లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు ఎలా జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు.



నెల్లూరు నగర సమీపంలోని కొండ్లపూడి వద్ద జగనన్న కాలనీ

మూలపడ్డ ఎండీయూ వాహనాలు

● సరుకుల కోసం దుకాణాలకు కార్డుదారుల పరుగులు


తహసీల్దారు కార్యాలయం వద్ద నిరుపయోగంగా మూలన పడి వున్న ఎండీయూ వాహనం

మర్రిపాడు, ఫిబ్రవరి 2: రేషన్ కార్డుదారులకు ఇంటివద్దే సరుకులు అందించడానికి ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిన ఎండీయూ వాహనాలు మండలంలో కదలడం లేదు. నాలుగు వాహనాలను నిర్వాహకులు మూలపడేశారు. దీంతో పాత పద్ధతిలోనే కిలోమీటర్ల మేర పోయి దుకాణాలలో సరుకులు తెచ్చుకుంటున్నారు. మండలంలో 24 పంచాయితీల్లో 76 గ్రామాల్లో 13854 మంది రేషన్ కార్డుదారులు వున్నారు. బియ్యం పంపిణీ కోసం మండలంలో 8 ఎండీ యూ వాహనాలు ఏర్పాటు చేశారు. ఒక్కో వాహనానికి 1500నుండి 2000 కార్డులు కేటాయించి, రెండు మూడు గ్రామ పంచాయతీలను అప్పగించారు. కానీ నిర్వహణ భారం పెరిగిందని, గిట్టుబాటు కాక 4 వాహనాలను పూర్తిగా నిలిపి వేశారు. మిగతా వాహనాలు ఒక నెల ఆగుతూ మరో నెల కదులుతుండటంతో సరుకులు ఎక్కడ ఇస్తారో తెలియడం లేదని, చౌక దుకాణాలను ఆశ్రయించక తప్పటం లేదని కార్డుదారులు వాపోతున్నారు. సమస్యను అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయిందని, చివరకు గడపగడపకు కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యేకి విన్నవించుకున్నా ఫలితం లేకపోయిందని, ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ప్రతీ గ్రామంలో ఇంటింటికీ నిత్యావసర సరుకులు అందేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బడుగు, బలహీనవర్గాల సంక్షేమం టీడీపీ ధ్యేయం : చెంచలబాబు


మాట్లాడుతున్న చెంచలబాబు యాదవ్

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 2: బడుగు, బలహీన వర్గాల సంక్షేమం తెలుగు దేశం పార్టీ ధ్యేయం అని పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచల బాబుయాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక చెంచలబాబు అతిథిగృహంలో నియోజకవర్గ టీడీపీ బీసీ సంఘం అధ్యక్షుడు మతకాల శ్రీనివాసుల యాదవ్ అధ్యక్షతన ఉదయగిరి, వరికుంటపాడు మండలాల జయహో బీసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత బీసీలను టీడీపీకి దూరం చేసేందుకు దాడులు చేసి కేసులు నమోదుచేసి వేధించినా వారిలో ఆత్మవిశ్వాసం చచ్చిపోలేదన్నారు. వైసీపీకి ఓటు ఎందుకేశామా అని బీసీలు పశ్చాతప పడుతున్నారన్నారు. ఎప్పుడు ఎన్నికలు వస్తాయా జగన్‌ను గద్దె దింపుదామా అని ఎదురుచూస్తున్నారన్నారు. బలహీన వర్గాలకు నిధులు, విధులు, కుర్చీల్లేని 56 కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు అలంకారప్రాయంగా అంటగట్టారన్నారు. టీటీడీ ఛైర్మన్ పదవి బీసీలకు ఇచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. జరగనున్న ఎన్నికల్లో టీడీపీ 160 స్థానాలు సాధించి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కప్పిర శ్రీనివాసులు, మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, నాయకులు శ్రీకుర్తి రవీంద్రబాబు, రియాజ్, సందానీ, పోలిశెట్టి, గూడూరు వెంకటేశ్వరరావు, శ్రీకాంత్, వాసు, హరికృష్ణ, భాస్కర్, రేవతి, అరుణపాల్గొన్నారు.

అధిష్ఠానం ఆదేశిస్తే పోటీ చేస్తా

టీడీపీ అధిష్ఠానం ఆదేశిస్తే నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థిగా పోటీచేస్తానని చెంచల బాబుయాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఇటీవల టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడుకు నెల్లూరు పార్లమెంట్‌కు తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని విన్నవించినట్లు తెలిపారు. జిల్లాలో అవినీతి, అక్రమాలకు తావు లేకుండా ఐదేళ్లు జడ్పీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఏకైక బీసీని తానేనన్నారు. ఎంతటి ధనవంతుడు పోటీ చేసినా తట్టుకొనే సత్తా ఉందని, తప్పకుండా విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

కులగణన సర్వే పరిశీలన


సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో ఈశ్వరమ్మ

ఉదయగిరి, ఫిబ్రవరి 2: మండలంలో జరుగుతున్న కులగణన సర్వేను సచివాలయ సిబ్బంది, వలంటీర్లు బాధ్యతగా చేపట్టాలని ఎంపీడీవో ఈశ్వరమ్మ సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. సర్వే బృందం ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలు నమోదు చేయాలన్నారు. నిర్ణీత గడువు లోపు సర్వే పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరిసాగుపై అవగాహన

అనంతసాగరం, ఫిబ్రవరి 2: స్థానిక సచివాలయం-1లో శుక్రవారం రైతులకు వరిసాగులో సస్యరక్షణ చర్యలపై అధికారులు అవగాహన కల్పించారు. ఏదశలో ఎలాంటి పురుగుమందులు వాడాలి, తెగుళ్ల నివారణ చర్యలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం రైతు శిక్షణ సహాయ సంచాలకులు మధవి, వ్యవసాయాధికారులు వాసు, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

మట్టి ఖర్చులకు ఆర్థిక సాయం


ఆర్థికసాయం అందజేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 2: మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన గెట్టిబోయిన రమణయ్య విద్యుదాఘాతంతో మృతిచెందడంతో నియోజకవర్గ టీడీపీ నాయకుడు, కాకర్ల చారిటబుల్ ట్రస్టు అధినేత కాకర్ల సురేష్ శుక్రవారం తన ప్రతినిధులచే కుటుంబ సభ్యులకు మట్టి ఖర్చుల కోసం ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గడ్డం నాయుడు, శ్రీరాములు, రామలక్ష్మి, ట్రస్టు ప్రతినిధులు జల్సాయాదవ్, తుమ్మల కిరణ్, హరీష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ


ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేస్తున్న మేకపాటి రాజగోపాల్ రెడ్డి

సీతారామపురం, ఫిబ్రవరి 2 : మండల పరిధిలోని బసినేనిపల్లి గ్రామ సచివాలయ ఆవరణలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష 2వ విడత కార్యక్రమాన్ని ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం బసినేనిపల్లి గ్రామ ప్రాంతంలోని మర్రివూట్ల రిజర్వాయర్ వద్ద ఉన్న రామయ్య స్వామి ఆశ్రమాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ భార్గవి, డాక్టర్ స్వప్న, వైసీపీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, జెసిఎస్ మండల కన్వీనర్ బాలినేని మాబయ్య, అయ్యవారిపల్లి సర్పంచ్ దుగ్గయ్య, పిడతల ఓబులేష్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

వింజమూరు: వింజమూరు గ్రామ సచివాలయం-1లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మురళీధర్, డాక్టర్ పర్వత, ఎముకల డాక్టర్ మధు, మధుసూదన్ పాల్గొన్నారు.

మెట్ట పంటలకు సాగునీరు విడుదల


రైతులతో మాట్లాడుతున్న జలవనరుల శాఖ ఈఈ, డీఈలు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 2: మండలంలోని గండిపాళెం జలాశయం ఆయకట్టు భూముల్లో సాగు చేసిన మెట్ట పంటలకు సాగునీరు విడుదల చేసినట్లు జలవనరుల శాఖ ఈఈ ఆర్ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం అధికారులతో కలిసి జలాశయాన్ని పరిశీలించి రైతులతో చర్చించారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ జలాశయంలో ప్రస్తుతం 9.5 అడుగుల మేర నీరు ఉందన్నారు. ఆయకట్టు భూముల్లో మెట్ట పంటలు సాగు చేసిన రైతులు పంటలు ఎండుతున్నాయి, నీరు వదలాలని కోరడంతో కుడి కాలువకు 30, ఎడమ కాలువకు 50 క్యూసెక్కుల చొప్పున నీరు విడుదల చేశామన్నారు. తొలుత స్థానిక సబ్ డివిజన్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసి సిబ్బందికి తగు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ డీఈ చంద్రమౌళి, ఏఈలు వేణు, సురేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాగరం ఎంపీడీవోగా షేక్ తాజ్‌మాస్రూర్

అనంతసాగరం, ఫిబ్రవరి 2: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జరిగిన బదిలీల్లో అనంతసాగరం ఎంపీడీవో మదుసుదన్‌రావు చిత్తూరుకు వెళ్లగా కుప్పంలో పనిచేస్తున్న ఎంపీడీవో షేక్ తాజ్‌మాస్రూర్ అనంతసాగరంకు బదిలీపై వచ్చి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

సంగం ఎంపీడీవోగా శేషగిరిరావు

సంగం, ఫిబ్రవరి 2: సంగం ఎంపీడీవోగా చిత్తూరు జిల్లాకు చెందిన పి శేషగిరిరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న గోపీ త్వరలో జరగనున్న ఎన్నికల్లో భాగంగా చిత్తూరుకు బదిలీ అయ్యారు.

సీతారామపురం ఎంపీడీవోగా ఆజాద్

సీతారామపురం, ఫిబ్రవరి 2: సీతారామపురం ఎంపీడీవోగా అబ్దుల్ కలాం ఆజాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో రంగసుబ్బరాయుడు సస్పెండ్ కావడంతో ఇప్పటివరకు ఈవోపీఆర్డీ భార్గవి ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేశారు.

పాఠశాల భవనం స్వాధీనం


పాఠశాలకు తాళాలు వేసి స్వాధీనం చేసుకున్న ఎంఈవో జానకిరామ్

సంగం, ఫిబ్రవరి 2: మండలంలోని అమరపనాయుడు కండ్రిక గ్రామంలో మూతపడి ఆక్రమణకు గురైన పాఠశాల భవనాన్ని శుక్రవారం ఎంఈవో జానకిరామ్ స్వాధీనం చేసుకున్నారు. అమరపనాయుడు కండ్రికలో పాఠశాల విద్యార్థులు లేక చాలా సంవత్సరాల కిందట మూతపడింది. దీంతో పాఠశాల భవనాన్ని గ్రామానికి చెందిన ఓ వైసీపీ నాయకుడు ఆక్రమించి సొంత అవసరాలకు వాడుకుంటుండడంతో గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బాణా శ్రీనివాసులురెడ్డి స్పందనలో ఫిర్యాదు చేశారు. దీంతో ఎంఈవో జానికిరామ్ పాఠశాల భవనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

వైద్యసేవలు అందక పశుపోషకుల అవస్థలు

అనంతసాగరం, ఫిబ్రవరి 2: స్థానిక పశువైద్యశాలలో వైద్యసేవలు సక్రమంగా అందడంలేదని పశుపోషకులు వాపోతున్నారు. రెండేళ్ల క్రితం డాక్టర్ సుబ్బానాయుడు పర్యవేక్షణలో ఇక్కడ మూగజీవాలకు మెరుగైన వైద్యసేవలు అందేవి. కలువాయి, చేజర్ల, రాపూరు మండల రైతులు కూడా పశువులను తీసుకొచ్చి అనంతసాగరంలో వైద్యసేవలు పొందేవారు. ఆయన బదిలీ అనంతరం రెగ్యులర్ డాక్టర్‌ను నియమించలేదు. ఇక సిబ్బందే గత్యంతరం కాగా, వైద్యసేవలు సక్రమంగా అందక పశుపోషకులు అవస్థలు పడుతున్నారు.

పొగాకు రైతులను వెంటాడుతున్న కష్టాలు!

కలిగిరి, ఫిబ్రవరి 2: కలిగిరి పొగాకు బోర్డు వేలం కేంద్రం పరిధిలో రైతులను కష్టాలు వెంటాడుతోన్నాయి. 2023-24 పంటకాలానికి 1300 బ్యారన్‌లు రిజిస్ట్రేషన్ కాగా, ఒక్కో బ్యారన్‌కు 7.5 ఎకరాలు సాగుకు బోర్డు అధికారులు అనుమతి ఇచ్చారు. అయితే గతేడాది నవంబరు నెలలో వర్షాలు కురవడంతో అదునుకు వర్షం పడిందనే సంతోషంతో రైతులు పంట సాగు చేశారు. ఈ వర్షం అధికంగా పడటంతో పొగాకు పంట ఎదుగుదల లోపించి తోటలు గిటకబారాయి. ఈ క్రమంలో రైతు బోర్డు అనుమతించిన 7.5 ఎకరాలకు అదనంగా మరో 2.5 ఎకరాల వరకు సాగుచేశారు. ఆ తరువాత డిసెంబరు, లేదా జనవరి నెలలో కనీసం ఒక వర్షం అయినా పడుతుందనే ఆశతో సాగు చేసిన రైతుకి వరుణుడు ముఖం చాటేశాడు. దీంతో పొగాకు తోటలకు నీరు పెట్టాల్సిన అవసరం ఏర్పడింది. అదనంగా సాగు చేయడంతో నీటి కష్టాలు తోడయ్యాయి. దీనికితోడు పొగాకు ఆకు కొట్టే ముఠా(కూలీలు)కు ఎకరాల దామాషా ప్రకారం కూలీ చెల్లించాల్సి రావడంతో మొత్తం మీద బ్యారన్‌కు 20శాతం మేర పెట్టుబడుల భారం అధికమైంది. దీంతో దిగుబడులు వచ్చినా నాణ్యత అంతంత మాత్రం వస్తుండటంతో పొగాకు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక విస్తీర్ణంలో పొగాకు సాగుచేసి ఇబ్బందులు పడవద్దని రైతులకు సూచిస్తున్నట్లు బోర్డు అధికారులు తెలియజేస్తున్నారు. ఏది ఏమైనా ఈ ఏడాది పొగాకు రైతుకు సాగు నుంచే కష్టాలు వెన్నంటి ఉన్నాయని, దిగుబడి, నాణ్యత, ధరల ప్రభావం పొగాకు రైతును ఎటు తీసుకెళ్తుందో అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కోళ్ల వ్యర్థాలతో అవస్థలు


ట్యాంక్ బండ్‌పై ఉన్న కోళ్లను తరలించే ఇనుప బుట్టలు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 2: కోళ్లను రవాణా చేసే వాహనాలు పట్టణంలోని ట్యాంక్‌బండ్‌పై వ్యర్థాలను పడేస్తుండడంతో అపరిశుభ్రత నెలకొంటుంది. ట్యాంక్‌బండ్‌పై ఆహ్లాదకర వాతావరణం ఉండడంతో పట్టణ ప్రజలు వాకింగ్ చేయడం, సాయంత్రం సమయంలో అక్కడే కూర్చొని సేదతీరుతుంటారు. వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. అయితే కోళ్ల వ్యర్థాల వల్ల దుర్వాసన వెదజల్లుతుండడంతో ప్రజలు అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పల్లెల్లో పేకాట జోరు!

● అప్పుల ఊబిలో కూరుకుపోతున్న జూదరులు

● విచ్ఛిన్నమవుతున్న పచ్చని సంసారాలు


శాఖవరంలో పోలీసులకు పట్టుబడ్డ పేకాటరాయుళ్లు (ఫైల్)

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 2: మండలంలో పేకాట జోరుగా సాగుతోంది. అందినకాడికి అధిక వడ్డీలకు అప్పులు చేసి పేకాటలో పోగొట్టుకుంటున్న జూదరులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. దీంతో పచ్చని సంసారాలు విచ్చిన్నం అవుతోన్నాయి. పోలీసులు దాడులు చేస్తున్నా రోజుకో చోటకు పేకాట నిర్వహణ కేంద్రాలను మార్చి పోలీసులకే సవాలు విసురుతున్నారు. మండలంలోని శాఖవరం, అయ్యవారిపల్లె, చుండి, పోలినేనిచెరువు, మాలకొండ, శింగమనేనిపల్లె, పోకూరు, పోలినేని పాలెం, కళవళ్ల, నలదలపూరు, రామలింగాపురం తదితర గ్రామాల్లో పేకాట జోరుగా నిర్వహిస్తున్నారు. ఇళ్లు, కొండలు, గుట్టలు, అడవులు, పొలాలు అటవీ ప్రాంతాల్లోని మారుమూల గ్రామాల్లో రహస్యంగా పేకాట స్థావరాలను ఏర్పాటు చేసుకొంటున్నారు. గత వారం శాఖవరం పొలాల్లో పోలీసులు పేకాట స్థావరంపై దాడులు చేసి 10 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.1.90 లక్షలు స్వాధీనం చేసుఏకున్నారు. అలాగే గతంలో పోకూరు, శింగమనేనిపల్లె, నలదలపూరు, పోలినేనిపాలెం, చుండి తదితర గ్రామాల్లోనూ పోలీసులు దాడులు చేసిన సంఘటలు అనేకం ఉన్నాయి. పోలీసుల నుంచి తప్పించుకునే క్రమంలో గతంలో నలదలపూరులో ఓ వ్యక్తి చెరువులో దూకి మృతి చెందిన విషయం విదితమే. కాకర్లవారిపాలెం వద్ద పేకాట స్థావరానికి కాపలా ఉన్న యువకుడిని పేకాటరాయుళ్లు మద్యం మత్తులో కొట్టి చంపేశారు. ఇలా చెప్పుకుంటూపోతే పేకాట జూదం వలన అనేక సంఘటనలు చోటుచేసుకొని పలువురు మృతి చెందారు. అయినా పేకాట మాత్రం ఆగడం లేదు. రోజుకో చోట స్థావరం మార్చుకుని ఉదయం 11 గంటలకు రహస్య స్థావరానికి చేరుకుంటారు. రాత్రి 10 గంటల వరకు జూదం జరుగుతోంది. జూదరులను పేకాట స్థావరానికి చేర్చే నిర్వాహకుడే అందరి సెల్‌ఫోన్లు సేకరించి తన వద్ద ఉంచుకుంటాడు. ఓ వ్యక్తి స్థావరం నలువైపులా గస్తీ తిరుగుతుంటాడు. కార్లు, పోలీసులు, కొత్త వ్యక్తులు ఎవరైనా వస్తే వెంటనే పేకాటరాయుళ్లకు సమాచారం అందిస్తాడు. వెంటనే వారు పారిపోతారు. ఆయా ప్రదేశాలలో లక్షలలో పేకాట జరుగుతుంది. పేకాట మోజులో పడి ఆస్తులు సైతం తాకట్టు పెడుతున్నట్లు సమాచారం. అలాగే రోజుకు నూటికి రూ.10 వడ్డీకి తెచ్చి పేకాట ఆడుతున్నట్లు సమాచారం. చివరకు వడ్డీలు చెల్లించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. దీంతో ఎన్నో కుటుంబాలు వీధిన పడుతుండగా కొందరు బయటకు చెప్పుకోలేకపోతున్నారు. పోలీసులు దాడులు చేస్తున్నా పోలీసుల కళ్లుగప్పి రోజుకో స్థావరం ఏర్పాటు చేసుకొని జోరుగా పేకాట నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా పోలీస్ అధికారులు నిఘా పెట్టి మూడు ముక్కలాటను నియంత్రించాలని, మరిన్ని కుటుంబాలు వీధినపడి ఆత్మహత్యలు చేసుకోకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

భూ పంపిణీ చేయకుండా బడుగులకు ద్రోహం

● ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నేతలు

కావలి, ఫిబ్రవరి 2: అసైన్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి నియోజకవర్గంలో భూ పంపిణీకి ప్రయత్నించకపోవడం బడుగులకు ద్రోహం చేయడమేనని దళిత సంరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కావలి ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేసి ఆర్డీవో శీనానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల వేళ జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో భూ పంపిణీకి సిద్ధమవుతుండగా కావలి నియోజకవర్గంలో ఎమ్మెల్యే పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రతి మండలంలో వివిధ రకాల ప్రభుత్వ భూములు 1,500 ఎకరాల వరకు ఉన్నా ఎమ్మెల్యే భూ పంపిణీ చేపట్టలేదన్నారు. నియోజకవర్గంలో 3వేల ఎకరాలలో గ్రావెల్ ఎత్తుకుని అమ్ముకునేందుకు రియల్‌ఎస్టేట్ వ్యాపారులను ప్రోత్సహించి వ్యవసాయ భూములను సాగుకు పనికి రాకుండా చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా పేదలపై మ్మెల్యేకి దయ ఉంటే ఎన్నికల కోడ్ వచ్చే లోపు భూ పంపిణీకి చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో యానాది సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు బాపట్ల సత్యవతమ్మ, ఎమ్మార్పీఎస్ నాయకుడు జరుగుమల్లి విజయరత్నం, నేతలు నారుబోయిన లక్ష్మీనర్సు, చౌటూరు వెంకటరత్నం, పోట్లూరు విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాలకొండలో దుకాణాలకు వేలం

● 4 షాపులకు రూ.22.13 లక్షలు రాబడి


వేలం నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 2 : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయ దుకాణాలకు మాలకొండ కల్యాణ మండపంలో శుక్రవారం కందుకూరు జనార్దనస్వామి ఆలయం కార్యనిర్వాహణాధికారి బైరాగిచౌదరి పర్యవేక్షణలో బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. 12 దుకాణాలకు వేలం నిర్వహించగా వివిధ కారాణాలతో 8 దుకాణాల వేలం వాయిదా పడింది. 4 షాపుల వేలం పాటల ద్వారా ఆలయానికి రూ.22.13 లక్షలు రాబడి వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ కేబీ.శ్రీనివాసరావు తెలిపారు. నెయ్యి, పాలు విక్రయానికి రూ.89 వేలు, బొమ్మలు దుకాణం-1 రూ.3,72,000, బొమ్మల దుకాణం-2 రూ.3,21,000, రెండు కూల్‌డ్రింక్స్ దుకాణాలు రూ.14,31,000 పాడుకున్నారు. మిగిలిన తలనీలాలు, కొబ్బరిచిప్పలు, వాహన పార్కింగ్ రుసుం, చీరలు, జాకెట్ పీసులు, కొబ్బరికాయలు రెండు దుకాణాలు, అద్దములు, ఫొటోలు దుకాణాం, ఫలహరశాల, పాదరక్షలు భద్రపరచు తదితర వాటికి సరైన పాట రానందున వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు.

దళితులపై దౌర్జన్యం తగదు


డీటీకి వినతిపత్రం ఇస్తున్న దళితులు

బిట్రగుంట, ఫిబ్రవరి 2: పేద దళితులపై దౌర్జన్యం చేస్తున్న పెత్తందారులపై అధికారులు చర్యలు తీసుకోవాలని కావలి డివిజన్ అంబేడ్కర్ మిషన్ కన్వీనర్ బత్తుల రవిచంద్ర కోరారు. ఈ మేరకు శుక్రవారం బోగోలు తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారు వెంకటేశ్వర్లుకు దళితులతో కలసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమామహేశ్వరపురంలో నివాసముంటున్న కాకాని నాగరాజు కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పో షించుకుంటున్నాన్నారు. గ్రామంలోని సర్వే నంబరు 95లో ఉన్న ప్రభుత్వ భూమిలో ఏడేళగా వ్యవసాయం చేసుకుంటుండగా గత నెల జనవరి 25వ తేదీన వర్షాభావ పరిస్థితుల కారణంగా నువ్వు పంట చల్లుకున్నాడన్నారు. దానిని దగదర్తి మండలానికి చెందిన కాసుల ప్రభాకర్ అనే వ్యక్తి ఫిబ్రవరి 8వ తేదీన దౌర్జన్యంగా దున్నేశాడని, దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అధికారులు స్పందించి నాగరాజుకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానికులు రమణయ్య, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, శీనయ్య, పెంచలయ్య, కే.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం అధ్వానం

● వీధుల్లోనే చెత్తకుప్పలు ● అంతర్గత రహదారుల పరిస్థితి దయనీయం


కోవూరురోడ్డులోని సాయినగర్‌లో కాలువలో పేరుకుపోయిన మురుగు

కందుకూరు, ఫిబ్రవరి 2: కందుకూరు పట్టణంలో పారిశుధ్యం నిర్వహణ అధ్వానంగా ఉంది. సరైన ప్రణాళిక, పర్యవేక్షణ లేక అధ్వానంగా ఉన్న పారిశుధ్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారులలో మినహా శివారు ప్రాంతాలు, నివాస ప్రాంతాల్లో పారిశుధ్యం నిర్వహణ మరీ దారుణంగా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారులలో కూడా అనేకచోట్ల మూడు నాలుగు రోజులు చెత్త తొలగించకపోతుండటంతో నడిరోడ్లపైనే చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ఇక నాలుగైదు ప్రధాన రహదారులు దాటి లోపలి నివాస ప్రాంతాలు ఉండే వీధుల్లోకి వెళ్లితే పారిశుధ్యం దారుణంగా ఉంటుంది. ఇక శివారు కాలనీలలో అయితే పరిస్థితి చెప్పాల్సిన అవసరం లేదు. అనేక ప్రాంతాలలో నెలకు ఒక్కసారి కూడా మురుగు కాలువలు శుభ్రం చేస్తున్న పరిస్థితి లేకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుర్రంవారిపాలెం, వరపర్లపాలెం, కోవూరు రోడ్డు సాయి నగర్, బలరామయ్య తోట, సింహాద్రి నగర్, మాయబజార్, కాళిదాసువారి వీధి, నందావారి వీధి, విప్పగుంట రోడ్డు ప్రాంతాలలో మురుగు కాలువల్లో మురుగు పేరుకపోయి దర్శనమిస్తోంది. ఇటీవల మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమ్మె కారణంగా కొద్ది రోజులు మురుగు కాలువలను శుభ్రం చేయకపోవడంతో పట్టణ మంతా చెత్తాచెదారం పేరుకుపో యింది. సమ్మె విరమించాక కార్మికు లకు అదనపు పనిపడటం దీనికితోడు పర్యవేక్షణ కూడా అంతంతమాత్రంగా మారడంతో అనేక ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ జరిగి నెలరోజులకు పైనే అయింది. దీంతో ఎక్కడి మురుగు అక్కడే పేరుకుపోయి ఉంది. ఇక మున్సిపాలిటీ పరిధిలో ఉన్న గ్రామాల వైపు అయితే ఏడాదికి ఒకటి రెండు సార్లు కూడా పారిశుధ్య కార్మికులు కన్నెత్తి చూడని పరిస్థితి ఉంది. దీంతో గ్రామాల్లో మురుగు కాలువల పరిస్థితి మరింత దారుణంగా మారిపోయా యి. పలుచోట్ల అంతర్గత రహదారులు సొతం అధ్వానంగా ఉన్నాయి. మున్సిపల్ కమిషనర్ ప్రత్యేక దృష్టి పెట్టి అన్ని ప్రాంతాలలో పారిశుధ్యం నిర్వహణ సక్రమంగా జరిగేలా సంబంధిత అధికారులు బాధ్యతతో పర్యవేక్షించేలా చూడాలని కోరుకుంటున్నారు.

కామాక్షితాయి, మల్లికార్జునస్వామి ఆలయ నిర్మాణ పనులు పరిశీలన

కావలి, ఫిబ్రవరి 2: పట్టణ పరిధిలోని బుడంగుంట క్రాస్ రోడ్డు వద్ద నిర్మాణంలో ఉన్న కామాక్షితాయి మల్లికార్జునస్వామి ఆలయ నిర్మాణ పనులను శుక్రవారం స్థపతి సురేంద్ర, ఏఈ మురళీ మోహన్‌లు పరిశీలించారు. పూర్తిస్థాయి నిర్మాణానికి అంచనాలను సిద్ధం చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు ద్రోణాదుల వెంకటకృష్ణారెడ్డి, లక్ష్మీసంపూర్ణమ్మలతో అక్కడ చేపట్టాల్సిన పనులపై సమీక్షించారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి సహకారంతో దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎండోమెంట్ కమిషనర్ జవహర్‌ను కలవడంతో వారి ఆదేశాల మేరకు ఆలయ నిర్మాణ అంచనాలకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

రక్త దానంతో ప్రాణదాతలుగా నిలవండి


రక్తదానం చేస్తున్న ఉపాధ్యాయులు

కావలి రూరల్, ఫిబ్రవరి 2: ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారికి ప్రాణదాతలుగా నిలవాలని సర్వాయపాలెం జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పాటూరి వెంకటరమణ పేర్కొన్నారు. మండలంలోని సర్వాయపాలెం హైస్కూల్‌లో శుక్రవారం రక్తదానంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది. టీవీఎస్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ తోట వెంకటేశ్వర్లు పాల్గొని రక్తదానంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఉపాధ్యాయులు సీహెచ్.వెంకటేశ్వర్లు, పీవీకే.భాస్కర్, వై.సుధాకర్, ఎం.సమీర్ రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బృందం కె.హరినారప రెడ్డి, డీవీ.పద్మావతి, శేషమ్మ, వెంకటేశ్వర్లు, అనిల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ బీసీ పాయింట్ ప్రారంభం


బ్యాంక్ మేనేజర్ లక్ష్మణ్‌ను సత్కరిస్తున్న స్థానికులు

కావలిటౌన్, ఫిబ్రవరి 2: పట్టణంలోని ముసునూరు యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ముసునూరులో ఏర్పాటు చేసిన బీసీ పాయింట్‌ను శుక్రవారం బ్యాంక్ మేనేజర్ లక్ష్మణ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న అవసరాల కోసం బ్యాంక్ వద్దకు రాకుండా బీసీ పాయింట్ ద్వారా రూ.1000 నుంచి రూ.1,00,000 వరకు విత్‌డ్రా చేసుకోవచ్చన్నారు. రైతులు, చిన్న వ్యాపారులు, పొదుపు సంఘాల మహిళలు బీసీ పాయింట్‌లు సద్వినియోగం చేసుకుని సమయం ఆదా చేసుకోవచ్చన్నారు. అనంతరం ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్యాక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి ట్రై సైకిల్ వితరణ


దివ్యాంగురాలికి అందజేస్తున్న ట్రై సైకిల్

కావలి, ఫిబ్రవరి 2: దివ్యాంగురాలు పీ.వెంకటలక్ష్మికి సక్షం సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పాతూరు కృష్ణమందిరం వద్ద శుక్రవారం రియల్టర్ జనిగర్ల మహేంద్రయాదవ్ మూడు చక్రాల సైకిల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సక్షం సంస్థ ప్రతినిధులు డాక్టర్ కే.మాధవరెడ్డి, నాగమణి, మంగళగిరి వేణుగోపాల్, మాజీ కౌన్సిలర్ పొనుగోటి అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

వెంకయ్య నాయుడును కలిసిన భరత్‌కుమార్


వెంకయ్యనాయుడుకి కృష్ణుడి బొమ్మ అందజేస్తున్న భరత్‌కుమార్

కావలి, ఫిబ్రవరి 2: భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడికి పద్మవిభూషణ్ అవార్డు వచ్చిన సందర్భంగా శుక్రవారం హైద్రాబాద్‌లోని ఆయన నివాసంలో బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు జీ.భరత్‌కుమార్ యాదవ్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం భరత్‌కుమార్ యాదవ్ తాను వెంకయ్య నాయుడిని కలవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.